Pubilshed from Vijayawada PRGI NO : APTEL/2011/41440

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com




విజయవాడ VIJAYAWADA | సంపుటి : 15 Vol.No : 15 | సంచిక : 145 Issue No : 145 | శనివారం Saturday | సెప్టెంబర్ 12, 2026 12 SEPTEMBER 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి Editor : Ankireddypalle Ramamohan Reddy | పేజీలు : 12 Pages 12 | వెల : 3 రూ Rs 3/-

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana



# పనుల్లో జాప్యం.. ప్రజలకు అవరోధం..

- మంత్రులు, కార్యదర్శులు, కలెక్టర్లు వెంటనే పరిష్కృతం చేయాలి
- ఇక ఆన్‌లైన్‌లోనే అన్ని దస్త్రాల నిర్వహణ..నెలరోజుల్లో భౌతిక ఫైళ్లకు ముగింపు
- స్వర్ణ గ్రామ, వార్డు సిబ్బంది జాబ్‌ఛార్ట్ సిద్ధం చేయండి
- 8వ జిల్లా కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు
- సమావేశానికి గైర్హాజరైన అధికారులపై సీఎం ఆగ్రహం...వివరణ తీసుకోవాలని సీఎస్‌కు ఆదేశం
- రెండ్రోజుల్లోపు ఫైళ్లు క్లియర్ చేసినవారికి అభినందనలు... గంటల్లో పూర్తి చేసిన వారికి సీఎం ప్రత్యేక ప్రశంసలు

**ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి :** ప్రభుత్వంలో పాలన వేగంగా సాగాలంటే దస్త్రాల పరిష్కరించడంలో జాప్యం ఉండకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. మంత్రులు, కార్యదర్శులు, కలెక్టర్లు దస్త్రాలను త్వరితగతిన క్లియర్ చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఫైళ్లను సకాలంలో క్లియర్ చేయకుండా జాప్యం చేస్తున్న అధికారుల తీరుపై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజులు లేదా అంతకంటే తక్కువ సమయంలో ఫైళ్లను క్లియర్ చేసిన అధికారులను ప్రశంసించిన సీఎం.. గంటల్లోనే ఫైళ్లను క్లియర్ చేసిన వారిని ప్రత్యేకంగా అభినందించారు. నాలుగు రోజుల సమయం తీసుకుంటున్న మంత్రులు ఫైళ్ల క్లియరెన్స్‌ను వేగవంతం చేయాలని సూచించారు. కలెక్టర్ల సదస్సుకు కొందరు అధికారులు హాజరుకాకపోవడంపై సీఎం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారుల గైర్హాజరుపై వివరణ తీసుకోవాలని సీఎస్ సాయి ప్రసాద్‌ను ఆదేశించారు. ఐఏఎస్ అధికారుల 360 డిగ్రీల నివేదికను కూడా అందరి అభిప్రాయాలు తీసుకుని తయారు చేస్తామని తెలిపారు. కార్యదర్శులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ వచ్చినప్పుడే పనితీరును సవరించుకోగలమని చెప్పారు. అన్ని ప్రభుత్వ శాఖలు ఇక ఆన్‌లైన్ ద్వారానే ఫైళ్లను నిర్వహించాలని, ఇందుకు నెల రోజుల గడువు ఇస్తున్నామని తెలిపారు. మాన్యువల్ ఫైళ్లు నడిపితే ఇకపై తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు. మాన్యువల్ ఫైళ్ల నిర్వహణపై నెల రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశిస్తూ.. ఈ అంశంపై మంత్రులు కూడా దృష్టి పెట్టాలని సూచించారు.

2 పేజీలో..



# భారత్‌కు బ్రిక్స్ సవాల్..

- రూ. 21.57 లక్షల కోట్లకు చేరిన వాణిజ్య లోటు!
- బ్రిక్స్ దేశాలతో భారీగా పెరిగిన భారత వాణిజ్య లోటు
- 226 బిలియన్ డాలర్ల లోటుతో ఆందోళన..పరిష్కారంపై భారత్ దృష్టి
- చైనా, రష్యాల నుంచే అధికంగా వాణిజ్య లోటు నమోదు
- భారత ఉత్పత్తులకు మార్కెట్ అవకాశాలు కల్పించాలని డిమాండ్
- ఫార్మా, ఆటోమొబైల్ రంగాల్లో అవకాశాలపై ప్రధానంగా చర్చ

న్యూఢిల్లీ : భారత్ ఆతిథ్యమిస్తున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో కూటమితో దేశానికి నానాటికీ పెరుగుతున్న వాణిజ్య లోటు అంశం ప్రధానంగా చర్చకు వచ్చింది. బ్రిక్స్ దేశాలతో (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా) భారత్ వాణిజ్య లోటు 2025-26 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో 226.1 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 21.57 లక్షల కోట్లు)కు చేరడం ఆందోళన కలిగిస్తోంది. గత ఐదేళ్లలో బ్రిక్స్ దేశాలతో భారత్ మొత్తం వాణిజ్యం రెట్టింపై సుమారు 417.5 బిలియన్ డాలర్లకు చేరినప్పటికీ, లోటు కూడా అదే స్థాయిలో పెరగడం గమనార్హం.

- మిగతా 2లో..

# సంక్షేమం కోసం సంక్షోభం వద్దు..

## పెద్ద కుటుంబాలను ప్రోత్సహించేలా సంక్షేమం..

- ఇదే కూటమి ప్రభుత్వ విధానం
- కొత్త పెన్షన్లకు ముందే ఫ్యామిలీ యూనిట్ మ్యాపింగ్ పూర్తవ్వాలి
- అసంపూర్తిగా ఉన్న కాపు భవనాలను పూర్తి చేయండి
- యానాటి కొండ సామాజికవర్గానికి ఎస్టీలకు కలిగే ప్రయోజనాలు
- సూపర్ సిక్స్ పథకాల అమలుపై కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు



**ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి:** సంక్షేమ పథకాల ప్రయోజనాల కోసం చిన్న కుటుంబాలుగా విడగొట్టకుండా... భవిష్యత్తులో అన్ని పథకాలను ఫ్యామిలీ యూనిట్‌గానే అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్ర బాబు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. కొత్త పెన్షన్ల జారీకి ముందే కు టుంబాల మ్యాపింగ్ చేపట్టాలని, ప్రస్తుతం ఉన్న లబ్ధిదారులను యథాతథంగా కొనసాగిస్తూనే ఈ ప్రక్రియను పూర్తి చేయాలని సూచిం చారు. రేషన్, పెన్షన్ల కోసం కుటుంబాలు చిన్న కుటుంబాలుగా మారి పోవడం సరికాదన్నారు. పెద్ద కుటుంబానికి ప్రాధాన్యం ఇవ్వడం, ఆ కుటుం బానికి ఎక్కువ ప్రయోజనాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఇదే ప్రభుత్వ విధానమని.. దానికి అనుగుణంగానే పాలసీలు, కార్యాచరణ ఉండాలని సీఎం చంద్రబాబు వెల్లడించారు. 8వ కలెక్టర్ల సమావేశం రెండో రోజున శుక్రవారం సూపర్ -6 పథకాలపై కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు.

- మిగతా 2లో..

## నేతన్న భరోసా పెన్షన్ దరఖాస్తు కోసం బ్యాంక్ స్టేట్‌మెంట్

# అవసరం లేదు

- రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత
- మాస్టర్ వీవర్ ఇచ్చే ధ్రువీరణ పత్రం, వేతన వివరాలు ఇస్తే సరిపోతుందన్న సవిత
- బ్యాంక్ స్టేట్‌మెంట్ సేకరణలో కార్మికులు ఇబ్బంది పడుతున్నారన్న మంత్రి
- అర్హులైన నేతన్నలందరికీ పింఛన్లు ఇస్తామని హామీ



**ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌లోని చేనేత కార్మికులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించింది. 'నేతన్న భరోసా' పెన్షన్ పథకం దరఖాస్తు ప్రక్రియలో అత్యంత కీలకమైన నిబంధన నుంచి మినహాయింపు ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇకపై పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునే నేతన్నలు బ్యాంక్ ఖాతా సమర్పించాల్సిన అవసరం లేదని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత వెల్లడించారు.

2 పేజీలో..



# శభాష్ కలెక్టర్ హిమాన్స్ శుక్లా..

- ఈ-ఫైళ్ల క్లియరెన్స్‌లో నెల్లూరు జిల్లా కలెక్టర్‌కు రాష్ట్రంలో ప్రథమ స్థానం
- సగటున 5 గంటల 29 నిమిషాల్లోనే ఫైళ్ల పరిష్కారం - 100 శాతం డిస్పోజల్
- రెండో రోజు కలెక్టర్ల కాన్ఫరెన్స్లో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాను ప్రత్యేకంగా అభినందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- కలెక్టర్ వినూత్నంగా చేపట్టిన "పల్లె వీక్షణ"కు సీఎం ప్రశంసలు

**ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి:** ప్రభుత్వ పరిపాల నలో వేగం, పారదర్శకత, సమర్థతకు ప్రాధాన్యతనిస్తూ ఈ-ఫైళ్లను సత్వరమే పరిష్కరించడంలో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా అగ్రస్థానంలో నిలిచింది.

2 పేజీలో..

## రూ.249.50 కోట్లతో 22 కీలక ఆరోగ్య

# ప్రాజెక్టులు ప్రారంభం

## నేడు కేంద్ర మంత్రి జేపీ నడ్డా, ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభం

- 10 అత్యవసర చికిత్స కేంద్రాలు.. 12 సమగ్ర ప్రజారోగ్య ప్రయోగశాలలు
- రాష్ట్రంలో 500 అదనపు అత్యవసర చికిత్స పడకలు అందుబాటులోకి
- వ్యాధులను ముందుగానే గుర్తించేందుకు బలమైన పరీక్షా వ్యవస్థ
- మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి

**ప్రజాభూమి ప్రతినిధి అమరావతి :** రాష్ట్ర ప్రజలకు అత్యవసర పరిస్థితుల్లో సకాలంలో మెరుగైన వైద్యం అందించడంతోపాటు, వ్యాధులను తొలిదశలోనే గుర్తించి నియంత్రిం చేందుకు రూ.249.50 కోట్లతో పూర్తి చేసిన 22 కీలక ఆరోగ్య ప్రాజెక్టులను నేడు ప్రారంభించనున్నట్లు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

వివరాలు 2లో..



# శతాబ్దాల సమస్యలు.. సత్వర పరిష్కారం..

- సుదీర్ఘంగా వివాదంలోని రూ.5 వేల కోట్ల విలువైన 31 వేల ఎకరాలకు విముక్తి
- ఏపీకి వచ్చే పరిశ్రమల్లో స్థానికులకే ఉద్యోగాలు దక్కేలా నైపుణ్య శిక్షణ
- పీఎం సూర్యఘర్ పథకాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేయండి
- 8వ జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు

**ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి:** రాష్ట్రంలోని భూముల వివాదాల ను పరిష్కరించే దిశగా కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడిం చారు. గత ప్రభుత్వం నిర్వాకం వల్ల చాలా భూములు వివా దాల్లోకి వెళ్లాయని... ఈ వివా దాలను పరిష్కరించడం తోపా టు... శతాబ్ద కాలం నుంచి వివా దంలో ఉన్న భూ సమస్యలను సైతం పరిష్కరిస్తు న్నామని చెప్పారు. దీంట్లో భాగంగా ఇప్పటి వరకు 232 సుదీర్ఘ కాలం పెండింగులో ఉన్న భూ వివాదాలను క్లియర్ చేశామని.. వీటి విలువ సుమారు. రూ. 5 వేల కోట్లు ఉంటాయని.. మొత్తం గా సుదీర్ఘంగా వివాదంలో ఉన్న 31 వేల ఎకరాలకు విముక్తి కల్పించామని సీఎం చెప్పారు.

వివరాలు 2లో..






# అమెరికాను వణికించిన భీకర దాడికి 25 ఏళ్లు

న్యూయార్క్: ప్రపంచ చరిత్రలోనే అత్యంత దారుణమైన ఉగ్రవాద దాడి జరిగి నేటికి సరిగ్గా 25 ఏళ్లు పూర్తయ్యాయి. 2001 సెప్టెంబర్ 11న అల్ ఖైదా ఉగ్రవాదులు అమెరికాపై జరిపిన భీకర దాడులు ఆ దేశాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేశాయి. ఆ రోజు ఉదయం ఉగ్రవాదులు హైజాక్ చేసిన విమానాలు న్యూయార్క్‌లోని వరల్డ్ ట్రేడ్ సెంటర్ (డబ్ల్యూటీసీ) జంట టవర్లను బలంగా ఢీకొట్టాయి.

2 పేజీలో..



# స్టాక్ మార్కెట్లలో భారీ నష్టాలు

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం ఉదయం భారీ నష్టాల్లో కొనసాగాయి. ఉదయం 9.46 గంటలకు నిఫ్టీ 230 పాయింట్లు కోల్పోయి 23,247 వద్ద, సెన్సెక్స్ 654 పాయింట్లు పడిపోయి 74,248 వద్ద ట్రేడయ్యాయి. నిఫ్టీ-50 లో హిందాల్కో, ఇండస్టీన్, టాటా స్టీల్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు అత్యధిక నష్టాలను చవిచూశాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా 1.42 శాతం, 1.40 శాతం చొప్పున క్షీణించాయి.

- మిగతా 2లో..

# అమెరికాను వణికించిన భీకర దాడికి 25 ఏళ్లు

ఉదయం 8:46 గంటలకు మొదటి విమానం నార్త్ టవర్‌ను, 9:03 గంటలకు రెండో విమానం సౌత్ టవర్‌ను ఢీకొనడంతో క్షణాల్లోనే ఆ భవనాలు కుప్పకూలి అగ్నికీలల్లో చిక్కుకున్నాయి. అనంతరం ఉదయం 9:37 గంటలకు మూడో విమానం వాషింగ్టన్ డిసి సమీపంలోని పెంటగన్ భవనాన్ని ఢీకొట్టింది. కాగా, నాలుగో విమానం (యునైటెడ్ ఎయిర్‌లైన్స్ ఫ్లైట్ 93)లో ప్రయాణికులు ఉగ్రవాదులను అడ్డుకోవడంతో అది పెన్సిల్వేనియాలోని ఒక ఖాళీ ప్రదేశంలో కూలిపోయి, పెద్ద ప్రమాదం తప్పింది. ఈ వరుస దాడుల్లో దాదాపు 3,000 మంది నిరపరాధులు ప్రాణాలు కోల్పోయారు. సుమారు వెయ్యి మంది మృతదేహాలను ఇప్పటికీ గుర్తించకపోవడం గమనార్హం.

# శభాష్ కలెక్టర్ హిమాన్స్ శుక్లా...

అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరుగుతున్న జిల్లా కలెక్టర్ల సమావేశంలో రెండో రోజు శుక్రవారం గత మూడు నెలల ఈ–ఫైళ్ల క్లియరెన్స్‌పై సమీక్షించగా, రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లలో నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ప్రథమ స్థానంలో నిలినట్లు సీఎం ప్రకటించారు. 2026 జూన్ 1 నుంచి సెప్టెంబర్ 10 వరకు నెల్లూరు జిల్లా కలెక్టర్ మొత్తం 1,492 ఫైళ్లను పరిష్కరించి 100 శాతం డిస్పోజల్ రేటును సాధించారు. ఒక్క ఫైలు కూడా పెండింగ్‌లో లేకపోవడం విశేషం. అంతేకాకుండా, ప్రతి ఫైల్‌ను పరిష్కరించేందుకు పట్టిన సగటు సమయం కేవలం 5 గంటల 29 నిమిషాలు, 22 సెకన్లు మాత్రమే కావడం ద్వారా వేగవంతమైన, సమర్థవంతమైన పరిపాలనను చాటింది. ఈ సందర్భంగా ఈ–ఫైళ్లను వేగంగా పరిష్కరిస్తూ పరిపాలనా సామర్థ్యాన్ని చాటిన జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా అభినందించారు. ప్రజలకు సంబంధించిన అంశాలు, ప్రభుత్వ పరిపాలనా వ్యవహారాల్లో ఫైళ్లను పెండింగ్‌లో ఉంచకుండా సత్వర నిర్ణయాలు తీసుకోవడం ద్వారా పరిపాలనను మరింత వేగవంతం చేయడంపై ముఖ్యమంత్రి ప్రశంసలు వ్యక్తం చేశారు.

**'కలెక్టర్ వినూత్నంగా చేపట్టిన "పల్లె వీక్షణ"కు సీఎం ప్రశంసలు :** జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా వినూత్నంగా చేపట్టిన 'పల్లె వీక్షణ' కార్యక్రమాన్ని కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభినందించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలను నేరుగా తెలుసుకుని, సంబంధిత అధికారుల సమన్వయంతో వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం ద్వారా పల్లె వీక్షణ కార్యక్రమం ప్రజలకు పరిపాలనను మరింత చేరువ చేస్తోందని ప్రశంసించారు. ఇటీవల పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్‌లోనూ నెల్లూరు జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలవగా, తాజాగా ఈ–ఫైళ్ల క్లియరెన్స్‌లోనూ ప్రథమ స్థానం సాధించడం జిల్లా కలెక్టర్ పనితీరుకు మరో నిదర్శనంగా నిలిచింది. ముఖ్యమంత్రి అందించిన ప్రశంసలు, ప్రోత్సాహంతో ఇదే స్ఫూర్తితో మరింత వేగంగా, సమర్థవంతంగా ప్రజలకు సేవలందిస్తూ, జిల్లాను అభివృద్ధిలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు.

# నేతన్న భరోసా పెన్షన్ దరఖాస్తు కోసం బ్యాంక్ స్టేట్‌మెంట్ అవసరం లేదు

బ్యాంక్ స్టేట్‌మెంట్‌కు ప్రత్యామ్నాయంగా సంబంధిత మాస్టర్ వీవర్ (సొసైటీ/యజమాని) ఇచ్చే ధ్రువీకరణ పత్రంతో పాటు వేతన వివరాల పత్రాన్ని అందిస్తే సరిపోతుందని మంత్రి స్పష్టం చేశారు. బ్యాంకు ఖాతా స్టేట్‌మెంట్ల సేకరణలో అర్హులైన చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సాంకేతిక ఇబ్బందులను గమనించి ప్రభుత్వం ఈ సులభతర నిర్ణయాన్ని తీసుకున్నట్లు తెలిపారు. 50 ఏళ్లు నిండిన అర్హులైన నేతన్నలందరికీ తప్పకుండా పింఛన్లు మంజూరు చేస్తామని, నేతన్నల సంక్షేమానికి తమ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందోనని అన్నారు.

# భారత్‌కు బ్రిక్స్ సవాల్..

గణాంకాలను పరిశీలిస్తే.. గత ఐదేళ్లలో బ్రిక్స్ దేశాలకు భారత్ ఎగుమతులు 48.8% వృద్ధితో 95.7 బిలియన్ డాలర్లకు చేరాయి.

అయితే, ఇదే సమయంలో దిగుమతులు ఏకంగా 131.8% పెరిగి 321.8 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ప్రస్తుతం భారతదేశ మొత్తం దిగుమతుల్లో 40% బ్రిక్స్ దేశాల నుంచే వస్తుండగా, మన ఎగుమతుల్లో కేవలం 22% మాత్రమే ఆ దేశాలకు వెళ్తున్నాయి. ఈ భారీ వాణిజ్య లోటుకు ప్రధానంగా చైనా, రష్యాలే కారణమవుతున్నాయి. మొత్తం లోటులో దాదాపు సగం చైనా నుంచే ఉండగా.. యంత్ర పరికరాలు, ఎలక్ట్రానిక్స్, పారిశ్రామిక ముడిసరుకుల దిగుమతులే అధికంగా ఉన్నాయి. మరోవైపు రష్యా నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్న ముడి చమురు భారత్ ఇంధన భద్రతకు మేలు చేస్తున్నప్పటికీ, వాణిజ్య లోటును గణనీయంగా పెంచుతోంది. ఈ వాణిజ్య అసమతుల్యతను కేవలం ప్రతికూల అంశంగా చూడలేమని, ఇది నిర్మాణాత్మక లోపాన్ని సూచిస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. బ్రిక్స్ దేశాలకు భారత్ ఒక ముఖ్యమైన కొనుగోలు మార్కెట్‌గా మారింది కానీ, ఆ దేశాలకు కీలక సరఫరాదారుగా మాత్రం మారలేకపోయింది. ఈ నేపథ్యంలో బ్రిక్స్ ఛైర్మన్‌షిప్ హోదాను భారత్ ఒక అవకాశంగా వినియోగించుకుంటోంది. తమ ఉత్పత్తులకు ఇతర సభ్య దేశాల మార్కెట్లలో సమాన, సులభతర అవకాశాలు కల్పించాలని గట్టిగా పట్టుబడుతోంది. ముఖ్యంగా ఫార్మాస్యూటికల్స్, ఇంజనీరింగ్ వస్తువులు, ఆటోమొబైల్స్, ఫుడ్ ప్రాసెసింగ్, రసాయనాలు, డిజిటల్ సేవల వంటి రంగాల్లో ఉన్న టారిఫ్ యేతర అడ్డంకులను తొలగించాలని భారత్ కోరుతోంది. వేగవంతమైన కస్టమ్స్ క్లియరెన్స్, ప్రమాణాల పరస్పర గుర్తింపు వంటి అంశాలపై రంగాల వారీగా చర్చలు జరపాలని ప్రతిపాదిస్తోంది. కేవలం వాణిజ్య లోటు అంకెలను తగ్గించుకోవడంపైనే కాకుండా బ్రిక్స్ సరఫరా గొలుసులో భారత్‌ను ఒక కీలక భాగస్వామిగా నిలబెట్టడం ద్వారా దీర్ఘకాలిక ప్రయోజనాలు పొందాలని కేంద్ర ప్రభుత్వం వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది.

# స్టాక్ మార్కెట్లలో భారీ నష్టాలు

సెక్టార్లలో నిఫ్టీ రియల్టీ భారీగా పతనం కాగా, నిఫ్టీ ఐటీ మాత్రమే లాభాల్లో కొనసాగింది. అంతర్జాతీయ ప్రతికూల సంకేతాలు కూడా మార్కెట్లపై ప్రభావం చూపాయి. డాలర్ ఇండెక్స్ 99.06 వద్ద, బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 107.63 డాలర్ల వద్ద ఉన్నాయి. అమెరికా 10 ఏళ్ల బాండ్ ఈల్డ్ 4.91 శాతానికి చేరింది. గత సెషన్‌లో ఎస్అండ్‌పీ 500 0.58 శాతం, నాస్‌డాక్ 0.65 శాతం నష్టపోయాయి.



# సంక్షేమం కోసం సంక్షోభం వద్దు..

మొదటి పేజీ తరువాయి

**సంక్షేమం నుంచి కుటుంబ సాధికారత విధానంతో ముందుకు :** కుటుంబంలో ఎంత మంది ఉంటే... అంత మందికి ఐదు కిలోల చొప్పున రేషన్ బియ్యం అందించేలా చూడాలని సీఎం సూచించారు. సంక్షేమ పథకాల అమలులో కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకుని సమగ్ర ప్రయోజనాలు అందించే విధానాన్ని రూపొందించాలన్నారు. వివిధ పథకాల్లో ఉన్న లోటుపాట్లను సరిచేసి అత్యుత్తమ విధానాలను రూపొందించాలని ఆదేశించారు. రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాల కోసం ఇప్పటివరకు రూ.1.50 లక్షల కోట్ల మేర ఖర్చు చేశామని చంద్రబాబు తెలిపారు. ఇందులో ఒక్క పెన్షన్లకే రూ.75 వేల కోట్లు వ్యయం చేసినట్లు వెల్లడించారు. ఆర్థిక అసమానతలను తగ్గించి ప్రజల జీవన ప్రమాణాలు పెంచేలా సంక్షేమ విధానాలు ఉండాలని అన్నారు. సంక్షేమం నుంచి కుటుంబాలను సాధికారత దిశగా తీసుకెళ్లే 'వెల్ఫేర్ టు ఎంపవరింగ్ ఫ్యామిలీస్' విధానంతో ముందుకు సాగాలని స్పష్టం చేశారు. సెర్ప్, మెప్మా ద్వారా 'వన్ ఫ్యామిలీ.. వన్ ఎంట్రప్రెన్యూర్' కార్యక్రమాన్ని విస్తృతంగా అమలు చేయాలని చంద్రబాబు సూచించారు. ఐదు లక్షల మంది మహిళలను ఎంట్రప్రెన్యూర్లుగా తీర్చిదిద్దేలా చర్యలు చేపట్టామని తెలిపారు. వివిధ సామాజిక వర్గాలను సాధికారత దిశగా తీసుకెళ్లాలి... అందర్నీ అభివృద్ధి చేయాలన్నారు. హాస్టళ్లలోని విద్యార్థులకు నాణ్యమైన ఉత్పత్తులతో పాటు మెరుగైన విద్య అందించాలని స్పష్టం చేశారు. పీ4 కార్యక్రమాన్ని మొక్కుబడిగా కాకుండా ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలని కలెక్టర్లకు సీఎం దిశానిర్దేశం చేశారు.

**విలువలతో కూడిన సమాజ నిర్మాణానికి చొరవ :** ప్రతి నెలా మొదటి తేదీని 'పేదల సేవలో' కార్యక్రమం ద్వారా సంక్షేమానికి కేటాయించామని సీఎం తెలిపారు. అదే విధంగా ప్రతి నెలా 9న 'మీ భూమి--మీ హక్కు' కార్యక్రమం ద్వారా భూ రికార్డుల ప్రక్షాళన చేపట్టాలని సూచించారు. మూడో శనివారం 'స్వచ్ఛాంధ్ర--స్వర్ణాంధ్ర' కార్యక్రమంతో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, నాలుగో శనివారం పౌరుల ఆరోగ్య నిర్వహణ కోసం డిజిటల్ హెల్త్ రికార్డుల 'సంజీవని' కార్యక్రమాన్ని అమలు చేయాలని ఆదేశించారు. వీటితో పాటు మంచి ఆలోచనలు, విలువలతో కూడిన సమాజ నిర్మాణం అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. మహిళలు, శిశువుల్లో రక్తహీనత వంటి సమస్యలను పరిష్కరించడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని, ఇదే 2047 విజన్‌లో కీలక లక్ష్యమని చెప్పారు. వక్ఫ్ ఆస్తుల ద్వారా ఆదాయం వచ్చేలా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్లను ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న కాపు కార్పొరేషన్ భవనాలను పూర్తి చేయాలని సూచించారు.

**బుడగజంగాల తరహాలో..** శ్రీకాకుళం జిల్లాలో యానాటి కొండ సామాజిక వర్గాన్ని ఎస్టీల్లో చేర్చాలనే డిమాండ్‌ను కలెక్టర్ల కాన్ఫరెన్సులో మంత్రి అచ్చెన్నాయుడు ప్రస్తావించారు. చాలా కాలంగా యానాటి కొండ సామాజిక వర్గం వాళ్లు తమను ఎస్టీల్లో చేర్చాలని కోరుతున్నారని అచ్చెన్నాయుడు తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం...ఎస్టీల్లో చేర్చే అంశం కేంద్రం పరిధిలో ఉంటుందని.. ఈలోగా ఎస్టీలకు వర్తింపచేసే ప్రయోజనాలను యానాటి కొండ సామాజిక వర్గానికి అందించాలని ఆదేశించారు. బుడగ జంగాల తరహాలో యానాటి కొండ సామాజిక వర్గానికి లబ్ది చేకూర్చాలన్నారు. ఈ సమావేశంలో మంత్రులు, సీఎస్ సాయి ప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు హాజరయ్యారు.

# శతాబ్దాల సమస్యలు.. సత్వర పరిష్కారం..

రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం జరిగిన 8వ కలెక్టర్ల కాన్ఫరెన్స్ రెండో రోజున రెవెన్యూ, విద్య, వైద్యం, నైపుణ్యాభివృద్ధి, పురపాలక, విద్యుత్ శాఖలపై ముఖ్యమంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ...'వివిధ జిల్లాల్లో దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న భూ సమస్యలకు త్వరితగతిన పరిష్కారం లభించేలా చర్యలు తీసుకోండి. అంబాజీపేటలో గ్రౌండ్ రెంట్ భూముల అంశం 120 ఏళ్ల కాలం నాటి సమస్య. అలాంటి సమస్యను పరిష్కరించగలిగాం. ప్రజల్లో నమ్మకం, విశ్వాసం కల్పించేలా చర్యలు తీసుకోవాలి. ఈ వ్యవహారాల్లో ఎక్కడా అవినీతి లేకుండా భూ సమస్యల్ని పరిష్కరించాలి. మంత్రులు, అధికారులు కూడా ఈ సమస్యల్ని పరిష్కరించిన విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాలి. రీసర్వే ప్రక్రియ పూర్తైన భూములకు బ్లాక్ చెయిన్ టెక్నాలజీతో భద్రత కల్పించాలి. నవంబరు 1 తేదీ నుంచి రియల్ టైమ్ లో ఇంటిగ్రేషన్ చేయండి. రెవెన్యూ సమస్యల పరిష్కారం... ప్రభుత్వం తీసుకుంటున్న పాలసీల గురించి ప్రజలకు వివరించాలి.'అని చెప్పారు.

**నిరంతరాయంగా నైపుణ్యాభివృద్ధి :** "రాష్ట్రంలో పరిశ్రమలు వస్తే ఉద్యోగాలు వస్తాయన్న ఆశతో యువత ఉంటారు. యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించటం నిరంతర ప్రక్రియ. పీఎం సేతు కార్యక్రమాన్ని విశాఖతో పాటు ఇతర ప్రాంతాలకూ విస్తరించి యువతకు మరిన్ని నైపుణ్యాలు కల్పించాలి. పరిశ్రమలు నుంచి సీఎస్ఆర్ నిధులతోనూ ఈ నైపుణ్యాలను కల్పించే అంశాన్ని పరిశీలించండి. ఏపీకి వచ్చే పరిశ్రమల్లో నైపుణ్యం ఉన్న మన యువతే ఉద్యోగాలు పొందేలా కార్యాచరణ చేపట్టాలి. నియోజకవర్గాల వారీగా జాబ్ ఫెయిర్లు నిర్వహించాలి. ఇప్పటి వరకూ 4.98 లక్షల మంది యువత నైపుణ్యం పోర్టల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. నైపుణ్య కల్పనపై ప్రజల్లో కూడా విస్తృత అవగాహన కల్పించాలి. స్థానిక యువతకు ఉద్యోగాల కల్పన జరగాలంటే వారికి నైపుణ్యాల్ని పెంచాల్సిన అవసరం ఉంది. నైపుణ్యాభివృద్ధి విషయంలో యువతకు ఎలాంటి నైపుణ్యాలు అవసరమో గుర్తించాలి. ఐటీఐలు, పాలిటెక్నిక్ కాలేజీలతో పాటు పరిశ్రమల్ని కూడా అనుసంధానించి అవసరమైన నైపుణ్యాలను పొందేలా చూడాలి. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ పైనా విద్యార్థులకు నైపుణ్యం సాధించేలా చూడాలి. 2027 నాటికి అక్షర ఆంధ్ర కార్యక్రమం ద్వారా వందశాతం అక్షరాస్యతను సాధించాలి. స్కూల్ బిల్డింగ్ సేఫ్టీపై ఆడిటింగ్ నిర్వహించి వాటిని సురక్షితంగా మార్చేలా చర్యలు చేపట్టాలి. లిటరేట్ లెర్న్ డ్ స్టేట్ గా ఏపీ మారాలి. స్వచ్ఛవాయు సర్వేక్షణ్ లో గుంటూరుకు జాతీయ స్థాయిలో రెండో స్థానం. నేషనల్ క్లీన్ ఎయిర్ సిటీస్ గా గుంటూరు, విజయవాడలోని వార్డులకు అవార్డులు వచ్చాయి. రూ. 1.05 కోట్ల నగదు ప్రోత్సాహంతో పాటు... జాతీయ స్థాయిలో 5 అవార్డులు ఈ ఏడాది ఏపీలోని నగరాలు దక్కించుకున్నాయి. గుంటూరు, ఏలూరు, విజయనగరం, విజయవాడ, నెల్లూరు, శ్రీకాకుళం, చిత్తూరు నగరాల్లో అత్యుత్తమ పని తీరు ఉంది. ప్రతీ నెలా ఒక రోజు సంజీవని కార్యక్రమం ద్వారా వైద్యారోగ్య పరిరక్షణపై క్షేత్రస్థాయికి వెళ్తున్నాను. ప్రజల ఆరోగ్యం అన్నది అత్యంత ముఖ్యమైన అంశం. టెక్నాలజీ ఇంటిగ్రేట్ చేసి మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలి."అని ముఖ్యమంత్రి సూచించారు.

**విద్యుత్ డిమాండ్ తీర్చేలా ప్రత్యామ్నాయ పద్ధతులు :** "జిల్లా కలెక్టర్లు సోలార్ రూఫ్ టాప్ పథకాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలి. ప్రస్తుతం విద్యుత్ డిమాండ్ చాలా ఎక్కువగా ఉంది. సూర్యఘర్ పథకం ద్వారా ఎంత ఎక్కువ ఇన్ స్టలేషన్లు జరిగితే.. విద్యుత్ ఉత్పత్తిపై అంత ఒత్తిడి తగ్గుతుంది. కేంద్రం అందిస్తున్న ఈ పథకం ద్వారా సబ్సిడీలు ఇస్తున్నారు. ఈ సబ్సిడీలను ప్రజలకు అందేలా చేయాలి. పీఎం కుసుమ్ కింద కూడా వ్యవసాయ కనెక్షన్లకు సౌరవిద్యుత్ ఏర్పాటు చేయండి. పాఠశాల భవనాలపై సౌర విద్యుత్ ప్యానెళ్లను త్వరితగతిన ఏర్పాటు చేయాలి. 28 జిల్లాల్లో 2932 భవనాలపై 47 మెగావాట్ల సోలార్ రూఫ్ టాప్ ప్యానళ్లు ఏర్పాటు చేయండి. జిల్లాల కలెక్టర్లు ఇంటింటికీ సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసి విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు సహకరించాలి. విద్యుత్ డిమాండ్ ను తీర్చేలా పంప్డ్ స్టోరేజ్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సహా వివిధ ప్రత్యామ్నాయాలకు వెళ్తున్నాం. ప్రతీ ఇంటిపైనా విద్యుత్ ఉత్పత్తి జరిగితే సరఫరా, పంపిణీ నష్టాలు గణనీయంగా తగ్గే అవకాశం ఉంటుంది. 2025–26 ఏడాదిలో సగటు విద్యుత్ కొనుగోలు ధర యూనిట్ కు రూ.4.97కి తగ్గించాం. ప్రతీ యూనిట్ కు రూ.0.23 పైసల మేర పొదుపు చేయగలుగుతున్నాం. గడచిన రెండేళ్లుగా విద్యుత్ వినియోగదారులకు ఎలాంటి టారిఫ్ పెంచలేదు."అని సీఎం చంద్రబాబు గుర్తు చేశారు.

# పనుల్లో జాప్యం.. ప్రజలకు అవరోధం..

**గ్రామాలకు వెళ్లండి...సమస్యలు పరిష్కరించండి :** కలెక్టర్ల కాన్ఫరెన్సులో ప్రజా ఫిర్యాదుల పరిష్కారం, పాలనలో టెక్నాలజీ, పాజిటివ్ పర్సెప్షన్ అంశాలపై సీఎం చంద్రబాబు జిల్లా కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. "పీజీఆర్ఎస్ దరఖాస్తులను ప్రజలకు సంతృప్తి కలిగేలా పరిష్కరించాల్సిన అవసరం ఉంది. జిల్లా స్థాయిలో కలెక్టర్లు, నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యేలు, మండల స్థాయిలో అధికారులు నాలుగు సార్లు గ్రామాలకు వెళ్తే చాలా సమస్యలు పరిష్కారమవుతాయి. ఇకపై ఈ పర్యటనల వివరాలను కూడా ఇవ్వాలి. మున్సిపాలిటీల్లోనూ ఇదే ప్రక్రియ జరగాలి. ప్రతి సోమవారం ఆర్టీజీఎస్ ద్వారా క్షేత్రస్థాయి అంశాలను సమీక్షిస్తున్నా" అని ముఖ్యమంత్రి అన్నారు.

**అన్ని శాఖల్లో టెక్నాలజీ వినియోగం :** "ప్రభుత్వ శాఖలన్నీ టెక్నాలజీ ఇంటిగ్రేషన్‌తో పనిచేయాలి. అన్ని రంగాల్లోనూ డీప్‌టెక్‌ను అమలు చేయాలి. దాని ద్వారా అదనపు అభివృద్ధిని సాధించేందుకు అవకాశం ఉంటుంది. టెక్నాలజీతో రెవెన్యూ పెంచుకోవచ్చు. సంపద సృష్టించేలా ప్రణాళికలు సిద్ధం చేయవచ్చు. డేటా లేక్‌లో కచ్చితమైన సమాచారాన్ని ఉంచేలా చర్యలు తీసుకోవాలి. ఇందుకోసం ప్రత్యేకంగా విధి విధానాలు రూపొందించాలి. డేటా లేక్‌లో ఉన్న సమాచారాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకుంటే సత్వర నిర్ణయాలు తీసుకోవచ్చు. ప్రతి ప్రభుత్వ శాఖ తమ విభాగాల్లో ఏఐ స్టాక్ టెక్నాలజీని వినియోగించాలి. జీఎస్టీలో ఏఐ స్టాక్ వినియోగం ద్వారా ఫలితాలు వస్తున్నాయి. పెద్ద ఎత్తున పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసుల్లో కూడా లీగల్ ఏఐ స్టాక్‌ను వినియోగించాలి."అని సీఎం చంద్రబాబు సూచించారు.

**సమస్యల్లేని సమాజం కోసం పనిచేయాలి :** "సమస్యలు లేని సమాజం కోసం అందరూ పనిచేయాలి. ప్రతి జిల్లాకు వచ్చినప్పుడు వివిధ పౌరసేవలపై వ్యక్తమవుతున్న ప్రజాభిప్రాయాన్ని సభల్లోనే చదివి వినిపిస్తున్నాను. ప్రభుత్వం అందించే సేవలతో పాటు సంక్షేమ పథకాలపై కూడా ప్రజల్లో సానుకూలత వ్యక్తం కావాలి. లోటుపాట్లను సవరించుకోవడం ద్వారా మరింత సమర్థంగా సేవలు, సంక్షేమ పథకాలను అందించే అవకాశం ఉంటుంది. ప్రజల కోసం స్కీంలను అందుబాటులోకి తీసుకురావడం, పాలసీలను రూపొందించడంతో పాటు వాటిని సులభంగా ప్రజలకు అందించేలా చేసినప్పుడే వాటికి సార్థకత ఉంటుంది. ప్రజల్లో పరిపాలన పట్ల సానుకూల ధోరణి వ్యక్తమయ్యేలా ప్రతి ఒక్కరూ పనిచేయాలి. సరిగా పనిచేయని వారిని పక్కన పెట్టి, పనిచేసే వ్యక్తులను గుర్తించి ప్రోత్సహించాలి."అని ముఖ్యమంత్రి చెప్పారు.

**స్వర్ణ వార్డు, గ్రామ కార్యాలయాల్లో సిబ్బంది రైషనలైజేషన్ :** "స్వర్ణవార్డు, గ్రామ కార్యాలయాలకు ఒక్కో ఈవీ సైకిల్ ఇవ్వాలి. స్వర్ణవార్డు, గ్రామ కార్యాలయాల్లో ఒక్కో ఉద్యోగికి ఒక్కో బాధ్యత మాత్రమే అప్పగించాలనే విధానం కష్టసాధ్యమైంది. కొంతమందిపై ఎక్కువ పని భారం ఉంటే.. మరికొందరికి చాలా తక్కువ పని ఉంటోంది. దీన్ని సరిచేసి రేషనలైజ్ చేయాలి. పనిభారం పెంచకుండా వివిధ బాధ్యతలను అప్పగించేలా చూడాలి. ప్రతి పంచాయతీ పరిధిలోని స్వర్ణ గ్రామ సిబ్బంది విధుల స్పష్టత కోసం జాబ్ ఛార్ట్ సిద్ధం చేయాలి" అని సీఎం ఆదేశించారు.

# రూ.249.50 కోట్లతో 22 కీలక ఆరోగ్య ప్రాజెక్టులు ప్రారంభం

కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఈ ప్రాజెక్టులు ప్రారంభమవుతాయని చెప్పారు. ఈ మేరకు మంత్రి సత్య కుమార్ శుక్రవారం ఓ ప్రకటన జారీచేశారు. రాష్ట్రంలో ప్రజారోగ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మౌలిక వసతుల పథకం కింద ఈ ప్రాజెక్టులను చేపట్టినట్లు మంత్రి తెలిపారు. రేపు ప్రారంభించనున్న 22 ప్రాజెక్టుల్లో రూ.234.50 కోట్లతో నిర్మించిన 10 అత్యవసర చికిత్స కేంద్రాలు, రూ.15 కోట్లతో ఏర్పాటు చేసిన 12 సమగ్ర ప్రజారోగ్య ప్రయోగశాలలు ఉన్నాయని వివరించారు. కరోనా సమయంలో సాధారణ ఆసుపత్రుల్లోని వార్డులను కూడా కరోనా బాధితులకు కేటాయించాల్సి రావడంతో ఇతర రోగులకు సాధారణ వైద్య సేవలు అందించడంలో ఇబ్బందులు ఎదురయ్యాయని మంత్రి గుర్తు చేశారు. భవిష్యత్తులో ఇలాంటి మహమ్మారులు, వ్యాధుల విజృంభణ, ఇతర ప్రజారోగ్య అత్యవసర పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొంటూనే సాధారణ వైద్య సేవలకు అంతరాయం కలగకుండా ప్రత్యేక ఆరోగ్య వసతులు అవసరమని కరోనా అనుభవం స్పష్టం చేసిందన్నారు. ఈ అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని అత్యవసర చికిత్స కేంద్రాలు, సమగ్ర ప్రజారోగ్య ప్రయోగశాలలను ఏర్పాటు చేస్తున్నట్లు శ్రీ సత్యకుమార్ తెలిపారు. వీటి ద్వారా ఒకవైపు ప్రాణాపాయ పరిస్థితుల్లో వేగంగా చికిత్స అందించడంతోపాటు, మరోవైపు వ్యాధులను ముందుగానే గుర్తించి వ్యాప్తిని అరికట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకునే సామర్థ్యం పెరుగుతుందన్నారు. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం మొత్తం 24 అత్యవసర చికిత్స కేంద్రాలను మంజూరు చేసిందని, వీటి కోసం రూ.600.35 కోట్లు కేటాయించిందని మంత్రి తెలిపారు. 16 ప్రభుత్వ వైద్య కళాశాలల ఆసుపత్రులు, మూడు జిల్లా ఆసుపత్రులు, ఐదు ప్రాంతీయ ఆసుపత్రుల్లో వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మొత్తం 24 కేంద్రాలు పూర్తిగా అందుబాటులోకి వస్తే రాష్ట్రంలో 1,275 అదనపు అత్యవసర చికిత్స పడకలు సమకూరతాయని వివరించారు. వీటిలో 22 కేంద్రాల్లో ఒక్కొక్కదానిలో 50 పడకలు, ఒక కేంద్రంలో 75, మరో కేంద్రంలో 100 పడకలు ఉంటాయని తెలిపారు. ఇప్పటికే నిర్మాణం పూర్తయిన 10 అత్యవసర చికిత్స కేంద్రాలు రేపటి ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. వీటి కోసం రూ.234.50 కోట్లు ఖర్చు చేసి 500 అదనపు పడకలను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ అత్యవసర చికిత్స కేంద్రాల్లో గుండెపోటు, గుండెకు సంబంధించిన పక్షవాతం, దీర్ఘకాలిక ఊపిరితిత్తుల వ్యాధులు, తీవ్రమైన శ్వాసకోశ ఇబ్బందులు, విషప్రయోగాలు, రక్తంలో తీవ్రమైన ఇన్ఫెక్షన్లు వంటి ప్రాణాపాయ పరిస్థితులకు అత్యవసర వైద్యం అందించవచ్చని సత్యకుమార్ తెలిపారు. తల్లులు, పిల్లలకు అవసరమైన అత్యవసర వైద్యం, రక్తశుద్ధి చికిత్సకు సంబంధించిన సేవలు కూడా అందుబాటులో ఉంటాయని చెప్పారు. దీంతో తీవ్రమైన అనారోగ్య పరిస్థితుల్లో ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గి, తమ ప్రాంతాలకు దగ్గరలోనే అత్యవసర, నాణ్యమైన వైద్యం పొందే అవకాశం కలుగుతుందన్నారు. మహమ్మారులు, వ్యాధుల విజృంభణ, ప్రకృతి విపత్తులు వంటి అత్యవసర పరిస్థితుల్లోనూ ఈ కేంద్రాలను ప్రత్యేక చికిత్స కేంద్రాలుగా ఉపయోగించుకోవచ్చని మంత్రి తెలిపారు. సాధారణ పరిస్థితుల్లో తీవ్రమైన అనారోగ్యంతో ఉన్న వారికి ప్రత్యేక చికిత్స అందించడంతోపాటు, అత్యవసర సమయాల్లో ప్రత్యేక వైద్య కేంద్రాలుగా పనిచేసేలా వీటిని రూపొందించినట్లు చెప్పారు. నేడు ప్రారంభించనున్న 10 అత్యవసర చికిత్స కేంద్రాలు కడప, నెల్లూరు, శ్రీకాకుళం, విశాఖపట్నం, ఒంగోలు, అనకాపల్లి, రాజమహేంద్రవరం, కర్నూలు, హిందూపురం, విజయవాడల్లో ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. వాటిలో కడప ప్రభుత్వ వైద్య కళాశాల, నెల్లూరు ఏసీఎస్ఆర్ ప్రభుత్వ వైద్య కళాశాల, శ్రీకాకుళం ప్రభుత్వ వైద్య కళాశాల, విశాఖపట్నం ప్రభుత్వ వైద్య కళాశాల, ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాల, అనకాపల్లి జిల్లా ఆసుపత్రి, రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్య కళాశాల, కర్నూలు ప్రభుత్వ వైద్య కళాశాల, హిందూపురం జిల్లా ఆసుపత్రి, విజయవాడ ప్రభుత్వ వైద్య కళాశాల ఉన్నాయని వివరించారు. కడప, నెల్లూరు, శ్రీకాకుళం, విశాఖపట్నం, ప్రకాశం, తూర్పుగోదావరి, కర్నూలు, ఎన్టీఆర్ జిల్లాల్లో ఏర్పాటు చేసిన ఎనిమిది కేంద్రాలకు రూ.23.75 కోట్ల చొప్పున, అనకాపల్లి, శ్రీసత్యసాయి జిల్లాల్లోని రెండు కేంద్రాలకు రూ.22.25 కోట్ల చొప్పున ఖర్చు చేసినట్లు మంత్రి తెలిపారు. ఈ పది కేంద్రాల మొత్తం వ్యయం రూ.234.50 కోట్లు అని చెప్పారు. రాష్ట్రంలో మొత్తం 26 సమగ్ర ప్రజారోగ్య ప్రయోగశాలలను ఏర్పాటు చేస్తున్నామని, వాటిలో 12 ప్రయోగశాలలు రేపు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని మంత్రి తెలిపారు. ఒక్కో ప్రయోగశాలకు రూ.1.25 కోట్ల చొప్పున మొత్తం రూ.15 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. ప్రతి ప్రయోగశాలలో నిర్మాణ పనులకు రూ.40 లక్షలు, అవసరమైన పరికరాల కోసం రూ.85 లక్షలు కేటాయించినట్లు వివరించారు. ఈ ప్రయోగశాలలు జిల్లా స్థాయిలో ప్రజారోగ్య పరీక్షలకు కీలక కేంద్రాలుగా పనిచేస్తాయని తెలిపారు. వ్యాధుల నిర్ధారణతోపాటు వివిధ ఆరోగ్య కార్యక్రమాలకు అవసరమైన పరీక్షలు నిర్వహిస్తాయన్నారు. వ్యాధి ముప్పును ముందుగానే గుర్తించి, వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు తక్షణ చర్యలు తీసుకునే అవకాశం వీటి ద్వారా కలుగుతుందని చెప్పారు. నేడు ప్రారంభించనున్న 12 సమగ్ర ప్రజారోగ్య ప్రయోగశాలలను రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని సీతంపేట, అనంతపురం జిల్లాలోని గుంతకల్లు, చిత్తూరు జిల్లాలోని పలమనేరు, విశాఖపట్నం జిల్లాలోని అగనంపూడి, ఎన్టీఆర్ జిల్లాలోని నందిగామ, బాపట్ల జిల్లాలోని చీరాల, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకు, పల్నాడు జిల్లాలోని నరసరావుపేట, నంద్యాల జిల్లాలోని బనగానపల్లి, తూర్పుగోదావరి జిల్లాలోని అనపర్తి, కాకినాడ జిల్లాలోని తుని, నెల్లూరు జిల్లాలోని గూడూరులో ఈ ప్రయోగశాలలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఇప్పటికే 14 ప్రజారోగ్య ప్రయోగశాలల నిర్మాణం పూర్తై పనిచేస్తున్నాయని, మిగిలిన 12 ప్రయోగశాలల నిర్మాణం కూడా పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. ఈ ప్రయోగశాలల ద్వారా వ్యాధులపై నిఘా వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని సత్యకుమార్ తెలిపారు. వ్యాధుల విజృంభణను తొలిదశలోనే గుర్తించడం, పరీక్షల ద్వారా వ్యాధులను నిర్ధారించడం, పరీక్షల ఫలితాల ఆధారంగా ప్రజారోగ్య చర్యలు చేపట్టే సామర్థ్యం పెరుగుతుందన్నారు. జిల్లా పరిధిలోని ఇతర పరీక్షా కేంద్రాలకు సాంకేతిక సహకారం అందించడం, నమూనాలు సేకరించడం, పరీక్షలు నిర్వహించడం, అవసరమైన సందర్భాల్లో తదుపరి పరీక్షల కోసం నమూనాలను పంపించడం వంటి కీలక సేవలను ఈ ప్రయోగశాలలు అందిస్తాయని చెప్పారు. రాష్ట్రంలో ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మౌలిక వసతుల పథకం అమలును ప్రభుత్వం వేగవంతం చేసిందని మంత్రి తెలిపారు. 2019--24 మధ్య కేవలం రూ.28.85 కోట్లు ఖర్చు కాగా.. 2024 జూన్ నుంచి ఇప్పటివరకు రూ.229.29 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. గత కాలంతో పోలిస్తే ఇది దాదాపు ఎనిమిది రెట్లు అధికమని చెప్పారు. ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలను మరింత చేరువ చేయడంతోపాటు, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంచేందుకు ఆరోగ్య మౌలిక వసతుల పనులను వేగంగా పూర్తి చేస్తున్నట్లు సత్యకుమార్ తెలిపారు.

**మిగిలిన 14 కేంద్రాలకు 2027 ఏప్రిల్ 30 గడువు :** రాష్ట్రానికి మంజూరైన 24 అత్యవసర చికిత్స కేంద్రాల్లో ఇప్పటికే 10 కేంద్రాలు ప్రారంభానికి సిద్ధమయ్యాయని మంత్రి తెలిపారు. మిగిలిన 14 కేంద్రాల నిర్మాణాన్ని 2027 ఏప్రిల్ 30లోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.

# ప్రత్యేక గ్రీవెన్స్‌కు 136 అర్జీలు

**- ప్రతి అర్జీపైనా ప్రత్యేక దృష్టి**
**- అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యకు పరిష్కారం**
**- జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, శాసనసభ్యులు తంగిరాల సౌమ్య**

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ:
ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమంలో ప్రజల నుంచి 136 అర్జీలను స్వీకరించడం జరిగిందని.. ప్రతి అర్జీపైనా ప్రత్యేక దృష్టిపెట్టి నాణ్యతతో అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించ నున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, స్థానిక శాసనసభ్యులు తంగిరాల సౌమ్య అన్నా రు. ఒక నెల – ఒక నియోజకవర్గం – నాలుగు పర్యటనలు కార్యక్రమంలో భాగంగా నందిగామ నియోజకవర్గ స్థాయిలో శుక్రవారం ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్య క్రమం జరిగింది. నందిగామ-మధిరరోడ్డులోని ఆర్.ఎస్.గార్డెన్స్ నందు జరిగిన ఈ ప్రత్యేక గ్రీవె న్స్‌లో జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, నందిగామ శాసనసభ్యులు తంగిరాల సౌమ్య.. అధికా రులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో మొత్తం 136 అర్జీలు అందగా వీటిలో రెవెన్యూ శాఖకు సంబంధించి 69, పంచాయతీరాజ్‌కు 19, స్వర్ణ గ్రామం-స్వర్ణ వార్డుకు 15, పట్టణ పరిపాలనకు 9, విద్యుత్‌కు 5, సర్వేకు 4, రహదారులు-భవనాల శాఖకు 4, విద్యా శాఖకు 3 అర్జీలు వచ్చాయి. అదేవిధంగా వైద్య ఆరోగ్యం శాఖకు 2, గృహ నిర్మాణం శాఖకు 2, పోలీసు, డ్వామా, రిజిస్ట్రేషన్, కాలుష్య నియంత్రణ శాఖలకు ఒక్కో అర్జీ వచ్చాయి. ఈ అర్జీలను క్షుణ్నంగా పరిశీలించి నాణ్యతతో అర్జీదారులు సంతృప్తి చెందేలా



పరిష్కరించాలని జేసీ ఇలక్కియ అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ ప్రజల చెంతకే అధికారులు వచ్చి వారి సమస్యలను తెలుసుకొని వీలైనంత త్వరగా పరిష్కరించే లక్ష్యంతో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నందిగామ ఆర్‌డీవో అనిల్ కుమార్, పీజీఆర్ఎస్ జిల్లా నోడల్ అధికారి జి.జ్యోతి, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా 'రాష్ట్రీయ పోషణ్ మాసం' వేడుకలు

మచిలీపట్నం/ ప్రజాభూమి ప్రతినిధి
9వ రాష్ట్రీయ పోషణ్ మాసం సందర్భంగా ఐసిడిఎస్ (ICDS) ప్రాజెక్ట్ మచిలీపట్నం పరిధిలోని తాళ్లపాలెం సెక్టార్, పాటిమీద అంగన్‌వాడీ కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.సెక్టార్ సూపర్‌వైజర్ బి. కృష్ణకుమారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో



పోషకాహార ప్రాధాన్యతపై స్థానికులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా వైవిధ్యమైన పోషకాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు, రక్తహీనత నివారణ మరియు పోషకాహార లోపాన్ని అధిగమించే మార్గాలపై సమగ్రంగా వివరించారు.ఈ కార్యక్రమంలో ఎఎన్ఎమ్ (ANM) శ్రీదేవి, ఎం.ఎల్.హెచ్.పి (MLHP) శిరీష, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్నారులు మరియు వారి తల్లులు పాల్గొన్నారు.




## పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

**పరీక్షల విజయవంతానికి పటిష్ట సమన్వయం**
**డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం**

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ:
ఈ నెల 13వ తేదీన జరిగే నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డీఏ), నేవల్ అకాడమీ; కంబైన్డ్ డిఫెన్స్ సర్వీస్ (సీడీఎస్) పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌వో) ఎం.లక్ష్మీనరసింహం తెలిపారు. పరీక్షల నిర్వహణకు ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. యూని యన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ద్వారా నిర్వహించే నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నేవల్ అకాడమీ, కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ పరీక్షల నిర్వహణపై శుక్రవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో డీఆర్‌వో లక్ష్మీనరసింహం.. యూపీఎస్సీ అబ్జర్వర్ భాను జోషితో కలిసి లైజన్ ఆఫీసర్లు, వెన్యూ సూప ర్వైజర్లు, సమన్వయ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. పరీక్షలను విజయవంతంగా నిర్వహించేందుకు పటిష్ట సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా డీఆర్‌వో మాట్లాడుతూ ఈ నెల13వ తేదీ ఆదివారం విజయ వాడ లోని అయిదు కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నట్లు తెలిపారు. సీడీఎస్‌కు 691 మంది, ఎన్‌డీఏ అండ్ ఎన్ఏకు 1,019 మంది మొత్తం 1,710 మంది అభ్యర్థులు పరీక్షలు రాసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. సీడీఏ స్‌కు సంబంధించి ఉదయం 9 గం. నుంచి 11 గం. వరకు సెషన్-1, మధ్యాహ్నం 12.30 గం. నుంచి 2.30 గం. వరకు సెషన్-2, సాయంత్రం 4 గం. నుంచి 6 గం. వరకు సెషన్-3 జరగనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఎన్‌డీఏ అండ్ ఎన్ఏకు సంబంధించి సెషన్-1 ఉదయం 10 గం. నుంచి మధ్యాహ్నం 12.30 గం. వరకు సెషన్-2 మధ్యాహ్నం 2 గం. నుంచి సాయంత్రం 4.30 గం. వరకు జరుగుతుందని వివరించారు. భద్రతకు సంబంధించి పోలీసు శాఖ ఏర్పాట్లు చేయాలని.. అదేవిధంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకో వాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద వైద్య ఆరోగ్య శాఖ వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని.. అభ్యర్థులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని, రవాణా సౌకర్యంతో పాటు తాగునీరు, ఇతర సౌకర్యాలను అందుబాటులో ఉంచాలని డీఆర్‌వో లక్ష్మీనరసింహం, సమన్వయ శాఖల అధికారులకు సూచించారు.

## తొలి జ్ఞానపీఠ అవార్డు గ్రహీత విశ్వనాథ సత్యనారాయణ జయంతి

మచిలీపట్నం/ ప్రజాభూమి ప్రతినిధి
తొలి జ్ఞానపీఠ అవార్డు గ్రహీత కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ జయంతి కార్యక్రమం మచిలీపట్నం నగర కార్పొరేషన్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. మచిలీపట్నం సమీపంలోని పెడన మండలం నందమురు లో జన్మించిన విశ్వనాథ సత్యనారాయణ దేశవ్యాప్తంగా తెలుగు వారి కీర్తి కిరీటాలను సుస్థిరంగా ఉంచారని వక్తలు అన్నారు. దేశ చరిత్రలో లక్ష పేజీలు నవలలు కవిత్వం రాసిన ఘనత విశ్వనాధునికే దక్కిందని అన్నారు. విశ్వనాథ సత్యనారాయణ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా అన్ని కార్యాలయాల్లో పాఠశాలలో జరపాలని వక్తలు కోరారు. ఆయన రచించిన వెయ్యి పడగలు నవల నేటికీ సజీవంగా సాహిత్య రంగంలో నిలిచి ఉందని అన్నారు. అమరావతిలో విశ్వనాథ సత్యనారాయణ కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలని కూడా వక్తలు కోరారు. ఈ కార్యక్రమంలో నగర కమిషనర్ సిహెచ్. బాపిరాజు, తెలుగుదేశం పార్టీ నాయ కులు గొర్రెపాటి గోపీచంద్ సాహితి మిత్రుల సంస్థ అధ్యక్షులు న్యాయవాది లంకిశెట్టి బాలాజీ,ప్రముఖ సాహిత్య వేత్త డాక్టర్ బృందావనం ధనవంతరీ ఆచార్య, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పి.వి ఫణి కుమార్, సీనియర్ జర్నలిస్ట్ ముదిగొండ శాస్త్రి, బావ తరంగణి ఎడిటర్ భవిష్య కార్పొరేషన్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్వనాథ సత్యనారాయణ రచించిన పుస్తకాలను ప్రదర్శించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మచిలీపట్నంలో పుట్టి చరిత్రలో నిలిచిపోయిన ఆంధ్రాబ్యాంక్ వ్యవస్థాపకులు జాతీయ కాంగ్రెస్ అధ్యక్షులు భోగరాజు పట్టాభి సీతారామయ్య, ప్రపంచక్రికెట్ కెప్టెన్ సి.కే నాయుడు, జండా వీరుడు తోట నరసయ్య నాయుడు, రామదూత, జాతీయ పతాక సృష్టికర్త పింగళి వెంకయ్య వంటి ప్రముఖుల చిత్రాలను నగర కార్పొరేషన్ కాంపౌండ్ వాల్ పై చిత్రీకరించి వారి చరిత్రను నేటి తెలియపరచడానికి ముఖ్య కారకులైన నగర కార్పొరేషన్ కమిషనర్ బాపిరాజును లంకిశెట్టి బాలాజీ, బావ తరంగిణి ఎడిటర్ శాలువాలతో సన్మానించారు.



## పర్యావరణాన్ని కాపాడటం కోసం వెలుగు ఫౌండేషన్ మట్టి విగ్రహాలు పంపిణీ

**కేడీసీసీ బ్యాంక్ సీఈవో ఎం. శ్యామ్ మనోహర్**



ప్రజాభూమి బ్యూరో కృష్ణజిల్లా
పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని కేడీసీసీ బ్యాంక్ సీఈవో ఎం. శ్యామ్ మనోహర్ అన్నారు. వినాయక చవితి సందర్భంగా మట్టి విగ్రహాలను మాత్రమే వినియోగించి పర్యావరణాన్ని పరిరక్షించాలని ప్రజలకు అవగాహన కల్పిస్తూ వెలుగు ఫౌండేషన్ అధ్యక్షులు చందమామ బాబు ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాలను శుక్రవారం కేడీసీసీ బ్యాంక్ కార్యాలయంలో సీఈవో ఎం. శ్యామ్ మనోహర్, బ్యాంకు అధికారులు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సీఈవో ఎం. శ్యామ్ మనోహర్ మాట్లాడుతూ.. మట్టి వినాయకుడిని పూజించడం అంటే ప్రకృతిని పూజిం చడం తో సమానమని అన్నారు. మనకు జీవనాధారమైన ప్రకృతిని పరిరక్షించుకునే సందేశాన్ని వినాయక చవితి పండుగ అందిస్తుందని తెలిపారు. వినాయక చవితి పండుగ ప్రకృతితో ముడిపడి ఉందని, మట్టి వినాయక విగ్రహాలను పూజించడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించినవారవుతారని పేర్కొన్నారు.పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వెలుగు ఫౌండేషన్ చేపడుతున్న కార్యక్రమం అభినందనీయమని శ్యామ్ మనోహర్ ప్రశంసించారు. వెలుగు ఫౌండేషన్ అధ్యక్షులు చందమామ బాబు మాట్లాడుతూ.. సామాజిక బాధ్యతగా ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా మచిలీపట్నం నగరంలోని ప్రధాన కూడళ్లలో మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది ప్రత్యేకంగా మట్టి వినాయక విగ్రహాల్లో విత్తనాలను కూడా ఉంచుతున్నామని చెప్పారు. విగ్రహాన్ని నిమజ్జనం చేసిన అనంతరం ఆ మట్టిని ఇంటి ఆవరణలో లేదా పెరటిలో వినియోగిస్తే అందులోని విత్తనాల ద్వారా మొక్కలు మొలిచేలా ఈ విగ్రహాలను రూపొందిస్తున్నట్లు వివరించారు.ఈ సందర్భంగా కేడీసీసీ బ్యాంక్ సీఈవో ఎం. శ్యామ్ మనోహర్‌కు మట్టి వినాయక ప్రతిమను అందజేశారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్లు పి.జె.ఎస్. ప్రభాకర్, పి. వరలక్ష్మి, సి.హెచ్. రాంబాబు, వెలుగు ఫౌండేషన్ ఉపాధ్యక్షులు రేపల్లె వెంకట వీర వసంతరావు, ఫౌండేషన్ సభ్యులు, బ్యాంకు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బ్యాంకుల ప్రైవేటీకరణను ఆపాలి

**వారానికి 5 రోజులు మాత్రమే బ్యాంకులు పనిచేయాలి**




ప్రజాభూమి బ్యూరో కృష్ణజిల్లా
బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు సంపూర్ణ సంఘీభావం తెలిపిన స్టేట్ బ్యాంక్ యూనియన్లు.బ్యాంకింగ్ రంగాన్ని పరిరక్షించాలని, వారానికి 5 రోజులు మాత్రమే పని చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగులు యు ఎఫ్ బి యు ఆధ్వర్యం లో శుక్రవారం చేపట్టిన సమ్మెకు కృష్ణ జిల్లా మచిలీపట్నం స్టేట్ బ్యాంక్ స్టాఫ్ అందరు సంపూర్ణ సంఘీభావం ప్రకటించాయి. మచిలీపట్నం లక్ష్మి టాకీస్ సెంటర్ దగ్గర ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్యాలయం వద్ద జరిగిన ఒక్క రోజు సమ్మె కార్యక్రమంలో రీజనల్ సెక్రటరీ ఎల్ సుబ్రహ్మణ్యం గారు మరియు ఆఫీసర్ తదితరలు పాల్గొని బ్యాంకు ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా రీజనల్ సెక్రటరీ ఎల్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేటు కార్పొరేట్ సంస్థలకు అప్పగించే విధానాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల పొదుపులకు భద్రత కల్పిస్తూ, రైతులు, కార్మికులు, చిన్న వ్యాపారులు, మధ్యతరగతి ప్రజలకు ఆర్థిక అండగా నిలుస్తున్న ప్రభుత్వ రంగ బ్యాంకులను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారువారానికి 5 రోజులు మాత్రమే బ్యాంకులు పనిచేసే విధానాన్ని వెంటనే అమలు చేయాలి.బ్యాంకుల ప్రైవేటీకరణ, విలీనాలనునిలిపివేయాలని సుబ్రహ్మణ్యం కోరారు . మరియు ప్రభుత్వ రంగ బ్యాంకులను బలోపేతం చేయాలని ,బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలి. ఉద్యోగులపై పెరుగుతున్న పని భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు బ్యాంకు ఉద్యోగుల న్యాయమైన డిమాం డ్లను పరిష్కరించాలి అని కోరారు.ప్రజల పొదుపును, ప్రభుత్వ రంగ బ్యాంకులను కార్పొరేట్ ప్రయోజనాలకు అప్పగించరాదని కోరారు.ప్రజల డబ్బు – దేశ ఆస్తిప్రభుత్వ రంగ బ్యాంకులు – ప్రజ ల హక్కువారానికి ఐదు రోజులు – ఉద్యోగుల హక్కు అని నినదించారు . బ్యాంకింగ్ రంగ పరి రక్షణ కోసం ఉద్యోగులు చేస్తున్న పోరాటానికి కార్మికవర్గం అండగా ఉంటుందని స్పష్టం చేశా రు.




ఉద్యోగుల హక్కుల సాధన కోసం నిర్వహించే పోరాటాలను మరింత ఐక్యంగా ముందుకు తీసు కెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బ్యాంకు ఉద్యోగ సంఘాల నాయకులు మరియు కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# గడువు ముగిసింది

## అక్టోబరు 5 వరకు అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కారం

**అక్టోబరు 9న తుది ఓటర్ల జాబితా ప్రచురణ...**
**జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.జి.లక్ష్మీశ**

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:
జిల్లాలో భారత ఎన్నికల సంఘం జారీ చేసిన ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ లో భాగంగా ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణకు నిర్ణయించిన గడువు గురువారం అర్ధరాత్రితో (10.09.2026) ముగిసిందని జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి డా.జి.లక్ష్మీశ తెలిపారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. అర్హత కలిగిన ప్రతి పౌరునికి ఓటు హక్కు కల్పించడంతో పాటు, మరణించిన వారు, శాశ్వతంగా వలస వెళ్లిన వారు, బదిలీ అయిన వారు, ఇతర కారణాల వల్ల అనర్హులైన వారి పేర్లను నిబంధనల ప్రకారం తొలగించే చర్యలు చేపడుతున్నట్లు వెల్లడిం చారు. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ ప్రారం భమైన నాటి నుంచి కొత్తగా ఓటు నమోదు చేసుకోవడానికి ఫారం-6 కింద మొత్తం 40,802 దరఖాస్తులు అందాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. వీటిలో ఇప్పటికే 27,224 దరఖాస్తులను పరిష్కరించినట్లు వెల్లడించారు. మిగిలిన దరఖాస్తులను కూడా ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనల



ప్రకారం పరిశీలించి, అర్హత ఉన్న దరఖాస్తుదారులకు ఓటు హక్కు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మరణించిన, బదిలీ అయిన, శాశ్వతంగా వలస వెళ్లిన లేదా ఇతర కారణాల వల్ల అనర్హులైన వ్యక్తుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించేందుకు ఫారం-7 కింద మొత్తం 21,023 దరఖాస్తులు అందినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారులు నిబంధనల ప్రకారం పరిశీలించి, వాస్తవాలను నిర్ధారించిన అనంతరం మాత్రమే తగిన నిర్ణయం తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఓటర్ల నివాస మార్పులు, ఓటరు గుర్తింపు కార్డు రీప్లేస్‌మెంట్, ఓటరు జాబితాలోని వివరాల సవరణలు, ఇతర మార్పుల నమోదు కోసం ఫారం-8 కింద 44,638 దరఖాస్తులు అందినట్లు డా.జి.లక్ష్మీశ తెలిపారు. అర్హత కలిగిన ఓటర్ల వివరాలు సక్రమంగా ఉండేలా, ఒకే వ్యక్తికి ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు ఉండకుండా, ఓటర్ల జాబితా నాణ్యతను మెరుగుపరిచే దిశగా ఈ దరఖాస్తులను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణకు ముందు అందిన దరఖాస్తులతో కలిపి ప్రస్తుతం ఫారం-6కు సంబంధించిన 10,330 దరఖాస్తులు, ఫారం-7కు సంబంధించిన 982 దరఖాస్తులు, ఫారం-8కు సంబంధించిన 7,447 దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ దరఖాస్తులను నిర్ణీత నిబంధనల ప్రకారం పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటున్నారని ఆయన వివరిం చారు. ముసాయిదా ఓటర్ల జాబితాపై స్వీక రించిన అభ్యంతరాలు, ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరించే ప్రక్రియ అక్టోబరు 5, 2026 వరకు కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఓటర్ల జాబితాలో అర్హత కలిగిన ఏ ఒక్కరి పేరు కూడా అన్యాయంగా తొలగించబడకుండా, అదే సమయంలో అనర్హుల పేర్లు జాబితాలో కొనసాగకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా సమగ్రంగా పరిశీలన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్యుమరేషన్ పత్రాలలో లోపాలు ఉన్నట్లు గుర్తించిన 1,94,681 మంది ఓటర్లకు నోటీసులు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. నోటీసులు అందుకున్న వారిలో ఇప్పటికే 1,83,300 మంది ఓటర్లకు సంబంధించిన విచారణ ప్రక్రియ పూర్తయిందని ఆయన వెల్లడించారు. సంబంధిత ఓటర్లు సమర్పించిన పత్రాలు, వివరాలను అధికారులు పరిశీలించి నిబంధనల ప్రకారం నిర్ణయాలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎన్యుమరేషన్ ప్రక్రియలో భాగంగా నోటీసులు జారీ చేసిన ఓటర్లలో, అవసరమైన సరైన పత్రాలు సమర్పించకపోవడం మరియు నిబంధనలకు అనుగుణంగా అర్హతను నిరూపించుకోలేకపోవడం వంటి కారణాలతో 6,280 మందిని అనర్హులుగా తేల్చినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.

అయితే ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి కేసును నిబంధనల మేరకు పరిశీలించిన తరువాత మాత్రమే తుది నిర్ణయం తీసుకుంటున్నామని, అర్హులైన ఓటర్ల హక్కులను పరిరక్షించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆయన స్పష్టం చేశారు. ముసాయిదా ఓటర్ల జాబితాపై వచ్చిన అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కారం, పెండింగ్‌లో ఉన్న ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తుల పరిశీలన, ఎన్యుమరేషన్ పత్రాల పరిశీలన తదితర ప్రక్రియలను పూర్తి చేసిన అనంతరం 2026 అక్టోబరు 9వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నట్లు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డా. జి. లక్ష్మీశ తెలిపారు.

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో ప్రజలందరూ సహకరించాలని, అర్హత కలిగిన ప్రతి పౌరుడు తన పేరు ఓటర్ల జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవాలని ఆయన సూచించారు. ఓటర్ల జాబితాలో ఏవైనా తప్పులు, అభ్యంతరాలు ఉంటే ఎన్నికల సంఘం నిర్దేశించిన విధానంలో సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడం, ఓటర్ల జాబితాను పారదర్శకంగా మరియు తప్పులులేకుండా రూపొం దించడం ఎన్నికల యంత్రాంగం ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ స్పష్టం చేశారు.

# ప్రజాభూమి

ఏలూరు, పశ్చిమగోదావరి 4

శనివారం 12 సెప్టెంబరు 2026


## మట్టి వినాయకుడే మేలైన పూజ



ప్రజాభూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అడవినెక్కలం పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాఠశాల స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ప్లాస్టర్‌తో తయారు చేసిన, రసాయనిక రంగులు ఉపయోగించిన వినాయక విగ్రహాలను పూజించడం వల్ల ప్రకృతికి హాని కలుగుతుందని, మట్టి వినాయక విగ్రహాలను వినియోగించాలని కోరుతూ విద్యార్థులు పలకలు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. అనంతరం విద్యార్థులు స్వయంగా తయారు చేసిన మట్టి వినాయక విగ్రహాలను గ్రామస్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు పి.వి. రమణ మాట్లాడుతూ ప్రకృతికి హాని కలగకుండా పండుగను జరుపుకోవాలనే సందేశంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థుల ప్రయత్నాన్ని గ్రామస్థులు అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయిని ఎన్. ఉమామహేశ్వరి, ఉపాధ్యాయులు టి. నరసింహారావు, అహ్మద్, సూర్యకుమారి, నవ ప్రశాంతి, సుమతి, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## మట్టి వినాయక ప్రతిమలతో పర్యావరణ పరిరక్షణ



ప్రజా భూమి ప్రతినిధి-విజయవాడ

సురక్ష చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వినాయక చవితి సందర్భంగా మూడు రోజుల పాటు సుమారు 3,000 మట్టి వినాయక ప్రతిమలను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు ట్రస్ట్ చైర్మన్ కుదరవల్లి నరసయ్య తెలిపారు. విజయవాడ గాయత్రీనగర్‌లోని ట్రస్ట్ కార్యాలయంలో శుక్రవారం మట్టి ప్రతిమలు, పూజా సామగ్రి, వ్రత పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించి, తొలుత వినాయకునికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నరసయ్య మాట్లాడుతూ వినాయక చవితి ప్రకృతితో మమేకమయ్యే పండుగని, వినాయకునికి సమర్పించే 21 రకాల పత్రాలతో పూజ చేయడం పర్యావరణ పరిరక్షణకు ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయనాలతో తయారు చేసిన ప్రతిమలకు బదులుగా మట్టి ప్రతిమలను వినియోగించి పర్యావరణహితంగా పండుగను జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

## పంట రక్షణకు పొలం పరిశీలన కీలకం




ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

ఆగిరిపల్లి మండల వ్యవసాయ అధికారి జె. భవాని ఆధ్వర్యంలో అమ్మవారిగూడెంలో శుక్రవారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో రైతులకు పొలం పరిసరాల విశ్లేషణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జె. భవాని మాట్లాడుతూ పంటతో పాటు కీటకాలు, మిత్ర కీటకాలు, తెగుళ్లు, కలుపు మొక్కలు, నేల, నీరు, వాతావరణ పరిస్థితులను సమగ్రంగా పరిశీలించి పంట రక్షణ చర్యలను నిర్ణయించుకోవాలని సూచించారు. రైతులు వారానికి ఒకసారి పొలాలను పరిశీలించి పంట ఎదుగుదల, ఆకుల పరిస్థితి, కీటకాల ఉనికి, తెగుళ్ల లక్షణాలను గమనించాలని, కీటకాలు కనిపించగానే పురుగుమందులు పిచికారీ చేయకుండా వాటి సంఖ్య, పంటకు కలిగే నష్టం, మిత్ర కీటకాల ఉనికిని పరిగణనలోకి తీసుకోవాలని తెలిపారు. మిత్ర కీటకాలను సంరక్షించడం ద్వారా అనవసర పురుగుమందుల వినియోగాన్ని తగ్గించడంతో పాటు సాగు ఖర్చులు తగ్గి పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. రైతులందరూ పొలంబడి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని శాస్త్రీయ పద్ధతులను పాటించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకులు అపర్ణ, వడ్డీ కాసులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఘనంగా వివేకానంద చికాగో ప్రసంగ దినోత్సవం



ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు

శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాల, అగ్రహారంలో స్వామి వివేకానంద 1893 సెప్టెంబర్ 11న అమెరికాలోని చికాగోలో చేసిన చారిత్రాత్మక ప్రసంగాన్ని స్మరించుకుంటూ వివేకానంద చికాగో ప్రసంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పూజ్య స్వామీజీ శ్రీ శ్రీ కమలనంద భారతి,వివేకానంద కేంద్ర కో-ఆర్డినేటర్ డా. ఎ.ఉమా దుర్గాదేవి,కన్వీనర్ రామ కృష్ణ పాల్గొని విద్యార్థులకు వివేకానంద బోధనలు,భారతీయ సంస్కృతి,ఆధ్యాత్మికత, సోదర భావం,మానవతా విలువలపై అవగాహన కల్పించారు.యువత ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, దేశభక్తి, సేవాభావంతో ముందుకు సాగాలని, “లేచి, మేల్కొని, గమ్యం చేరే వరకు ఆగవద్దు” అనే స్వామి వివేకానంద సందేశాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి.చంద్రరావు, వైస్ ప్రిన్సిపాల్ వి. సుభాష్‌రావు, అధ్యాపకులు,చీమా విద్యార్థులు,ఇతర విద్యార్థులు పాల్గొన్నారు.

### జాతీయ బ్యాంకులలో పనిచేస్తున్న వారికి

# 5 రోజుల పని దినాలు అమలు చేయాలి

ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా.

జాతీయ బ్యాంకులలో పనిచేస్తున్న అధికారులకు, ఉద్యోగులకు, సిబ్బందికి వారానికి ఐదు రోజులు పని దినాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ, అలాగే ద్వైపాక్షికంగా ఒప్పుకున్న పి ఎల్ ఏ విధానాన్ని, ఏకపక్షంగా అమలు చేస్తున్న విధానాన్ని నిరసిస్తూ ఏలూరులో బ్యాంకు ఉద్యోగులు యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ఆధ్వర్యంలో బ్యాంకు ఉద్యోగులు సమ్మె చేసి ఆర్‌ఆర్ పేట యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ ఆఫీసు నుంచి ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ ఆర్ పేట మెయిన్ రోడ్డు, ప్రభుత్వ ఆసుపత్రి, ఫైర్ స్టేషన్ సెంటర్ మీదగా స్థానిక నరసింహారావు పేట లో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్యాంకు వద్దకు చేరింది. ఎస్బిఐ వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా యు ఎఫ్




బి యు కన్వీనర్ కాళే శ్రీనివాసరావు మాట్లాడుతూ బ్యాంకు ఉద్యోగులకు వారానికి ఐదు రోజుల పని దినాలను కల్పిస్తామని జాతీయ బ్యాంక్ ల యూనియన్ కి హామీ ఇచ్చి చాలా కాలం అయినప్పటికీ అమలు చేయడంలో వైఫల్యం చెందిందని వారు ఆరోపించారు. బ్యాంకు ఉద్యోగులకు పని భారం బాగా పెరిగిందని, తక్షణమే వారానికి ఐదు రోజుల పని దినాలు కల్పించాలని, పనితీరు ఆధారిత ప్రోత్సాహకం అన్ని క్యాడర్లకూ సమానంగా ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఏలూరులో జరిగిన నిరసన ప్రదర్శనలో బ్యాంకు ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏలూరు రీజనల్ సెక్రటరీ విమల్, యూనియన్ బ్యాంక్ ఏఐబిఓసి నాయకులు శ్రీరంగం శ్రీనివాసరావు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆఫీసర్స్ నాయకులు వెంకటేశ్వరరావు , బ్యాంక్ ఆఫ్ బరోడా యూనియన్ నాయకులు ఎస్ శ్రీనివాసరావు,ఇండియన్ బ్యాంక్ జాయింట్ జనరల్ సెక్రటరీ ఎం ఆర్ కె రెడ్డి, డిసిసిబి బ్యాంక్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. బ్యాంకు ఉద్యోగులు చేపట్టిన ఈ నిరసన కార్యక్రమానికి మద్దతు తెలుపుతూ ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి శ్రీనివాస్, సిఐటియు జిల్లా కార్యదర్శి డిఎన్విడి ప్రసాద్ మాట్లాడారు. ర్యాలీలో ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, బ్యాంక్ ఎంప్లాయిస్ కోఆర్డినేషన్ కమిటీ మాజీ నాయకులు కే జే ఎస్ సత్యనారాయణ, వి నారాయణరావు తదితర నాయకులు పాల్గొని ప్రసంగించారు.

# ఆగిరిపల్లి బస్టాండులోనే బస్సులు ఆపాలి

### మంత్రి సారథి ఆదేశాలతో స్పందించిన ఆర్టీసీ అధికారులు

ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

ఆగిరిపల్లి బస్టాండుకు బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఈ నెల 9న ప్రజా భూమి దినపత్రికలో ప్రచురితమైన “బస్టాండుకు బస్సులు రాక ప్రయాణికుల అవస్థలు” కథనంపై రాష్ట్ర గృహ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి వెంటనే స్పందించారు. శుక్రవారం నూజివీడు ఆర్టీసీ డిపో మేనేజర్ పసుమర్తి ధనాంజనేయులుతో మాట్లాడి, ఆగిరిపల్లి బస్టాండులో ఆగాల్సిన ప్రతి ఆర్టీసీ బస్సు తప్పనిసరిగా బస్టాండు లోపలికి వచ్చి ప్రయాణికులను ఎక్కించుకుని, దింపి వెళ్లేలా డ్రైవర్లు, కండక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని సూచించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సచివాలయ బస్సుతో పాటు ఎర్రగొండపాలెం, శ్రీశైలం, బెంగళూరు, తిరుపతి తదితర ప్రాంతాలకు వెళ్లే బస్సులు కూడా ఆగిరిపల్లి బస్టాండులో ఆగేలా చూడాలని, దూర ప్రాంతాలకు వెళ్లే బస్సులు తిరుగు ప్రయాణంలోనూ బస్టాండులోకి వచ్చి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీనిపై డిపో మేనేజర్ ధనాంజనేయులు మాట్లాడుతూ పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, సూపర్ లగ్జరీ, సచివాలయ బస్సులతో పాటు ఆగిరిపల్లిలో ఆగాల్సిన అన్ని బస్సులు ఇకపై బస్టాండు లోపలికి వచ్చి వెళ్లేలా డ్రైవర్లు, కండక్టర్లకు ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. నిబంధనలు పాటించకుండా




బస్సులను రోడ్డుపైనే నిలిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నూజివీడు డిపో పరిధిలో ఆర్టీసీ బస్సులకు సంబంధించి ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది ఎదురైనా తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ధనాంజనేయులు తెలిపారు.

## అర్హులందరికీ నూతన పింఛన్లు అందేలా చర్యలు తీసుకోవాలి: ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

### దరఖాస్తుల ప్రక్రియలో పార్టీ శ్రేణులు చురుకుగా పాల్గొనాలి.



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట


అర్హులైన ప్రతి ఒక్కరికీ నూతన పింఛన్లు అందేలా పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సూచించారు. శుక్రవారం వాడపాలెంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలతో నిర్వహించిన సమావేశంలో ఆయన దరఖాస్తుల ప్రక్రియపై కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సెప్టెంబర్ 12న ఆయా గ్రామాల బూత్ ఇన్‌చార్జిలు స్వర్ణ గ్రామంలో నమోదైన పింఛన్ దరఖాస్తుల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. 13న ఇంకా దరఖాస్తు చేయని అర్హులను గుర్తించాలని, 14 నుంచి 16వ తేదీ వరకు బూత్ ఇన్‌చార్జిలు స్వయంగా వారిని స్వర్ణ గ్రామానికి తీసుకెళ్లి దరఖాస్తులను పూర్తి చేయించి సమర్పించేలా చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. గ్రామాల్లో పింఛన్లకు అర్హులైన ఏ ఒక్కరూ దరఖాస్తు చేసే అవకాశాన్ని కోల్పోకుండా పార్టీ నాయకులు ప్రజలకు సహకారం అందించాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పిలుపునిచ్చారు. ప్రజా సంక్షేమ పథకాలు నిజమైన లబ్ధిదారులకు చేరేలా ప్రతి కార్యకర్త బాధ్యతగా వ్యవహరించాలని ఆయన సూచించారు.

# ప్రాథమిక వైద్యశాలల్లో మెరుగైన వైద్య సేవలు

### అత్యవసర వేళల్లో వైద్యం.. అవసరమైతే ఏరియా ఆసుపత్రికి తరలింపు

ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

ఆగిరిపల్లి, ఈదర, సగ్గూరు ప్రాథమిక వైద్యశాలల్లో నిష్ణాతులైన వైద్యులు, సిబ్బంది నర్సులు అందుబాటులో ఉండటంతో పాటు రాత్రివేళల్లోనూ విధుల్లో ఉన్న సిబ్బంది ద్వారా అత్యవసర వైద్య సేవలు అందిస్తున్నట్లు వైద్యులు డాక్టర్ టీనా, డాక్టర్ నరేంద్ర కృష్ణ, డాక్టర్ మంజులాదేవి తెలిపారు. తమ వైద్యశాలల పరిధిలో ప్రజలకు ఉచిత వైద్యం, వైద్య పరీక్షలు, మందులు అందిస్తున్నామని, అవసరమైన మేరకు అన్ని రకాల చికిత్సలు అందించేందుకు ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. ప్రసవ సేవలు కూడా అందుబాటులో ఉన్నాయని, ఇటీవల కొత్త ఈదర గ్రామానికి చెందిన ఓ



మహిళ మంగళవారం రాత్రి ప్రసవం కోసం అత్యవసరంగా ఈదర ప్రాథమిక వైద్యశాలకు రాగా, డాక్టర్ నరేంద్ర కృష్ణ రాత్రంతా ఆమెకు వైద్య సేవలు అందించి సురక్షితంగా ప్రసవం నిర్వహించినట్లు తెలిపారు. అలాగే గురువారం రాత్రి తేలు కుట్టిన వ్యక్తి ఆగిరిపల్లి ప్రాథమిక వైద్యశాలకు రాగా వెంటనే చికిత్స అందించినట్లు డాక్టర్ టీనా తెలిపారు. ప్రాథమిక వైద్యశాలల్లో అందించగలిగిన మేరకు చికిత్స అందించి, మెరుగైన వైద్యం అవసరమైన సందర్భాల్లో ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేస్తున్నామని వైద్యులు తెలిపారు.

# హౌస్ హోల్డ్ మ్యాపింగ్ సౌకర్యం లేక పింఛన్ దరఖాస్తుదారులు గగ్గోలు

### 2023 మేలో వెసులుబాటు కల్పించిన వైసిపి ప్రభుత్వం

ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

ఏపీ రాష్ట్ర వ్యాప్తంగా సామాజిక పింఛన్ దరఖాస్తుదారులకు హౌస్ హోల్డ్ మ్యాపింగ్ చిక్కులు వచ్చి పడ్డాయి. దీంతో పేద ప్రజలకు పింఛన్ పొందే సౌకర్యం అందకుండా పోతుంది. అర్హులైనప్పటికీ వారి పేర్లు గతంలో పింఛన్ పొందిన బంధువుల రేషన్ కార్డులలో కలిసిపోవడం తోను, కొందరు ఉద్యోగుల రేషన్ కార్డులలోను పేర్లు కలిసిపోవడం, కొందరు పెళ్లి చేసుకున్న కుమార్తెలు, అత్తవారింటికి వెళ్లిపోయినప్పటికీ, వారి పేర్లు ఇంకా వృద్ధులైన తల్లిదండ్రుల రేషన్ కార్డు లోనే ఉండడంతో అర్హులైనప్పటికీ పింఛన్ పొందే సౌకర్యాన్ని వృద్ధులు కోల్పోతున్నారు. కార్లు ఉన్న పేరుతో ఉన్న వారి రేషన్ కార్డులో ఉన్న వారికి కూడా అర్హత లేకుండా పోయింది.దీంతో వేలాదిమంది నిరుపేదలైనప్పటికీ పింఛన్లు పొందే సౌకర్యం అందరని ద్రాక్షగా మారింది.

**2023 మే లో వెసులుబాటు కల్పించిన వైసిపి ప్రభుత్వం:**

అర్హులై ఉండి కార్లు ఉన్న వారి రేషన్ కార్డులో వృద్ధుల పేర్లు ఉండడం వల్ల, ఇతర కారణాలవల్ల కూడా నిరుపేదలకు సామాజిక పింఛన్లు అందకుండా పోయాయి. ఈ విషయాన్ని గ్రహించిన వైసీపీ ప్రభుత్వం 2023 మే నెలలో హౌస్ హోల్డ్ మ్యాపింగ్ సౌకర్యం ఆప్షన్ రాష్ట్రవ్యాప్తంగా ఒక నెలపాటు కలుగజేసింది. దీంతో నిరుపేదలైన అర్హత గల వారికి అందరికీ సామాజికపించిన సౌకర్యం లభించింది.

**గడువు పెంచి, హౌస్ హోల్డ్ మాపింగ్ సౌకర్యం కల్పించాలి:**

హౌస్ హోల్డ్ మ్యాపింగ్ సౌకర్యం లేకపోవడం వల్ల రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన నిరుపేదలు సామాజిక పెన్షన్ పొందే సౌకర్యం లేనందున యుద్ధ ప్రాతిపదికన ఈ సౌకర్యం కల్పించాలని కూటమి ప్రభుత్వాన్ని నిరుపేద పింఛన్ దరఖాస్తుదారులు కోరుతున్నారు. అదేవిధంగా దరఖాస్తులు అందజేసే గడువును కూడా సెప్టెంబర్ నెలాఖరు వరకు పెంచాలని కోరుతున్నారు. లేదంటే వేలాదిమంది అర్హులు కూడా అనర్హులుగా మిగిలిపోతారని అందువలన సీఎం చంద్రబాబు నాయుడు ఈ దిశగా చర్యలు తీసుకోవాలని పలువురు సామాజిక పింఛన్ దరఖాస్తుదారులు కోరుతున్నారు.

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల తల్లిదండ్రులకు తప్ప అందరికీ అర్హత కల్పించాలి:**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాశ్వత ఉద్యోగులు తల్లిదండ్రులకు తప్ప మిగిలిన ఉద్యోగుల తల్లిదండ్రులందరికీ సామాజిక పింఛన్ సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు. సొంత కుమార్తె, లేదా కుమారుడు పేరుపై పర్మినెంట్ ప్రభుత్వ ఉద్యోగం ఉంటే వారి తల్లిదండ్రులకు పింఛన్ మినహాయించవచ్చు కానీ, అల్లుడికి గాని కోడలికి గాని ప్రభుత్వ ఉద్యోగం ఉండి వారి పేర్లు కూడా వృద్ధుల రేషన్ కార్డులో ఉండడంతో వీరిని కూడా అనర్హులు చేయడం పట్ల పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా సాఫ్ట్వేర్ ఉద్యోగాలు ఎప్పుడు ఉంటాయో ఎప్పుడు పోతాయో తెలియని సాఫ్ట్వేర్ ఉద్యోగాలు పొందిన వారి తల్లిదండ్రుల కు కూడా సామాజిక పింఛన్లకు అనర్హులు చేయడం సమంజసం కాదంటున్నారు. కావున ఈ సమస్యలన్నీ పరిగణలోకి తీసుకొని తక్షణమే హౌస్ ఓల్డ్ మ్యాపింగ్ సౌకర్యం కల్పించాలని నిరుపేద పింఛన్ దరఖాస్తుదారులు కోరుతున్నారు.

# చింతలపూడి ఎత్తిపోతల పథకం భూ సేకరణ వేగవంతం చేయాలి

ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా

చింతలపూడి ఎత్తిపోతల పథకం భూసేకరణలో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తీసుకుంటానని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.జె.అభిషేక్ గౌడ హెచ్చరించారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం భూసేకరణ పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో శుక్రవారం కలెక్టరేట్ లోని జాయింట్ కలెక్టర్ కార్యాలయంలో జేసీ అభిషేక్ గౌడ సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ అభిషేక్ గౌడ మాట్లాడుతూ చింతలపూడి ఎత్తిపోతల పథకం నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నదని, అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించకుండా భూసేకరణ



ప్రక్రియను నిర్ణీత గడువులో పూర్తి చేయడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జేసీ సూచించారు. ముఖ్యంగా అసైన్‌మెంట్ భూములకు సంబంధించిన అంశాలపై ప్రత్యేకంగా చర్చించి, సంబంధిత భూసేకరణ అధికారులు మరియు తహసీల్దార్లు నోటీసులు జారీ చేసి, చట్టబద్ధమైన ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి, భూసేకరణను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. చింతలపూడి భూసేకరణ పనులపై గత 40 రోజులుగా ఎటువంటి ప్రగతి ప్రదర్శించకపోవడంపై కొవ్వూరు భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పై జేసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. మెరుగైన పనితీరు ప్రదర్శించకపోతే శాఖాపరమైన చర్యలు ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించారు. ఇప్పటికే ప్రకటించిన భూసేకరణ అవార్డుల స్థితి, భూస్వాములకు పరిహార చెల్లింపుల పురోగతి, భూసేకరణ పూర్తయిన భూములను నీటిపారుదల శాఖకు అప్పగించిన స్థితిని జేసీ సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న పరిహార చెల్లింపులు మరియు భూముల అప్పగింత ప్రక్రియను వేగవంతం చేసి, ప్రాజెక్టు పనులు నిరాటంకంగా కొనసాగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జేసీ ఆదేశించారు. జీలుగుమిల్లి మండలంలో ఆర్‌ఓఎఫ్‌ఆర్ భూముల అంశాన్ని సమావేశంలో సమీక్షిస్తూ, అవసరమైన ధృవీకరణలను త్వరితగతిన పూర్తి చేసి, తదుపరి భూసేకరణ ప్రక్రియలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో నూజివీడు సబ్ కలెక్టర్ బి.వినూత్న, సంబంధిత మండలాల తహసీల్దార్లు, చింతలపూడి ఎత్తిపోతల సాగునీటి పథకం కార్యనిర్వాహక ఇంజనీర్లు మరియు సహాయ ఇంజనీర్లు పాల్గొన్నారు.

# పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కారమయ్యేనా..

- 48 గ్రామాలు ముంపునకు గురవుతున్నా.. 10 గ్రామాలకు అందని భూమి ప్యాకేజీ
- ఇంకా 39 గ్రామాలకు ఇంటి స్ట్రక్చర్ విలువ, R&R కల్పించాల్సి ఉంది
- 18 ఏళ్లు నిండిన యువతీ యువకులందరినీ నిర్వాసితులుగా గుర్తించాలి
- సీపీఎం డిమాండ్




ప్రజా భూమి ప్రతినిధి-కూనవరం

మండలంలో సమావేశంలో మేకలు అధ్యక్షతన ఈ సమావేశం తదనంతరం చెప్పిన పార్టీ మండల కార్యదర్శి బాబు బొర్రయ్య మాట్లాడుతూ జరిగిందిపోలవరం ప్రాజెక్టు కారణంగా కూనవరం మండలంలోని 48 గ్రామాలు ముంపునకు గురవుతున్నప్పటికీ, ఇప్పటికీ పలు గ్రామాల నిర్వాసితులకు ప్రభుత్వం న్యాయం చేయలేదని సీపీఎం నాయకులు విమర్శించారు.పోలవరం నిర్వాసితుల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందా? అని ప్రశ్నించారు.మండలంలోని 48 ముంపు గ్రామాల్లో ఇప్పటివరకు 12 గ్రామాలకు భూమి ప్యాకేజీ అందలేదని తెలిపారు. మరో 39 గ్రామాల్లో గిరిజన, గిరిజనేతర నిర్వాసిత కుటుంబాలకు ఇంటి స్ట్రక్చర్ విలువతో పాటు పునరావాసం కల్పించాల్సి ఉందని పేర్కొన్నారు. ఆదివాసీ నిర్వాసితులకు ప్రభుత్వం ప్రకటించిన 6.25 ఎకరాల భూమి మినహాయింపు/భూమి ప్యాకేజీకి సంబంధించి ఇప్పటివరకు ఎక్కడ భూమి చూపించలేదని అన్నారు. ఆయా గ్రామాల నిర్వాసితులకు భూమి ఎక్కడ ఇస్తారు, ఎప్పుడు ఇస్తారు అనే విషయాలను ప్రభుత్వం స్పష్టంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం 48 గ్రామాలలో 9 ప్రాధాన్యత గ్రామాలుగా గుర్తించిన గ్రామాల్లో కూడా ఇప్పటివరకు పూర్తిస్థాయిలో ఆర్అండ్ఆర్ కల్పించలేదని విమర్శించారు. ముఖ్యంగా తరలించే నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులను నిర్వాసితుల జాబితాలో పరిగణనలోకి తీసుకోకపోవడం వల్ల తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్వాసితుల తరలింపు జరిగే నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతీ యువకుడినీ పరిగణనలోకి తీసుకుని ప్యాకేజీ తక్షణ చర్యలు తీసుకోవాలని సీపీఎం డిమాండ్ చేసింది. పోలవరం ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్‌కు జీవనాధారమైన ప్రాజెక్టు అని ప్రభుత్వాలు చెబుతున్నప్పటికీ, సర్వం కోల్పోతున్న నిర్వాసితుల సమస్యలను కాంటూరు లెక్కల పేరుతో విభజించి, ఒకరికి ఒక న్యాయం-మరొకరికి మరో న్యాయం చేసే విధానం అన్యాయమని అన్నారు. కాంటూరు పేరుతో నిర్వాసితులను విభజించి పాలించే విధానాన్ని ప్రభుత్వం విడనాడి, ప్రతి నిర్వాసిత కుటుంబానికి సమగ్ర న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

పోలవరం నిర్వాసితుల సమస్యలపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించి, పెండింగ్‌లో ఉన్న భూమి ప్యాకేజీ, ఇంటి స్ట్రక్చర్ విలువ, ఆర్అండ్ఆర్, భూమికి భూమి, 18 ఏళ్లు నిండిన యువతీ యువకుల సమస్యలను వెంటనే పరిష్కరించా లని సీపీఎం డిమాండ్ చేసింది. ఈ సమా వేశంలో పాల్గొన్న పాయం సత్యనారాయణ తెల్లం తమ్మయ్య మడకం నాగమణి వీయిక కన్నయ్య జోగయ్య సత్యనారాయణ రమేష్ జెట్టి సత్యనారాయణ శ్రీరాములు బజారి తదితరులు పాల్గొన్నారు

## దుర్గ మల్లికార్జున స్వామి వార్ల విశేష పూజలు



ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

శ్రావణ మాస శుక్రవారం సందర్భంగా ఆగిరిపల్లి శ్రీ శోభనాచల గట్టుపై స్వయంభు బ్రహ్మసూత్ర సహిత శ్రీ దుర్గా పార్వతీ సమేత మల్లికార్జున స్వామివారికి, బస్టాండ్ సమీపంలోని శ్రీ గంగా అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకవారాభిషేకం, పంచామృతాభిషేకం, ఫలరసాభిషేకం, స్నపనం, అలంకరణ, సహస్రనామార్చన తదితర విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు దేవులపల్లి శ్రీనివాసమూర్తి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. వరాహ పుష్కరిణి సమీపంలోని స్వయంభు శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో లలితా సహస్రనామార్చన, కుంకుమార్చన, సహస్ర పుష్పార్చన నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి సి.హెచ్. సాయి పర్యవేక్షించారు.



# కొత్త పెన్షన్ల దరఖాస్తులకు ఈనెల 30 వరకు గడువు పెంచాలి

### అర్హులందరికీ ఎన్టీఆర్ పెన్షన్లు అందేలా చర్యలు తీసుకోవాలి..

ప్రజా భూమి ప్రతినిధి-కూనవరం

మండలంలోని అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఎన్టీఆర్ పెన్షన్లు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం కూనవరం మండల కార్యదర్శి తెల్లం తమ్మయ్య డిమాండ్ చేశారు. కొత్త పెన్షన్ల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు ఈనెల 30వ తేదీ వరకు గడువు పొడిగించాలని కోరారు.అర్హులైన పేదలకు పెన్షన్లు అందించేందుకు అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. పెన్షన్ కు అవసరమైన ధ్రువపత్రాలు పొందడంలో జాప్యం లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు



స్వీకరించడంతో పాటు చిన్నచిన్న లోటుపాట్లు ఉంటే వాటిని సరిచేసి, అర్హులైన ప్రతి ఒక్కరికీ కొత్త పెన్షన్ మంజూరయ్యేలా చూడాలని కోరారు. ముఖ్యంగా ఒంటరి మహిళల పెన్షన్ల విషయంలో ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త నిబంధనలను పునఃపరిశీలించాలని తమ్మయ్య డిమాండ్ చేశారు. గతంలో ఉన్న నిబంధనల ప్రకారం అర్హులైన ఒంటరి మహిళలకు తక్కువ వయస్సు నుంచే పెన్షన్ అందేదని, ప్రస్తుతం కొత్త నిబంధనలతో వయోపరిమితిని పెంచడం వల్ల పలువురు అర్హులు పెన్షన్‌కు దూరమవుతున్నారని అన్నారు. ఈ నిబంధనలను తక్షణమే సవరించి అర్హులైన వారందరికీ పెన్షన్ అందించాలని కోరారు.అర్హత ఉన్నప్పటికీ ఎవరికైనా కొత్త పెన్షన్ మంజూరు కాకపోతే ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు, పోరాటాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు, ఆదివాసీ గిరిజన సంఘం మండల నాయకులు ఉయ్యక కన్నయ్య, తొండ లచ్చయ్య, పొడియం కృష్ణమ్మ, తెల్లం నాగమ్మ, పొడియం చంద్రమ్మ, పొడియం కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఏలూరులో జనసేన ఎన్నికల సన్నాహక సమావేశం

### కూటమి సమన్వయంతో మున్సిపల్ ఎన్నికలకు సిద్ధం కావాలి

ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఏలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి, స్థానిక సంస్థల ఏలూరు పార్లమెంటరీ సమన్వయ కమిటీ అధ్యక్షులు రెడ్డి అప్పలనాయుడు పిలుపునిచ్చారు.ఏలూరు జనసేన పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ కూటమి స్ఫూర్తికి ఎలాంటి విఘాతం కలగకుండా మూడు పార్టీల సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు.పార్టీ కోసం మొదటి నుంచి కష్టపడి పనిచేసిన నాయకులు,కార్యకర్తలకు సముచిత స్థానం లభిస్తుందని తెలిపారు.రాబోయే మున్సిపల్ ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు.గతంలో మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులతో సమావేశమై వారి ఎన్నికల అనుభవాలు, డివిజన్లలో ప్రజల అభిప్రాయాలు,స్థానిక సమస్యలపై వివరాలు తెలుసుకున్నారు.ఓటర్ల జాబితా,ఎన్నికల సన్నాహాలు,స్థానిక నాయకులతో సమన్వయం వంటి అంశాలపై



చర్చించారు.త్వరలో ఏలూరు నియోజకవర్గంలో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించి ఎన్నికల సన్నాహాలను మరింత వేగవంతం చేస్తామని రెడ్డి అప్పలనాయుడు తెలిపారు.ఈ సమావేశంలో నారా శేషు, కస్తూరి సాయి తేజస్విని,దోనేపూడి లోవరాజు, కావూరి వాణిశ్రీ, నిమ్మల జ్యోతి కుమార్, ఓబిలిశెట్టి శ్రావణ్ గుప్తా, వీరంకిపండు, నగిరెడ్డి కాశీ నరేష్ పాల్గొన్నారు.

# నూతన పెన్షన్ దరఖాస్తు గడువును పెంచాలి

### పింఛన్ దరఖాస్తులో కరెంట్ బిల్లు తప్పనిసరి ఆప్షన్‌ను ఏజెన్సీ ప్రాంతం వరకు మినహాయింపు ఇవ్వాలి

ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం.

నూతనంగా పెన్షన్ దరఖాస్తు చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన గడువు తేదీని పెంచాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సున్నం రాజులు కోరారు. శుక్రవారం నాడు రేఖపల్లి కామ్రేడ్ బొప్పన భీమయ్య భవన్ లో సోయం చినబాబు అధ్యక్షతన జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూతన పెన్షన్ దరఖాస్తు చేసుకోవడం కొరకు దరఖాస్తు దారులు రోజువారి తిరగడం సరిపోతుందని, ఒకపక్క నెట్వర్క్ లేక దరఖాస్తులు తీసుకోకపోవడం ఒక సమస్య అయితే మరోపక్క వరుస సెలవులు కావడం దరఖాస్తుదారులకు పూర్తి న్యాయం జరిగే అవకాశం లేదని, తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం పింఛన్ దరఖాస్తు గడువు తేదీని ఈనెల చివరి వరకు పెంచి ప్రతి ఒక్క లబ్ధిదారునికి న్యాయం జరిగే విధంగా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా పింఛన్ దరఖాస్తు చేసుకునే ఆప్షన్లో విద్యుత్ బిల్లు తప్పనిసరి అని ఇవ్వడం వలన కరెంటు లేని గ్రామాల ప్రజలు కరెంటు బిల్లులు లేక పింఛన్ కి దూరమయ్యే పరిస్థితిలో ఏర్పడ్డాయని, ఒకపక్క ఆ గ్రామాలకి కరెంటు ఇవ్వక



మరొకపక్క పింఛను అందక తీవ్రంగా ఏజెన్సీలోని లబ్ధిదారులు ముఖ్యంగా ఆదివాసీలు, వెనుకబడిన బడుగు బలహీన వర్గాల ప్రజలు అన్యాయానికి గురవుతున్నారని వారు వాపోయారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం పింఛన్ దరఖాస్తు గడువు తేదీని ఈ నెల ఆఖరి వరకు పెంచి, ఏజెన్సీ ప్రాంతం వరకు పింఛన్ దరఖాస్తుకు కరెంట్ బిల్లు తప్పనిసరి అనే ఆప్షన్ మినహాయింపు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్, మండల నాయకులు పంకు.సత్తిబాబు, కారం సుందరయ్య, పూణెం ప్రదీప్ కుమార్, పోడియం శ్రీరామ్ మూర్తి, వడ్లాది రమేష్, పులి బొజ్జి, గుండెపూడి లక్ష్మణరావు, కారం సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



## టీడీపీ మండల అధ్యక్షుడికిని పరామర్శించిన అల్లూరి

ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి

తాళ్లపూడి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సిద్దా దుర్గాప్రసాద్‌ను టీడీపీ నాయకులు అల్లూరి విక్రమాదిత్య పరామర్శించారు. ఇటీవల కాలుకి ఆపరేషన్ చేసుకున్న దుర్గాప్రసాద్‌ను ఆయన కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజా జీవితంలోకి రావాలని అల్లూరి విక్రమాదిత్య ఆకాంక్షించారు. ఆయన వెంట తాళ్లపూడి మాజీ ఎంపీటీసీ పెదపాటి కృష్ణ మోహన్, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# భూసేకరణను ఒకే దఫాలో పూర్తి చేయాలి

### ఆర్డీవోను కోరిన పోచవరం రైతులు

ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి

పరిశ్రమల ఏర్పాటుకు చేపడుతున్న భూసేకరణలో భాగంగా పోచవరం గ్రామ పరిధిలోని రైతుల భూములను దశల వారీగా కాకుండా ఒకే దఫాలో సేకరించాలని పోచవరం గ్రామ రైతులు కొవ్వూరు ఆర్డీవో కె. ఆనందరావును కోరారు. రాగోలపల్లి సొసైటీ అధ్యక్షుడు అనపర్తి ప్రసాద్ ఆధ్వర్యంలో రైతులు శుక్రవారం ఆర్డీవోను కలిసి తమ సమస్యలను వివరించారు.పోచవరం గ్రామ పరిధిలో 28 మంది రైతుల భూములు భూసేకరణ పరిధిలో



ఉన్నాయని, దశల వారీగా భూములు సేకరిస్తే మిగిలిన భూములకు రహదారి సౌకర్యం లేక రైతులు తమ పొలాలకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల మొత్తం భూసేకరణను ఒకే దఫాలో పూర్తి చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.రైతుల విజ్ఞప్తిపై ఆర్డీవో కె. ఆనందరావు స్పందిస్తూ ప్రస్తుత నిబంధనల ప్రకారం మొత్తం భూసేకరణను ఒకే దఫాలో పూర్తి చేసే అవకాశం లేదని తెలిపారు. అయితే అతి త్వరలోనే రెండో దఫా భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసి మిగిలిన రైతుల భూములను కూడా సేకరిస్తామని హామీ ఇచ్చారు. రైతులకు న్యాయమైన పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కొవ్వూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ దాకే రాజు, పోచవరం గ్రామ రైతులు పాల్గొన్నారు.

## వినాయక చవితి ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించాలి

-ఆత్రేయపురంలో ఉత్సవ కమిటీలతో పోలీసు-రెవెన్యూ అధికారుల సమావేశం.



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట.

వినాయక చవితి ఉత్సవాలను శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని కొత్తపేట డీఎస్పీ సుంకర మురళి మోహన్ సూచించారు. డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఐపీఎస్ ఆదేశాల మేరకు ఆత్రేయపురం మండలంలో వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో పోలీసు, రెవెన్యూ అధికారులతో కలిసి ఉత్సవ కమిటీల నిర్వాహకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రావులపాలెం రూరల్ సీఐ సి హెచ్. విద్యాసాగర్, ఆత్రేయపురం ఎస్సై ఎస్. రాము, తహసీల్దార్ ఆర్.డి. రామచంద్రమూర్తి, ఎంపీడీవో వికాస్ రామన్, పోలీసు, రెవెన్యూ శాఖల సిబ్బంది పాల్గొన్నారు. అధికారులు ఉత్సవ కమిటీలకు పలు కీలక సూచనలు చేశారు. వినాయక మండపాల ఏర్పాటుకు సింగిల్ విండో విధానం ద్వారా సంబంధిత శాఖల నుంచి తప్పనిసరిగా అనుమతులు పొందాలని సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే ప్రాంతాలు, సమస్యాత్మక ప్రదేశాల్లో మండపాలు ఏర్పాటు చేయరాదని స్పష్టం చేశారు. అలాగే, డీజేలు, అనుమతి లేని ఫ్లెక్సీల ఏర్పాటుకు అనుమతి లేదని తెలిపారు. పోలీసు, రెవెన్యూ శాఖల నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. వినాయక చవితి ఉత్సవాలను పరస్పర సహకారంతో ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించి ఆదర్శంగా నిలవాలని అధికారులు పిలుపునిచ్చారు.

## మాంటిస్సోరి హైస్కూల్లో ఘనంగా ఏకో ఫ్రెండ్లీ వినాయక చవితి



ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి

తాళ్లపూడి మాంటిస్సోరి హైస్కూల్లో ఏకో ఫ్రెండ్లీ వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌కేజీ, యూకేజీ చిన్నారులు మట్టి వినాయక ప్రతిమను ప్రదర్శించారు.పర్యావరణ పరిరక్షణపై చిన్నారుల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో మట్టి వినాయకుడిని పూజించే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పాఠశాల కరస్పాండెంట్ వి.వి. అనీష్ తెలిపారు. పర్యావరణానికి హాని కలిగించే రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా ప్రతి ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలను పూజించాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


## కోనసీమ తిరుమల వాడపల్లిలో ఘనంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

-శ్రావణమాసం సందర్భంగా మహిళా భక్తుల విశేష స్పందన.



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట.

కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రావణ మాసం సందర్భంగా శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయ ప్రాంగణం మహిళా భక్తులతో కిక్కిరిసిపోయింది. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య మహిళలు సంప్రదాయబద్ధంగా వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించి అమ్మవారి అనుగ్రహం కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ ముదునూరి వెంకటరాజు (గబ్బర్ సింగ్), డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు చలుమూరి రాంబాబు, గంగవరపు పద్మావతి, కాస చాముండేశ్వరి, కొల్లుబోయిన శ్రీనివాస్ యాదవ్, పెండెం కుమారి, పెండ్యాల భవాని, సలాది నాగేశ్వరావు, సరేళ్ల సరిత, ఏపుగంటి విజయకుమారి, చింతపల్లి సత్యనారాయణ, తమ్మన సాయి ప్రసాద్, ఎల్లమిల్లి చంద్రకుమారి, కొండపల్లి రామచంద్రరావు, సిస్ట కుటుంబరావు, దాలిపర్తి శ్రీలక్ష్మి, గోశాల అప్పలనరస, మసకపల్లి త్రిమూర్తులు, ఎక్స్ అఫీషియో సభ్యుడు వాడపల్లి సుందర శేషావతారం పాల్గొన్నారు. వ్రతం అనంతరం ఆలయ అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులు భక్తులకు స్వామివారి ప్రసాదాలను పంపిణీ చేశారు. అనంతరం శ్రీ వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అధిక సంఖ్యలో మహిళా భక్తులు, భక్తజనులు పాల్గొనడంతో ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.



ప్రజాభూమి
అనంతపురం,శ్రీసత్యసాయి జిల్లా 6
శనివారం 12 సెప్టెంబరు 2026

## ఇస్కాన్‌కు రూ.5 లక్షలు.. సాయి బాబా గుడికి రూ.1 లక్ష..

### -జొన్నలగడ్డ దంపతుల విరాళం




ప్రజా భూమి శింగనమల

శింగనమల మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆలూరు సాంబ శివారెడ్డి దంపతులు భక్తి, దాతృత్వాన్ని చాటుకున్నారు. అనంతపురం సమీపంలోని సోములదొడ్డి వద్ద ఉన్న ఇస్కాన్ ఆలయానికి గతేడాది రూ.1 లక్ష, ఈ ఏడాది రూ.4 లక్షలు, అనంతపురం రెండో రోడ్డులోని సాయిబాబా ఆలయానికి రూ.1 లక్ష చొప్పున విరాళంగా అందించారు. మొత్తంగా రూ.6 లక్షల విరాళాన్ని అందజేశారు. ఇస్కాన్ ఆలయంలో శ్రీకృష్ణుడు, రాధారాణి దివ్య మూర్తులను దర్శించుకుని జొన్నలగడ్డ పద్మావతి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం సాయి బాబా ఆలయానికి వెళ్లి సాయి బాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు సహకరించడం సంతోషంగా ఉందని జొన్నలగడ్డ దంపతులు తెలిపారు. భక్తి, సేవా కార్యక్రమాల్లో తమ వంతు భాగస్వామ్యం కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు జొన్నలగడ్డ పద్మావతి, ఆలూరు సాంబ శివారెడ్డి దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యం..ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం



అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో 58వ ప్రజా దర్బార్ కార్యక్రమం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్. శుక్రవారం ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి ప్రాధాన్యత క్రమంలో పరిష్కారం చూపించడమే లక్ష్యంగా అనంతపురం శాసనసభ్యులు దగ్గుపాటి ప్రసాద్ ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో 58వ ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ప్రజల నుంచి నేరుగా అర్జీలను స్వీకరించి, వారి సమస్యలను తెలుసుకున్నారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని పరిశీలించి, ప్రాధాన్యతల వారీగా సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. సంబంధిత శాఖల అధికారులకు అర్జీలను పంపించి, సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు బెస్త వెంకటేశ్వర్లు, వడ్డే వెంకటేశ్వర్లు, నరసింహులు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు

## సెలవు రోజులలో తరగతులు నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

### -ఎంఈఓకి విన్నవించిన పిడిఎస్ యూ




ప్రజాభూమి, హిందూపురం టౌన్

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని పిడిఎస్ యూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం మండల విద్యాశాఖ అధికారి గంగప్పకు వినతిపత్రం అందజేశారు. అనంతరం పిడిఎస్ యూ జిల్లా అధ్యక్షులు బాబావలి మాట్లాడుతూ, శనివారం నుండి వరుసగా ఈ మూడు రోజులు ప్రభుత్వ సెలవులు ఉన్నాయని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ సెలవు రోజులలో తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థల పైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు సెలవులు ఇవ్వకుండా తరగతులు నిర్వహిస్తే విద్యార్థులు మానసిక ఆవేదనకు గురవుతారని తెలిపారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు గుర్తించి ప్రభుత్వ సెలవు రోజులలో తరగతులు నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై కఠినంగా శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున తరగతులు నిర్వహిస్తున్న విద్యాసంస్థల దగ్గర ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం హిందూపురం పట్టణ నాయకులు నాగేంద్ర, అనుదీప్, వలిసాబ్, నంజుండేశ్వర తదితరులు పాల్గొన్నారు.

## మీ సేవల్లో బాండ్లు లేవు.. పెన్షన్లు ఎలా వస్తాయి..

### -తక్షణమే బాండ్లు సరఫరా చేయాలి

ప్రజాభూమి, హిందూపురం టౌన్



నూతన పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించినప్పటికీ క్షేత్ర స్థాయిలో అందుకు అవసరమైన ఏర్పాట్లు లేకపోవడంతో అర్హులు ఇబ్బందులు పడుతున్నారని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. మీ సేవా కేంద్రాలు, కొన్ని సచివాలయాల్లో దరఖాస్తులకు అవసరమైన బాండ్లు అందుబాటులో లేకపోవడంతో పలువురు అర్హులు దరఖాస్తు చేసుకోకుండానే వెనుదిరుగుతున్నారని తెలిపారు. ఈ మేరకు శుక్రవారం రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ప్రతినిధులు కలిసి హిందూపురం తహసీల్దార్ వెంకటేష్ కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న నూతన పెన్షన్ పథకానికి అర్హులైన ప్రతి ఒక్కరికీ దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఒకవైపు నూతన పెన్షన్లకు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం చెబుతూ.. మరోవైపు దరఖాస్తుకు అవసరమైన బాండ్లు అందుబాటులో లేకపోవడం వల్ల అర్హులు దరఖాస్తు చేసుకోలేని పరిస్థితి నెలకొనడం సరికాదన్నారు. వెంటనే మీ సేవా కేంద్రాలు, సచివాలయాలకు అవసరమైన బాండ్లను సరఫరా చేసి, దరఖాస్తు ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాండ్ల కొరత కారణంగా దరఖాస్తు చేసుకోలేకపోయిన అర్హులకు న్యాయం చేసేందుకు పెన్షన్ దరఖాస్తుల గడువును మరో 15 రోజులు పొడిగించాలని కోరారు. అర్హులెవరూ ప్రభుత్వం అందిస్తున్న పథకం నుంచి దూరం కాకుండా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌పీ పార్టీ జిల్లా కార్యదర్శి ఏ. శ్రీనివాసులు, బీఎస్పీ రాష్ట్ర నాయకులు శ్రీరాములు, దళిత సమైక్య నాయకులు ఎస్. నారాయణ, కిరణ్, ఎమ్మార్పీఎస్ నాయకులు శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని..!

### వైఎస్సార్సీపీ శ్రేణులకు పిలుపునిచ్చిన రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి...!




ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాప్తాడు నియోజకవర్గంలో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి నియోజకవర్గం నలుమూలల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా హాజరు అయ్యారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రతి కార్యకర్త సిద్ధంగా ఉండాలని పిలుపు ఇచ్చారు. శుక్రవారం గ్రామస్థాయి నుంచి సమర్థవంతమైన అభ్యర్థులను ఎంపిక చేసి, వారిని గెలిపించేందుకు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. "ఇవి సాధారణ ఎన్నికలు కావు.. కచ్చితంగా గెలవాల్సిన ఎన్నికలు" అని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కరువు, సాగునీరు, విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న రాప్తాడు నియోజకవర్గ రైతుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని పిలుపు ఇచ్చారు. పేరూరు డ్యాముకు నీరు అందించడం, హంద్రీ-నీవా కాలువల అభివృద్ధి, భూగర్భ జలాల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.' రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం సాధించాలంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్సీపీ ఘన విజయం సాధించాలని ప్రకాష్ రెడ్డి పిలుపునిచ్చారు. వైఎస్సార్సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, రాప్తాడు నియోజకవర్గంలో తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అధ్యక్షతన విస్తృత స్థాయి సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి రాప్తాడు నియోజకవర్గం నలుమూలల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు వైఎస్సార్సీపీ శ్రేణులంతా పూర్తి స్థాయిలో సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయి నుంచి బలమైన, ప్రజలకు అందుబాటులో ఉండే సమర్థవంతమైన అభ్యర్థులను ఎంపిక చేసి, వారిని గెలిపించేందుకు ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇవి సాధారణ ఎన్నికలు కావు మనం కచ్చితంగా గెలవాల్సిన ఎన్నికలు. ప్రతి స్థానంలో సరైన అభ్యర్థిని నిలబెట్టి, గెలిపించి తీసుకురావాలి. అందుకు మీకు మేము పూర్తి అండగా ఉంటాం. మనం ఘన విజయం సాధించి ప్రజా సమస్యలపై మరింత బలంగా పోరాడాలి" అని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. అనంతరం నియోజకవర్గంలో నెలకొన్న రైతుల సమస్యలపై ప్రకాష్ రెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు లేక బోర్లు ఎండిపోవడంతో కరువు తీవ్రరూపం దాల్చిందని, రైతులు పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేసినా గిట్టుబాటు ధరలు లేక తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హంద్రీ-నీవా కాలువలకు లైనింగ్ పనులు చేయడం వల్ల వేలాది ఎకరాల భూములు సాగుకు దూరమవుతున్నాయని, భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పేరూరు డ్యాముకు నీటిని అందించకుండా రాప్తాడు నియోజకవర్గ రైతులతో పాటు రొద్దం, పెనుకొండ మండలాల రైతులను కూడా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆయన విమర్శించారు. అలాగే ఇసుక అక్రమ రవాణాను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమవుతోందని, భూగర్భ జలాలను పరిరక్షించేందుకు తగిన చర్యలు తీసుకోకపోవడం వల్ల భవిష్యత్తులో రైతులు మరింత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతోందని అన్నారు. రైతులకు సాగునీరు, విద్యుత్, గిట్టుబాటు ధరలు, కరువు సమస్యల నుంచి ఉపశమనం కల్పించాలంటే ప్రజల తరఫున నిరంతరం పోరాడాల్సిన అవసరం ఉందని తెలిపారు. రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్నా గ్రామస్థాయిలో ప్రజలకు అండగా నిలవాలన్నా స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్సీపీ ఘన విజయం సాధించాల్సిన అవసరం ఉందని తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వైఎస్ఆర్సిపి నాయకులు వీరాంజనేయులు, రంగంపేట గోపాల్ రెడ్డి, మాజీ జెడ్పిటిసిలు, ఎంపీటీసీలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణదుర్గంలో వైసీపీ విస్తృత స్థాయి సమావేశం

- ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి
- మాజీ ఎంపీ రంగయ్య ఆధ్వర్యంలో కార్యకర్తలకు ఐడీ కార్డులు పంపిణీ



ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య ఆధ్వర్యంలో శుక్రవారం కళ్యాణదుర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసిన వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి హాజరైన నియోజకవర్గ పరిశీలకులు మహీంద్రరెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంత గతంలో మనం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా ఇదే టీడీపీతో పోరాడి గట్టిగా పోరాటాలు చేసి అభ్యర్థులను గెలిపించుకున్నాం. పార్టీకి నిబద్ధులై, క్రమశిక్షణగా ఉన్న అభ్యర్థులను బరిలో దింపి వాళ్ళ విజయానికి అందరూ కలిసికట్టుగా పనిచేయండి. ఉన్నోడు మాత్రమే గెలుస్తాడు అనే అపోహను వీడండి. ప్రజల వద్దకు వెళ్లి కూటమి అవినీతి, అరాచకాలను తెలియజేయండి. ఈ ప్రభుత్వం వచ్చాక కరెంట్ చార్జీలు పెంచినప్పుడు, రైతన్నల కోసం, విద్యార్థుల కోసం, ఆర్టీటీ కోసం.. ప్రజలకు ఏ కష్టం వచ్చినా మనం అండగా నిలబడ్డాం. ఇక ఎన్నికలు ఆలస్యం చేస్తే ఉన్నవి కూడా పోతాయి అనే ఆలోచనలో కూటమి నేతలు ఉన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా మనమంతా సిద్ధంగా ఉందాం. అరాచక పాలన నుండి రక్షించుకోవాలి అంటే కలిసికట్టుగా పని చేసి మన అభ్యర్థులను గెలిపించుకోవాలి. కూటమి ప్రభుత్వం వచ్చాక రెండేళ్లలో 5 లక్షల పింఛన్ లు తీసేశారు. ఇప్పుడు ఎన్నికలు వస్తున్నాయని కొత్త పింఛన్ల పేరుతో నాటకాలు ఆడుతున్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో కూడా దోపిడీ పాలన సాగుతోంది. ప్రజాప్రతినిధులు ఇంత నీచంగా దిగజారిపోతారా అంటూ ప్రజలే చెప్పుకుంటున్నారు. మనం ఐక్యమత్యంతో పని చేస్తే కళ్యాణ దుర్గం నియోజకవర్గంలోని ఐదు మండలాలలో పాటు, మున్సిపాలిటీను కూడా కైవసం చేసుకుంటాం. గతంలో మన చేసిన అభివృద్ధి, సంక్షేమం చెప్పుకోలేక ఓడిపోయాం. రెండున్నరేళ్లలో టీడీపీ చేస్తున్న దురాగతాలను వివరిస్తూ మనం చేసిన మంచిని ప్రజలకు వివరిద్దాం. రానున్న రోజుల్లో కార్యకర్తలకు పెద్దపీట వేస్తాం కార్యకర్తలను నాయకులను చేస్తాం. స్థానిక ఎన్నికల్లో ఆయా పంచాయితీలకు, వార్డులకు సంబంధించిన అభ్యర్థులను మీరే సెలెక్ట్ చేసుకుని, వారిని గెలిపించుకోవాల్సిన బాధ్యత కూడా మీదే. ఏ ఒక్కరికి భయపడకుండా ధైర్యంగా ఎన్నికలకు వెళ్లాం. పోరాటాలు మనకు కొత్త కాదు.. గొంచి తండాలో మొదలు పెట్టి ఢిల్లీ వరకు తెలిసేలా ఆర్టీటీ కోసం పోరాటం చేశాం. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో అభివృద్ధి లేదు.. కొండ మొదలు గుట్ట వరకు ఏది వదలకుండా దోచేస్తున్నారు. నియోజకవర్గంలో ఒక్క ఎకరాకైనా నీళ్లు ఇచ్చారా? నియోజకవర్గంలోని చెరువులకు నీరు ఇచ్చే వరకు పోరాడుదాం కష్టపడే ప్రతి కార్యకర్తలకు న్యాయం చేస్తాం. నియోజకవర్గంలోని అన్ని ఊర్లలో బెల్ట్ షాపులు, ఇసుక దోపిడీ జరుగుతోంది. ఇదే కూటమి అభివృద్ధి, క్రమశిక్షణ, నిబద్ధతతో పని చేసే అభ్యర్థులను స్థానిక ఎన్నికల బరిలో నిలిపి గెలిపించుకుందాం. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మట్టి గణపతులనే పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం

### ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలతో పర్యావరణానికి ముప్పు-పాంచజన్య శ్రీనివాసులు




ప్రజాభూమి, హిందూపురం టౌన్

చిన్నా, పెద్దా తేడా లేకుండా వాడవాడలా వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకుంటారని, అయితే వేడుకలతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని పాంచజన్య పాఠశాల అధ్యక్షులు డాక్టర్ పి.ఎస్. శ్రీనివాసులు సూచించారు. పర్యావరణ హితమైన మట్టి గణపతులను పూజించడం ద్వారా ప్రకృతిని కాపాడుకోవచ్చన్నారు. వినాయక చవితిని పురస్కరించుకుని శుక్రవారం పాంచజన్య పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులతో వివిధ ఆకృతుల్లో మట్టి వినాయక ప్రతిమలను తయారు చేయించారు. పాఠశాల అధ్యక్షులు డాక్టర్ పి.ఎస్. శ్రీనివాసులు, కరస్పాండెంట్ డి.ఎస్. నందకుమార్ ప్రత్యేక సూచనలు, పర్యవేక్షణలో విద్యార్థులు మట్టి వినాయక ప్రతిమలను రూపొందించారు. విద్యార్థులు స్వయంగా తయారు చేసిన వివిధ రకాల వినాయక ప్రతిమలను ప్రదర్శించగా పాఠశాల యాజమాన్యం వారిని అభినందించింది. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మట్టి గణపతులను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ, వినాయక చవితి పిల్లలకు ఎంతో ఇష్టమైన పండుగ మాత్రమే కాకుండా ప్రకృతికి మనిషిని మరింత దగ్గర చేసే పండుగ అన్నారు. భారతీయ సనాతన సంప్రదాయంలో మట్టితో వినాయక ప్రతిమలను తయారు చేసి, ప్రకృతి సిద్ధంగా లభించే ఆకులు, పూలతో పూజించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ప్రస్తుతం విగ్రహాల అందం, ఆకర్షణకు ప్రాధాన్యతనిస్తూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులు, ఇతర ప్రమాదకర పదార్థాలతో భారీ విగ్రహాలను తయారు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు, రసాయన రంగులు నీటిలో సులభంగా కరగకపోవడంతో నిమజ్జనం అనంతరం చెరువులు, కుంటలు, ఇతర నీటి వనరుల్లో కాలుష్యానికి కారణమవుతున్నాయని తెలిపారు. దీంతో జలచరాలకు ముప్పు ఏర్పడటంతో పాటు పర్యావరణంపై, మానవులు, జంతువుల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. వినాయక ఉత్సవ కమిటీలు వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని పర్యావరణహితంగా వేడుకలను నిర్వహించాలని కోరారు. హిందూపురం పట్టణంలో దాదాపు 500 వరకు వినాయక పందిళ్లు ఏర్పాటు చేసే అవకాశం ఉందని, ఇంత పెద్ద సంఖ్యలో ఉత్సవాలు జరిగే సమయంలో పర్యావరణ పరిరక్షణపై మరింత శ్రద్ధ అవసరమన్నారు. ప్రతి పందిరిలో మట్టి వినాయక ప్రతిమలను ఏర్పాటు చేసి, ప్రకృతి సిద్ధమైన పూజా సామగ్రిని వినియోగించాలని సూచించారు. పర్యావరణాన్ని కాపాడటం కేవలం ప్రభుత్వాలు, అధికారుల బాధ్యత కాదని, ప్రతి పౌరుడి బాధ్యత అని స్పష్టం చేశారు. పాంచజన్య పాఠశాల తరఫున విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యతను వివరించడంతో పాటు, కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులతో మట్టి వినాయకులను పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం అంటూ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం అందరికీ మట్టి వినాయకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం గాయత్రి, ఏఓ భాస్కర్, సూపరింటెండెంట్ విజయేంద్ర, ఏహెచ్ఎంలు శశికళ, షేక్ అబ్దుల్ రజాక్, సతీష్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పుట్లూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించండి

### రైతులు, వ్యవసాయ కార్మికులు, చేతివృత్తిదారులను ఆదుకోండి. సిపిఐ మండల కార్యదర్శి డి. పెద్దయ్య.




ప్రజాభూమి, పుట్లూరు .

పుట్లూరు మండలంలోని తాసిల్దార్ కార్యాలయం వద్దఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రైతు, చేతి వృత్తిదారు సంఘాల ఆధ్వర్యంలో నెలకొన్న తీవ్ర అనావృష్టి వల్ల ఏర్పడిన వర్షాభావ పరిస్థితులను తీసుకొని, తక్షణమే కరువు మండలాలుగా ప్రకటించి, రైతులు వ్యవసాయ కార్మికులు, చేతి వృత్తిదారులను ఆదుకోవాలని ప్రత్యేక కరువు సహాయక చర్యలు చేపట్టాలని కోరుతూ ధర్నా నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉప ప్రధాని కార్యదర్శి డి, పెద్దయ్య మాట్లాడుతూ! రాష్ట్రంలో ఈ ఖరీఫ్ సీజన్లో అనావృష్టి వల్ల తీవ్ర వర్షం పరిస్థితుల్లో నెలకొన్నాయి. సాధారణ వర్షపాతం కంటే భారీగా లోటు ఏర్పడడంతో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటుంది. వర్షాలు సకాలంలో కురువకపోవడంతో రైతులు పంటలు సాగు చేయలేని పరిస్థితి ఏర్పడగా, ఇప్పటికే సాగు చేసిన పంటలు సైతం ఎండు ముఖం పట్టాయి. రాష్ట్రవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో మండలాలలో లోటు వర్షపాతం నెలకొంది. సుమారు 98 లక్షల ఎకరాల్లో పంట కావాల్సి ఉండగా, వర్షాభావ పరిస్థితులు కారణంగా 34 లక్షల ఎకరాలకు మించి పంట సాగు కాలేదు. వర్ష బావ కారణంగా టమోటా, కంది పంటలు ఎండిపోతున్నాయి. దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. పంటలు సాగు కాకపోవడంతో వ్యవసాయ కార్మికులు ఉపాధి లేకుండా పోయింది. చేతి వృత్తిదారులకు వృత్తి దెబ్బతిన్నాయి. గ్రామీణ ప్రాంతాలలో కొనుగోలు శక్తి పోయి జీవనోపాధి సంక్షోభం ఏర్పడింది. అప్పుల భారంలో కూరుకుపోయే ప్రమాదం మరింత పెరిగింది. వ్యవసాయ కూలీలకు, ఇతర వృత్తుల వారికి పనులు లేక ఇప్పటికే గ్రామాలు వదిలి ఇతర ప్రాంతాలకు వలసలు పోతున్నారు, ఉపాధి పనులు కల్పిస్తే వలసలు వెళ్లకుండా ఆపవచ్చు కానీ రాష్ట్ర ప్రభుత్వం అటు ఆలోచించడం లేదు. రైతులు పశువులు మూగజీవాలకు మేత త్రాగునీరు లేక అమ్ముకుంటున్నారు. ఇంత తీవ్రమైన కరువు ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మండలాలలో నెలకొన్న వర్షబావ పరిస్థితిలో సమగ్రంగా పరిశీలించి, తక్షణమే కరువు మండలాలుగా ప్రకటించి కరువు సహాయక చ ర్యలు ప్రారంభించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి, బాలు, డి హెచ్ పి డి మం" కార్యదర్శి రాఘవేంద్ర, రాజు, ఓబుళపతి, దేవరాజు, బలరాముడు, డ్రైవర్ ఓబులేసు, నారాయణ, బాల్ లక్ష్మన్న, శివలింగేశ్వర తదితరులు పాల్గొన్నారు.

# చేనేత కార్మికులకు ఎలాంటి ఆంక్షలు లేకుండా పింఛన్లు ఇవ్వాలి

## -నేతన్న సేవలో లబ్ధిదారుల అర్హత జాబితా ఆధారంగా 50 ఏళ్లు నిండిన వారికి పింఛన్ అందించాలని విజ్ఞప్తి



ప్రజాభూమి, సిద్ధవటం: 50 సంవత్సరాలు నిండిన అర్హులైన చేనేత కార్మికులకు ఎలాంటి ఆంక్షలు లేకుండా పింఛన్లు అందించాలని రాష్ట్ర పద్మశాలి సంక్షేమ సంఘం యువజన విభాగం కార్యదర్శి అవ్వారు రవిశంకర్ కూటమి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం మాధవరం-1 గ్రామంలో ఆయన మాట్లాడుతూ.. నేతన్న సేవలో లబ్ధి పొందిన అర్హులైన కార్మికుల జాబితా ఆధారంగా పింఛన్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. చేనేత కార్మికులు ఇప్పటికే తగిన గిట్టుబాటు ధరలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రెక్కాడితే గానీ డొక్కాడని కార్మికులను పింఛన్ కోసం అనేక రకాల పత్రాలు, ఆంక్షలతో ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. చేనేత వృత్తిలో శారీరక శ్రమ అధికంగా ఉంటుందని, చిన్న అనారోగ్యంతోనూ మగ్గం పని చేయలేని పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. కార్మికుల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి, చేనేత జౌళి శాఖ మంత్రి, అధికారులు పునరాలోచించి సరళమైన విధానంలో పింఛన్లు అందించాలని కోరారు. నేతన్న సేవలో, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ తరహాలోనే పింఛన్ విషయంలోనూ చేనేత కార్మికులకు ప్రభుత్వం చేయూతనివ్వాలని రవిశంకర్ విజ్ఞప్తి చేశారు.

# డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన కళాశాలలో ఓజోన్ డే - ఎల్ నినో క్విజ్ పోటీలు





ప్రజాభూమి, పులివెందుల

ప్రపంచ ఓజోన్ దినం సందర్భంగా స్నేహిత అమృత హస్తం సేవాసమితి, ఎన్ఎస్ ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో ఓజోన్ పరిరక్షణ, ఎల్ నినో ప్రభావం, వరదలు, భూకం పాలు వంటి ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన క్విజ్ పోటీలు రెండవ రోజు డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉద్యాన కళాశాలలో శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి.కళాశాల డీన్ డాక్టర్ నాగరాజు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ.. వాతావరణ మార్పులు, ఓజోన్ పొర పరిరక్షణ, ఎల్ నినో వంటి అంశాలపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడం కాలానుగుణ అవసరమని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో యువత చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం సభ్యులు, క్విజ్ మాస్టర్ క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సమకాలీన అంశాలపై అవగాహన పెంచడమే ఈ పోటీల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు మాట్లాడుతూ.. సమాజానికి ఉపయోగపడే విద్యా, వైద్య, పర్యావరణ, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను తమ సంస్థ నిరంతరం నిర్వహిస్తోందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.క్విజ్ పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభను చాటారు. అనంతరం ప్రథమ, ద్వితీయ స్థానాల విజేతలను ప్రకటించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ సయ్యద్ సదరున్నీసా, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ యశ్వంత్, ఎన్ఎస్ఎస్ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీ వృషభాచలేశ్వర స్వామిని దర్శించుకున్న ఆర్జేసీ

## - భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సూచన



ప్రజాభూమి, వేంపల్లె

స్థానిక పాపాగ్ని నదీ తీరాన ఎద్దులకొండపై వెలసిన శ్రీ వృషభాచలేశ్వర స్వామి దేవస్థానాన్ని ఆంధ్రప్రదేశ్ దేవదాయ ధర్మదాయ శాఖ మల్టీజోన్-2, తిరుపతి ప్రాంతీయ సంయుక్త కమిషనర్ (అర్జేసి) బి. మహేశ్వర రెడ్డి శుక్రవారం దర్శించుకున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కె. సుభాష్ తెలిపారు. ఆలయ పాలకమండలి చైర్మన్ పీవీ రమణ, ఆలయ ముఖ్య అర్చకులు హరి ప్రవీణ్ ఆయనకు స్వాగతం పలికారు. ముఖ్య అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేసి, ఆలయ సంప్రదాయం ప్రకారం సత్కరించినట్లు సుభాష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించిన ఆర్జేసీ భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అన్నదాన ప్రసాదం పంపిణీకి అవసరమైన ఏర్పాట్లు చేయాలని, దేవస్థానం ప్రాముఖ్యతను తెలిపే ఫ్లెక్సీలు, హోర్డింగులను గండి క్షేత్రం, ముఖ్య కూడళ్లలో ఏర్పాటు చేయాలని సూచించారు. ఆలయ ప్రాంగణంలో ఆహ్లాదకర వాతావరణం కోసం పూల మొక్కలు, దేవతా వృక్షాలను పెంచాలని ఆదేశించారు. వేంపల్లి పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న దేవస్థానం కల్యాణ మండపాన్ని అభివృద్ధి చేసేందుకు అవసరమైన నివేదికలను ఇంజినీరింగ్ అధికారులకు పంపాలని ఆదేశించినట్లు ఈఓ సుభాష్ తెలిపారు.

# ఉద్యోగ భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితులు నిబంధనలపై అవగాహన సదస్సు




ప్రజాభూమి, వేముల

కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో "ఉద్యోగ భద్రత, ఆరోగ్యం మరియు పని పరిస్థితులు (కేంద్ర) నియమాలు - 2026" పై తుమ్మలపల్లె యురేనియం గనిలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు.నెల్లూరు రీజియన్ గనుల భద్రతా కార్యాలయం నుంచి గనుల భద్రతా సంచాలకులు రాజ్ కిషోర్ సింగ్, ఉప సంచాలకులు డా. కుప్పర్తి కిషోర్ కుమార్ హాజరై కార్మికులకు ప్రెజెంటేషన్ ద్వారా నిబంధ నల ప్రాముఖ్యతను వివరించారు.ఈ సందర్భంగా ఉప సంచాలకులు కిషోర్ కుమార్ మాట్లాడుతూ.. గనిలో తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ సెంటర్లు, క్యాంటీన్లలో పరిశుభ్రమైన భోజన సదుపాయాలు కల్పించా లని, ఏటా కార్మికులకు హెల్త్ చెకప్‌లు నిర్వహించాలని, వేతనాలు సకాలంలో చెల్లించాలని, కేంద్ర నూతన నిబంధనలను పూర్తిగా అమలు చేయాలని యాజమాన్యాన్ని ఆదేశించారు.సంచాలకులు రాజ్ కిషోర్ సింగ్ మాట్లాడుతూ.. ప్రతి కార్మికుడికి భద్రత, ఆరోగ్యంపై శిక్షణ తరగతులు నిర్వహించాలని, కంపెనీలో ఏదైనా ప్రమాదం జరిగినా లేదా సమస్య తలెత్తినా వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్మికుల హక్కులు, యాజమాన్య బాధ్యతలను వివరించారు.

# చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో శ్రీ వైష్ణవి విద్యార్థుల ప్రథమ స్థానం



ప్రజాభూమి పోరుమామిళ్ల :

కడప జిల్లా పోరుమామిళ్ల మండలంలో నిర్వహించిన చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో శ్రీ వైష్ణవి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్న ఈ ప్రతిభా పరీక్షలో శ్రీ వైష్ణవి పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటుకుని మొదటి స్థానంలో నిలవడం పట్ల పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంతో పాటు శాస్త్రీయ ఆలోచనా విధానం, విషయ పరిజ్ఞానం, సాధారణ అవగాహన, తార్కిక ఆలోచన, సమయస్ఫూర్తిని పెంపొందించేందుకు నిర్వహించే ఇటువంటి ప్రతిభా పరీక్షలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పాఠశాల యాజమాన్యం పేర్కొంది. చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో పాల్గొని, ప్రశ్నలకు చురుగ్గా సమాధానాలు అందిస్తూ తమ ప్రతిభను నిరూపించుకున్నారు. పోటీలో ప్రథమ స్థానం సాధించడం ద్వారా పాఠశాలకు మంచి పేరు తీసుకువచ్చారని పాఠశాల కరస్పాండెంట్ ఆర్.వి. రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఆర్.వి. రామకృష్ణ, ప్రిన్సిపల్ కళ్యాణితో పాటు ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని పోటీల్లో పాల్గొని ఉన్నత స్థాయిలో రాణించాలని వారు ఆకాంక్షించారు. విద్యార్థుల విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులను కూడా పాఠశాల యాజమాన్యం అభినందించింది. విద్యార్థుల విజయానికి తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం ఎంతో దోహదపడిందని పేర్కొన్నారు. శ్రీ వైష్ణవి ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో ప్రథమ స్థానం సాధించడం పట్ల పాఠశాలలో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. ఈ విజయం తమ విద్యార్థుల ప్రతిభకు నిదర్శనమని పాఠశాల యాజమాన్యం తెలిపింది.

# మానవత" సేవలు ప్రశంసనీయం

## - ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి



ప్రజాభూమి, పులివెందుల

పులివెందుల మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చేపడుతున్న కార్యక్రమాలు ప్రశంసనీయమని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (మెయిన్) ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులరెడ్డి అన్నారు.విద్యార్థులు - నైతిక విలువలుఅనే అంశంపై ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులరెడ్డి అధ్యక్ష తన శుక్రవారం పాఠశాలలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు సేవా కార్యక్రమాలతో మానవత సంస్థ ముందుకు సాగుతోందని కొనియాడారు.మానవత సంస్థ చైర్మన్ డి.వి. కొండారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు మానవీయ విలువలతో మంచి పౌరులుగా తయారు కావాలని, తల్లిదండ్రులు, గురువుల పట్ల గౌరవ భావం కలిగి ఉండాలని సూచించారు.సత్ప్రవర్తన గురించి విద్యార్థులకు వివరించారు.జిల్లా కార్యవర్గ సభ్యులు జి. చంద్రశేఖర్ రెడ్డి మానవత సంస్థ ఆవిర్భావం, ఆశయాలు, చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. కార్యదర్శి గురుప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు నైతిక విలువలతో మెలగి మంచి సమాజ నిర్మాణానికి దోహదపడాలన్నారు. కోశాధికారి హరిచంద్రారెడ్డి విద్యార్థులను విషయ పరిజ్ఞానంపై ప్రశ్నలు అడిగారు. "విద్యార్థులు - మానవీయ విలువలు" అంశంపై నిర్వహించిన పోటీ పరీక్షలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన ఎస్. అసిఫా, వి. చేతన్ కుమార్ రెడ్డి, ఎం. నిత్యశ్రీలకు మెమెంటోలు, ఫైళ్లను అందజేశారు.కార్యక్రమంలో సంస్థ కన్వీనర్ బి.వి. కృష్ణారెడ్డి, మాజీ కార్యదర్శి ఎం.వి. శేషయ్య, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జన విజ్ఞాన వేదిక టాలెంట్ టెస్ట్‌లో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ

## - ముగ్గురు విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

## - కరస్పాండెంట్ బి. చక్రపాణి రెడ్డి




ప్రజాభూమి, వేంపల్లె

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెకుముకి టాలెంట్ టెస్ట్--2026లో స్థానిక పట్టణంలోని శ్రీ చైతన్య హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని పాఠశాల కరస్పాండెంట్ బి. చక్రపాణి రెడ్డి తెలిపారు. 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు నిర్వహిస్తున్న ఈ పోటీల్లో భాగంగా సెప్టెంబర్ 11న మండల స్థాయిలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌కు పాఠశాల నుంచి ఆరుగురు విద్యార్థులు పాల్గొన్నారు. వీరులో బి. ధర్మతేజ, ఎం. ధనుష్, బి. గంగా ప్రియదర్శిని ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. జిల్లా స్థాయి పోటీ పరీక్షలు సెప్టెంబర్ 26న జిల్లా కేంద్రమైన కడపలో నిర్వహించనున్నారు. విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తిని పెంపొందించడంతో పాటు పోటీ పరీక్షల్లో రాణించడం అభినందనీయమని పేర్కొంటూ, జిల్లా స్థాయి పోటీల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కరస్పాండెంట్ బి. చక్రపాణి రెడ్డి ఆకాంక్షించారు.

# మట్టి వినాయకులతో పర్యావరణ పరిరక్షణ

## - మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ


## - ప్రిన్సిపాల్ డా. కె. ఉషశ్రీ




ప్రజాభూమి, వేంపల్లె

మట్టి వినాయకులను పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. ఉష శ్రీ తెలిపారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి, మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను స్థానికులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ ఉషశ్రీ మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల జల కాలుష్యం ఏర్పడుతుందని తెలిపారు. మట్టి వినాయకులను పూజించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలనే పూజించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మట్టి విగ్రహాలను ఉపయోగించడం ద్వారా వినాయక చవితి వేడుకలను పర్యావరణహితంగా నిర్వహించవచ్చని పేర్కొన్నారు. ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడమే కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు కుమార్ రాజా, జనార్ధన్, వైస్ ప్రిన్సిపాల్ షాజియా బేగం, పీడీ తేజేంద్ర, అధ్యాపకులు హరిత, రాజా రెడ్డి, వీరారెడ్డి, వినోద్, శ్రీను, అధ్యాపకబృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# పెన్షన్ల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలించిన కమిషనర్



ప్రజాభూమి, పులివెందుల

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద పులివెందుల పురపాలక సంఘం పరిధిలోని అన్ని స్వర్ణ వార్డు కార్యాలయాల్లో ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ కొనసాగుతోంది.ఇందులో భాగంగా గురువా రం పురపాలక సంఘ కమిషనర్ ఎం.ఎస్. తనూజ పలు సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసి, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పర్యవేక్షించారు.ఈ సందర్భంగా పెన్షన్ కోసం వచ్చిన లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలు, వినతులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్వర్ణ వార్డు సిబ్బందితో సమీక్ష నిర్వహించి, ఆన్‌లైన్ ప్రక్రియలో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలపై ఆరా తీశారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందేలా చూడాలని, నమోదు ప్రక్రియ పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని కమిషనర్ సిబ్బందిని ఆదేశించారు.

# చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో ఏవీఎస్ హైస్కూల్‌కు ప్రథమ బహుమతి



ప్రజాభూమి, ఒంటిమిట్ట: మండల స్థాయిలో నిర్వహించిన చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో కొత్త మాధవరం ఏ.వి.ఎస్.ఓడజి హైస్కూల్ విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించారు. ఈ పోటీల్లో మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఏ.వి.ఎస్.ఓడజి హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ పాఠశాల నుంచి 10వ తరగతి విద్యార్థిని మాచర్ల ప్రసన్న లక్ష్మి, 9వ తరగతి విద్యార్థిని బొడిచెర్ల శ్రీ వైష్ణవి, 8వ తరగతి విద్యార్థి షేక్ షాహీన భాను జిల్లా స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌కు ఎంపికయ్యారు. ఈ పోటీలు ఈ నెల 27న ఆదివారం నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థుల ప్రతిభను పాఠశాల ప్రధానోపాధ్యాయులు అవ్వారు వరప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు.

# కడప మేయర్ రేసులో జనసేన.. వేణుగోపాల్ రెడ్డి పేరు తెరపైకి

## -కూటమి సమీకరణాల్లో భాగంగా అభ్యర్థిత్వంపై ప్రచారం.. అధికారిక ప్రకటన కోసం ఎదురుచూపులు



ప్రజాభూమి, కడప: కడప నగర మేయర్ పదవిపై రాజకీయ వర్గాల్లో ఆసక్తికరమైన చర్చ కొనసాగుతోంది. కూటమి రాజకీయ సమీకరణాల్లో భాగంగా జనసేన తరఫున ఇందిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి పేరును మేయర్ అభ్యర్థిగా పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. కమలాపురం నియోజకవర్గ ఇంచార్జిగా పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న వేణుగోపాల్ రెడ్డి ప్రజలతో మమేకమై పనిచేస్తున్న నాయకుడిగా తనకంటూ గుర్తింపు పొందారని ఆయన అనుచరులు పేర్కొంటున్నారు. రాజకీయ నేపథ్యం, వివిధ వర్గాలతో పరిచయాలు, పార్టీ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర, కూటమి భాగస్వామ్య పార్టీలతో సమన్వయం వంటి అంశాలు ఆయనకు అనుకూలంగా ఉన్నాయని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కడప మేయర్ పదవి నగర రాజకీయాల్లో కీలకమైనదిగా భావిస్తున్న నేపథ్యంలో కూటమి తరఫున అభ్యర్థి ఎంపికపై ఆసక్తి నెలకొంది. వేణుగోపాల్ రెడ్డి పేరు ఖరారైతే కడప నగర రాజకీయాల్లో జనసేనకు ఇది కీలక పరిణామంగా మారే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే అధికారిక ప్రకటన వెలువడే వరకు ఆయన అభ్యర్థిత్వాన్ని ఖరారైన నిర్ణయంగా పరిగణించాల్సిన అవసరం లేదని రాజకీయ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

# శ్రీ చైతన్య హైస్కూల్‌లో ఘనంగా ముందస్తు వినాయక చవితి వేడుకలు- కరస్పాండెంట్ బి. చక్రపాణి రెడ్డి

## - పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన



ప్రజాభూమి, వేంపల్లె

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక పట్టణంలోని శ్రీ చైతన్య హైస్కూల్‌లో ముందస్తు వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల కరస్పాండెంట్ బి. చక్రపాణి రెడ్డి తెలిపారు. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన కల్పించడంతో పాటు మట్టి వినాయక విగ్రహాలను వినియోగించాలనే సందేశాన్ని అందించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని పాటలు, నృత్యాలు, స్కిట్లు, ప్రసంగాలతో ఆకట్టుకున్నారు. వినాయక చవితి ప్రాముఖ్యతతో పాటు పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను తమ ప్రదర్శనల ద్వారా చాటిచెప్పారు. అనంతరం కరస్పాండెంట్ బి. చక్రపాణి రెడ్డి మాట్లాడుతూ పండుగలను ఆనందంగా జరుపుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణ బాధ్యతను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని సూచించారు. మట్టి వినాయక విగ్రహాల వినియోగంతో నీటి కాలుష్యాన్ని తగ్గించవచ్చని తెలిపారు. విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే ప్రకృతి పట్ల బాధ్యత, పర్యావరణ స్పృహ పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం



ప్రజాభూమి పోరుమామిళ్ల :

జాతీయ అటవీ అమర వీరుల దినోత్సవం సందర్భంగా పోరుమామిళ్ళ రేంజ్ కార్యాలయంలో రేంజ్ అధికారి రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో అటవీ అమర వీరులకు నివాళులు అర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించడమైనది. రేంజ్ అధికారి మాట్లాడుతూ సిబ్బంది విధులు పట్ల జాగ్రత్తగా ఉండాలని, అడవిలోకి వెళ్ళేటప్పుడు తుపాకీ తీసుకెళ్లాలని అవసరమైనపుడు స్మగ్లర్లు అటాక్ చేసినపుడు ప్రాణ రక్షణ కోసం మొదట గాల్లోకి ఆ తర్వాత అధికారి అనుమతి తో కాళ్లకు కాల్పులు జరపాలని తెలిపారు. మోటార్ సైకిల్ పై వెళుతున్నపుడు హెల్మెట్ తప్పనిసరిగా వాడాలని మన పై మన కుటుంబం ఆధారపడి ఉందని గ్రహిస్తూ నిజాయితీతో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆఫీస్ సిబ్బంది శ్రీనివాసరావు, రాజేష్ ,సెక్షన్ అధికారులు,బీట్ అధికారులు మరియు డాగ్ స్క్వాడ్ హాసన్, గురయ్య ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

# పి. కొత్తపల్లి ఎస్సీ కాలనీలో పారిశుద్ధ్య నిర్లక్ష్యం.. దుర్వాసనతో ఇబ్బందులు



ప్రజాభూమి, సిద్ధవటం: మండలంలోని పి. కొత్తపల్లి ఎస్సీ కాలనీలో పారిశుద్ధ్యం పూర్తిగా అధ్వానంగా తయారైందని, నిల్వలు తొలగించకపోవడంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతోందని స్థానిక నివాసులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో చెత్తాచెదారం పేరుకుపోయి వారాలు గడుస్తున్నా పంచాయతీ సిబ్బంది పట్టించుకోవడం లేదని శుక్రవారం వారు తెలిపారు. దీంతో దోమలు వృద్ధి చెంది విష జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో పారిశుద్ధ్య మెరుగుదల చర్యలు చేపట్టి, రోగాల బారిన పడకుండా చూడాలని కోరారు. ఈ విషయమై పి. కొత్తపల్లి పంచాయతీ కార్యదర్శి లలితను వివరణ కోరగా.. ఎస్సీ కాలనీలో పేరుకుపోయిన చెత్త తొలగింపునకు త్వరలోనే చర్యలు చేపడతామని తెలిపారు.

# ప్రజాభూమి

తిరుపతి,చిత్తూరు 8

శనివారం 12 సెప్టెంబరు 2026


## ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ పనులు త్వరగా పూర్తి చేయాలి

### స్మార్ట్ సిటీ ఎం.డి., నగరపాలక సంస్థ కమిషనర్ ఎం. జయకృష్ణ.



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

తిరుపతి స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా మంజూరైన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐ.సి.సి.సి) పనుల పురోగతిపై నగరపాలక సంస్థ కార్యాలయంలో స్మార్ట్ సిటీ అధికారులు, కెల్ట్రాన్, ఎన్.ఈ.సి.,సంస్థ ప్రతినిధులతో శుక్రవారం నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జయకృష్ణ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఐ ట్రిపుల్ సి ద్వారా జరుగుతున్న పనులను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఎన్.ఈ.సి సంస్థ ప్రతినిధులు వివరించారు. స్మార్ట్ సిటీ నిధులతో నగరంలోని 20కూడళ్లు, 111 ప్రదేశాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కెమెరాలను ఇంటిగ్రెటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ కు అనుసంధానం చేస్తారని తెలిపారు. సిసి టివి సర్వైవ్ లెన్స్ ద్వారా నగరంలోని 111 ప్రాంతాల్లో సిసి టివి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. వీటి ద్వారా కాలువల్లో, రోడ్లపైన చెత్త వేసేవారిని, భవన నిర్మాణ వ్యర్థాలను వేసే వారిని గుర్తించి జరిమానాలు విధించడం జరుగుతుందని తెలిపారు. నగరంలోని 20 కూడళ్ళ వద్ద ఏర్పాటు-ూజూ (అడాప్టివ్ ట్రాఫిక్ కంట్రోల్ సిస్టమ్) చేస్తున్నారని, వీటి ద్వారా వాహనాల సమయానికి అనుగుణంగా సిగ్నల్ మారడంతో కూడళ్ళ వద్ద ట్రాఫిక్ తగ్గుతుందని తెలిపారు. అత్యవసర వాహనాలు అంబులెన్సు వంటివి త్వరగా వెళ్లేలా సమన్వయం చేసి, ప్రమాదాలను తగ్గించే వీలుంటుందని తెలిపారు. ఈ సమావేశంలో స్మార్ట్ సిటీ జి. ఎం. చంద్రమౌళి, ఈ.ఈ.రవి, వీ/o ఎన్.ఈ.సి. మరియు కెల్ట్రాన్ సంస్థ ప్రతినిధులు ననమినాజ్ మినే, అనురాగ్ సక్సేనా, సతీష్ కుమార్ , రితీష్ రాజన్, మమత, తదితురులు పాల్గొన్నారు.

## చంద్రన్న ప్రమాద బీమా కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటుంది : ఎమ్మెల్యే పులివర్తి నాని.!

ప్రజా భూమి ప్రతినిధి, చంద్రగిరి:




నియోజకవర్గ పరిధిలోని పాకాల మండలం, చెన్నుగారిపల్లి పంచాయతీకి చెందిన టిడిపి కార్యకర్త ప్రతాప్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ప్రతాప్ కి టిడిపి సభ్యత్వ నమోదు కలిగి ఉండడం వల్ల ఆ కుటుంబానికి చంద్రన్న ప్రమాద బీమా ఐదు లక్షల రూపాయలు వారి కుటుంబ సభ్యులకు అందింది. తిరుపతి రూరల్ మండలంలోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే పులివర్తి నాని ఐదు లక్షల రూపాయలు చెక్కును వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యకర్తకు పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని.. కార్యకర్తల సంక్షేమానికి టిడిపి పార్టీ ప్రాధాన్యమిస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. చంద్రన్న ప్రమాద బీమా చెక్కు అందుకున్న ప్రతాప్ కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కి, ఎమ్మెల్యే కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాకాల మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు ,అభిమానులు, ప్రతాప్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

### ఆహార వైవిధ్యం, తగినంత ప్రోటీన్‌పై అవగాహన..

### ఆరోగ్యకరమైన ప్లేట్‌పై లైవ్ డెమో



ప్రజా భూమి ప్రతినిధి గూడూరు,

9 వ జాతీయ పోషణ మాసోత్సవాల్లో భాగంగా గూడూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని గాంధీనగర్ అంగన్వాడీ కేంద్రంలో ఆహార వైవిధ్యం, తగినంత ప్రోటీన్, "నా ఆరోగ్యకరమైన ప్లేట్" అనే మూడు ముఖ్య అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లులకు ఆహార వైవిధ్యం ప్రాముఖ్యతను వివరిస్తూ, పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తగినంత ప్రోటీన్ అవసరమని అవగాహన కల్పించారు. పప్పులు, పెసలు, శనగలు, వేరుశనగ, సోయాబీన్, పాలు, పెరుగు, గుడ్లు, చేపలు తదితర ప్రోటీన్ అధికంగా ఉండే ఆహార పదార్థాలను రోజువారీ ఆహారంలో చేర్చుకోవాలని సూచించారు. అలాగే "నా ఆరోగ్యకరమైన ప్లేట్"పై లైవ్ డెమో నిర్వహించి, ఆరోగ్యకరమైన ప్లేట్‌లో వివిధ రకాల ఆహార పదార్థాలను సమతుల్యంగా ఎలా చేర్చుకోవాలో ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా వివరించారు. ధాన్యాలు, పప్పులు, కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, పాలు, పాల పదార్థాలు మరియు ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారాలను తగిన మోతాదులో తీసుకోవాల్సిన ప్రాధాన్యతను తెలియజేశారు. ఈ కార్యక్రమం సూపర్‌వైజర్ సుజనా ఆధ్వర్యంలో నిర్వహించబడింది. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు సుబ్బమ్మ, వాణి, మల్లేశ్వరి, ఏఎన్‌ఎం సుజిత్ కుమారి, ఆశా కార్యకర్త, ఏఎన్‌ఎం సునీత కుమారి మరియు ఇతర సహాయక సిబ్బంది పాల్గొన్నారు. పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు ప్రతిరోజూ వైవిధ్యభరితమైన, పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని ఈ సందర్భంగా తల్లులకు సూచించారు.

## చెకుముకి సైన్స్ పరీక్షల ప్రశ్నాపత్రం విడుదల చేసిన మున్సిపల్ కమీషనర్ మల్లికార్జున రావు

ప్రజా భూమి ప్రతినిధి గూడూరు,



నెల్లూరు జిల్లా గూడూరు స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నందు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ మండల స్థాయి ప్రశ్నపత్రాలను ముఖ్య అతిథి గూడూరు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున రావు ఆవిష్కరించారు. అనంతరం కమిషనర్ గారు మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక సమాజంలో ఉన్నటువంటి మూఢనమ్మకాలు పోగొట్టుటకు విద్యార్థి దశ నుంచే వారికి గత 36 సంవత్సరములుగా సైన్స్ పరీక్షలు నిర్వహిస్తూ వారి ద్వారా మంచి సమాజం కోసం పాటుపడుతున్న జె.వి.వి సభ్యులందరికీ కూడా ధన్యవాదాలు తెలియజేస్తున్నానని, అదేవిధంగా ఇంత మంచి కార్యక్రమానికి నన్ను ముఖ్యఅతిథిగా ఆహ్వానించినందుకు జే.వి.వి సభ్యులందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నాను అని చెప్పారు. విద్యార్థులు కూడా శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించి రానున్న రోజుల్లో మీరు కూడా సైంటిస్ట్ గా ఎదగాలని ఉన్నతమైనటువంటి హోదా కలిగిన ఉద్యోగాల్లో మీరందరూ స్థిరపడి మంచి సమాజాన్ని నిర్మించాలని కోరారు. అదేవిధంగా జనవిజ్ఞాన వేదిక సైన్స్ కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలు కూడా చేస్తున్నారని వారికి అందరం సహకరిస్తూ జే.వి.వి ఆశయాలను ముందుకు తీసుకుపోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలుర, బాలికల ప్రధానోపాధ్యాయులు భారతి గారు, మాధవి లత ,జె వి వి అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, నాగరాజు, చెంచు నారాయణ, రామ మోహన్, పురుషోత్తమరావు, సుబ్బారావు, డివిడి కుమార్, శ్రీనివాస్ ఆచారి ,అన్ని స్కూల్స్ ఉపాధ్యాయని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# చంద్రగిరి నియోజకవర్గం నుంచే టీడీపీ పతనం..!

- స్థానిక ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ సమరశంఖం • ఏకగ్రీవాలకు నో ఛాన్స్.. ప్రతి పంచాయతీలో బరిలోకి
- చంద్రబాబు సొంత గడ్డపై వైఎస్సార్‌సీపీ జెండా ఎగరాలి: మోహిత్‌రెడ్డి
- 2 వేల మందితో కిక్కిరిసిన విస్తృత స్థాయి సమావేశం







ప్రజా భూమి ప్రతినిధి, చంద్రగిరి:

చంద్రబాబు సొంత గడ్డ నుంచే టీడీపీకి షాక్ ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులు కదనానికి సిద్ధమయ్యాయి. స్థానిక సంస్థల ఎన్నికలను వేదికగా చేసుకుని చంద్రగిరిలో వైఎస్సార్‌సీపీ సత్తా చాటాలని పార్టీ నాయకత్వం పిలుపునిచ్చింది. ఎక్కడా ఏకగ్రీవాలకు అవకాశం ఇవ్వకుండా.. ప్రతి పంచాయతీలో బలమైన అభ్యర్థులను బరిలోకి దించి.. విజయమే లక్ష్యంగా పనిచేయాలనిలిలి దిశానిర్దేశం చేసింది. చంద్రగిరి నియోజకవర్గం నుంచే టీడీపీ పతనం ప్రారంభమయ్యేలా ఎన్నికల సమరానికి సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చింది. చంద్రగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశానికి భారీగా నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, మండల పార్టీ అధ్యక్షులు, జిల్లా, రాష్ట్ర స్థాయి నేతలు, అనుబంధ విభాగాల నాయకులు, మహిళా నేతలు, పంచాయతీ స్థాయి నాయకులు కలిపి సుమారు 2 వేల మంది హాజరుకావడంతో వైఎస్సార్‌ఎం ఆర్ కల్యాణ మండపం కిక్కిరిసిపోయింది. ముందుగా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మోహిత్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. స్థానిక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, అభ్యర్థుల ఎంపిక, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతంపై నేతలు దిశానిర్దేశం చేశారు.

**ఏకగ్రీవాలకు తావివ్వొద్దు**

స్థానిక సంస్థల ఎన్నికలను ఆషామాషీగా తీసుకోవద్దని మోహిత్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రతి పంచాయతీలో బలమైన అభ్యర్థులను నిలబెట్టి గెలిపించడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. వ్యక్తిగత ప్రయోజనాలు, వర్గ విభేదాలను పక్కనపెట్టి పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.జగనన్న ఇచ్చిన పిలుపు మేరకు ఎక్కడా ఏకగ్రీవాలకు అవకాశం ఇవ్వకుండా ప్రతి చోటా పోటీకి సిద్ధంగా ఉన్నామని నాయకులు, కార్యకర్తలు కూడా అందుకు సన్నద్ధం కావాలని కోరారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు పెద్ద సంఖ్యలో నాయకులు ముందుకు వస్తున్న నేపథ్యంలో అభ్యర్థుల ఎంపికపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు.

**చంద్రబాబు సొంత గడ్డపైనే టీడీపీ పతనం**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ పుట్టిన ఊరు నారావారిపల్లి ఉన్న చంద్రగిరి నియోజకవర్గం నుంచే టీడీపీ పతనం మొదలు కావాలని మోహిత్‌రెడ్డి అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో చంద్రగిరిలో అత్యధిక స్థానాలను వైఎస్సార్‌సీపీ గెలుచుకుని పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా సమర్పిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

**'చంద్రబాబు.. కరువు కవల పిల్లలు'**

చంద్రబాబు నాయుడు, కరువు కవల పిల్లలని భూమన కరుణాకర్‌రెడ్డి ఘాటుగా విమర్శించారు. చంద్రబాబు పాలన వస్తే కరువు విలయతాండవం చేస్తుందని ఆరోపించారు. ఆయన ముఖ్యమంత్రిగా పనిచేసిన కాలంలో ప్రజలు కరువు, కాటకాలతో అల్లాడిపోయారని విమర్శించారు. చంద్రబాబు సొంత గ్రామమైన నారావారిపల్లిలోనే రైతులు సాగు కోసం నీటి కష్టాలు ఎదుర్కొంటున్నారని, సమీపంలోని కల్యాణీ రిజర్వాయర్ కూడా ఎండిపోతోందని అన్నారు. తిరుమలలోనూ నీటి సమస్య తీవ్రంగా ఉందని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొందని విమర్శించారు.

**గుర్తింపు కార్డు.. కార్యకర్తకు ధైర్యం**

పార్టీలో వివిధ పదవులు పొందిన నాయకులకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతకం చేసిన గుర్తింపు కార్డులను భూమన కరుణాకర్‌రెడ్డి పంపిణీ చేశారు. ఆ కార్డు కేవలం గుర్తింపు కార్డు కాదని.. జేబులో పెట్టుకున్న ప్రతిసారీ 'జగనన్న తమతో ఉన్నాడనే ధైర్యం కలిగించే శక్తిగా పనిచేస్తుందన్నారు. నాయకులు, కార్యకర్తలకు ఎక్కడ అన్యాయం జరిగినా పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

**మెజారిటీ స్థానాల్లో విజయం పక్కా..**

2014 నుంచి 2024 వరకు చంద్రగిరి నియోజకవర్గంలో జరిగిన స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అత్యధిక స్థానాలు సాధించిందని పార్టీ రాష్ట్ర విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి అన్నారు. ఈసారి కూడా అదే స్థాయిలో విజయం సాధించేందుకు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అధికార పార్టీ నేతలు ఎలాంటి దౌర్జన్యాలకు పాల్పడినా భయపడకుండా ప్రజాస్వామ్యబద్ధంగా ఎదుర్కోవాలని సూచించారు. ప్రత్యర్థి యుద్ధానికి వచ్చినప్పుడు అంతర్గత విభేదాలను పక్కనపెట్టి అందరూ ఒక్కటై పోరాడాలని అన్నారు. కార్యకర్తలకు అండగా ఎంతవరకైనా పోరాడేందుకు చెవిరెడ్డి కుటుంబం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

**ప్రతి పంచాయతీకి కమిటీలు**

ప్రతి పంచాయతీలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నేతలతో కమిటీలు ఏర్పాటు చేయాలని మోహిత్‌రెడ్డి సూచించారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు తరచూ సమావేశాలు నిర్వహిస్తూ లోటుపాట్లను సరిదిద్దుకోవాలన్నారు. చంద్రబాబు పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ఎన్నికల హామీలు, అమలు కాని హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చంద్రగిరి నియోజకవర్గంలో తుడా ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను ప్రతి గడపకు వివరించాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసులు రెడ్డితో పాటు నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన ముఖ్యనేతలు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యా రంగంలో ఎం బి యు గ్లోబల్ మార్క్..!!

## తైవాన్ కౌశియుంగ్ మెడికల్ యూనివర్సిటీతో చారిత్రాత్మక ఒప్పందం!



ప్రజాభూమి ప్రతినిధి, చంద్రగిరి:

?మోహన్ బాబు విశ్వవిద్యాలయం అంతర్జాతీయ స్థాయి పరిశోధనలు, విద్యా సంబంధిత బంధాలను బలోపేతం చేసుకునే దిశగా మరో కీలక మైలురాయిని అధిరోహించింది. తైవాన్‌కు చెందిన ప్రముఖ 'కౌశియుంగ్ మెడికల్ యూనివర్సిటీ' ( కె ఎం యు ) తో ఎంబియు రిజిస్ట్రార్ సారథి ఒప్పందం ( ఎం ఓ యు) కుదుర్చుకున్నారు. ఈ భాగస్వామ్యం ద్వారా రెండు విశ్వవిద్యాలయాల మధ్య ఉమ్మడి పరిశోధనలు, ప్రత్యేక విద్యా ప్రోగ్రామ్‌లు, విద్యార్థులు, అధ్యాపకుల మార్పిడి విధానం అమల్లోకి రానున్నాయి. అంతేకాకుండా పరిశోధనా ఇంటర్న్‌షిప్‌లు, సైంటిఫిక్ పబ్లికేషన్స్, సంయుక్త సెమినార్లు, వర్క్‌షాప్‌ల నిర్వహణకు ఈ ఒప్పందం ఎంతగానో దోహదపడనుంది. ముఖ్యంగా బయోటెక్నాలజీ, బయోమెడికల్ సైన్సెస్, హెల్త్‌కేర్, ఫార్మాస్యూటికల్ సైన్సెస్ రంగ్‌లలో అంతర్జాతీయ స్థాయి పరిశోధనలకు ఈ అనుసంధానం ఒక వేదికగా మారనుంది. దీనివల్ల ఎం బి యు విద్యార్థులు, అధ్యాపకులకు తైవాన్‌లో విలువైన అంతర్జాతీయ అకాడమిక్ అనుభవం, సరికొత్త అవకాశాలు లభిస్తాయి. ఇటీవల ఎం బి యు ఎంతో ఘనంగా నిర్వహించిన 'ఐ సి ఏ టి ఎన్ -2026' అంతర్జాతీయ సదస్సు విశ్వవిద్యాలయ ప్రపంచస్థాయి గుర్తింపును మరింత పెంచగా, దేశ విదేశాల నుండి వచ్చిన శాస్త్రవేత్తలు, పరిశోధకులు, విద్యార్థుల మధ్య శాస్త్రీయ ఆలోచనల మార్పిడికి బాటలు పరిచింది. ఆ విజయవంతమైన సదస్సు ఇచ్చిన ఉత్సాహంతో తైవాన్ విశ్వవిద్యాలయంతో కుదుర్చుకుంటున్న ఈ అవగాహన ఒప్పందం, విద్యా నైపుణ్యం, పరిశోధనావిష్కరణలలో మోహన్ బాబు యూనివర్సిటీ ప్రయాణంలో మరో కీలక ఘట్టంగా నిలవనుంది.


## రెండవ శనివారం జాతీయ లోక్ అదాలత్

ప్రజా భూమి ప్రతినిధి శ్రీ కాళహస్తి టౌన్



శ్రీకాళహస్తి కోర్టు ఆవరణంలో ఈ నెల 12వ తేదీన అనగా రెండవ శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించినట్టు చైర్మన్ మరియు 12వ అదనపు జిల్లా జడ్జి కృష్ణన్ కుట్టి తెలియజేశారు. రేపు జరుగు జాతీయ లోక్ అదాలత్ లో పోలీసు అధికారులకు ఎక్కువ మొత్తంలో కేసులు అయ్యే విధంగా చూడాలని సూచించారు, క్రిమినల్ కేసులు మ్యాట్రి మోనియల్ కేసులు, పెట్టి కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, కుటుంబ తగాదాలు కేసులు తదితర కేసులను కక్షిదారులను పిలిపించి ఈ జాతీయ లోక్ అదాలత్ పరిష్కరించుకోవచ్చని తెలియజేయమన్నారు. ఈ అవకాశము పట్టణ ప్రజలు, న్యాయవాదులు, బిఎస్ఎన్ఎల్, పోలీస్ శాఖ,బ్యాంకు.. మొదలైన వాళ్ళు ఉపయోగించుకోవాలని తెలిపారు

## గూడూరులో మూతపడ్డ ప్రభుత్వ రంగ బ్యాంకులు




ప్రజా భూమి ప్రతినిధి గూడూరు,

బ్యాంకు ఉద్యోగులకు ఐదు రోజుల పని దినాలు కల్పించాలని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా జరుగుతున్న స్ట్రైక్ లో భాగంగా గూడూరు పట్టణంలో ప్రభుత్వ రంగ బ్యాంకులో మూతపడ్డాయి . గూడూరు పట్టణంలో దేశవ్యాప్తంగా జరుగుతున్న స్ట్రైక్ లో భాగంగా ప్రభుత్వ రంగ బ్యాంకులో మూతపడ్డాయి స్టేట్ బ్యాంకు ప్రధాన కార్యాలయం వద్ద ఉద్యోగులు నిరసన కార్యక్రమం నిర్వహించారు తమ డిమాండ్ల నెరవేర్చాలని ప్లే కార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు జోనల్ సెక్రటరీ దాసరి రామచంద్రయ్య మోకాళ్ళపై నడిచి వినూత్నంగా నిరసన తెలిపారు అనంతరం టవర్ క్లాక్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు తిరుపతి మాడ్యూల్ అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ విరూపాక్ష రాజు మాట్లాడుతూ బ్యాంకు ఉద్యోగులకు ఐదు రోజుల పని దినాలు కల్పించాలని అనేక నెలలుగా ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారని కొద్ది రోజుల క్రిందట ఐదు రోజుల పని దినాలు అమలు చేస్తామని హామీ ఇచ్చి ఇంతవరకు చేయలేదని ఇప్పుడు ఐదు రోజుల పని దినాలు కుదరదని చెబుతున్నారని అన్నారు విపరీతమైన పని ఒత్తిడిలో ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని దసలవారీగా ఆందోళన ఉధృతం చేస్తామని అవసరమైతే నిరవధిక సమ్మెకు కూడా వెనకాడమని ఉద్యోగుల డిమాండ్లు వెంటనే పరిష్కరించాలని కోరారు ఈ కార్యక్రమంలో ఆఫీసర్స్ జోనల్ సెక్రటరీ దాసరి రామచంద్రయ్య, గూడూరు జోనల్ సెక్రటరీ ఎన్ శ్రావణ్ ,పీవీ కృష్ణయ్య,ప్రత్యూష, శ్రీకాంత్, కిరణ్ ,భాస్కర్ రెడ్డి ,వెంకటేశ్వర్లు, సుకుమార్, నందనాగార్జున ,కృష్ణ ప్రసాద్, పణి, భువనేశ్వర్,తదితరులు పాల్గొన్నారు.




## జాతీయ అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహణ



ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్

జాతీయ అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీకాళహస్తి రేంజ్ పరిధిలో అటవీ శాఖ ఆధ్వర్యంలో అమరవీరులకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ (ఎఫ్ ఆర్ వో ) పి. లోకేష్ మరియు అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎఫ్ ఆర్ వో పి. లోకేష్ మాట్లాడుతూ, అడవులు, వన్యప్రాణులు మరియు ప్రకృతి సంపద పరిరక్షణ కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధి నిర్వహణలో అమరులైన అటవీ శాఖ అధికారులు మరియు సిబ్బంది త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు. అటవీ సంరక్షణ కోసం వారు చూపిన ధైర్యం, అంకితభావం, సేవా స్ఫూర్తి నేటి అటవీ సిబ్బందికి ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని తెలిపారు. అటవీ సంపదను అక్రమ ఆక్రమణలు, స్మగ్లింగ్, వన్యప్రాణుల వేట తదితర అక్రమ కార్యకలాపాల నుంచి కాపాడటంతో పాటు, అడవుల అభివృద్ధి మరియు పరిరక్షణకు అటవీ శాఖ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని అటవీ సంరక్షణలో మరింత అంకితభావంతో విధులు నిర్వహిస్తామని పేర్కొన్నారు.అనంతరం అటవీ అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది పాల్గొని అమరవీరుల సేవలను స్మరించుకున్నారు. "అడవుల రక్షణ కోసం ప్రాణాలర్పించిన అటవీ అమరవీరుల త్యాగం -- తరతరాలకు స్ఫూర్తిదాయకం."

## 1008 కేజీల కుంకుమతో శ్రీ రాజరాజేశ్వరి కి అభిషేకం



ప్రజా భూమి ప్రతినిధి గూడూరు,

గూడూరు పట్టణంలోని జడ్పీ హైస్కూల్ రోడ్డు లో ఉన్న శ్రీ రాజరాజేశ్వరి వారి దేవస్థానంలో శ్రావణ శుక్రవారం అమావాస్య సందర్భంగా అమ్మవారికి 1008 కేజీల కుంకుమతో అభిషేకం ఘనంగా నిర్వహించారు.శ్రావణమాసం శుక్రవారం అమావాస్య సందర్భంగా గూడూరు పట్టణంలోని శ్రీ రాజరాజేశ్వరి వారి దేవస్థానంలో అమ్మవారికి 1008 కేజీల కుంకుమతో అభిషేకం వైభవంగా నిర్వహించారు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు భక్తులు భారీగా హాజరై అమ్మవారి అభిషేకాన్ని తిలకించి అన్నప్రసాదాలు స్వీకరించారు ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానం పాలకమండలి చైర్మన్ శ్రీ కంతి రామ్మోహన్ రావు మరియు పలువురు ప్రముఖులు కుటుంబ సభ్యులతో అమ్మవారిని దర్శించుకున్నారు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వ్యవస్థాన కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ప్రజాభూమి

తిరుపతి,చిత్తూరు 9

శనివారం 12 సెప్టెంబరు 2026

# ప్రజలకు, సమాజానికి సేవ చేయడంలో మీడియా పాత్ర కీలకం

- ఏపీ ఎమ్ ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు పర్చూరు బాలకృష్ణ గౌడ్
- పాత్రికేయ కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన ఏపీఎంఎఫ్ నూతన కమిటీ

ప్రజా భూమి ప్రతినిధి గూడూరు, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేర్చడం, సమాజంలో జరుగుతున్న అవినీతి అక్రమాలను వెలికి తీయడంలో మీడియా పాత్ర కీలకమని ఆంధ్ర ప్రదేశ్ మీడియా ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షులు పర్చూరు బాలకృష్ణ గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం గూడూరు పట్టణంలోని విశ్రాంతి ప్రభుత్వం ఉద్యోగుల భవనంలో ఏపీఎంఎఫ్ గూడూరు డివిజన్ నూతన కమిటీ ప్రమాణస్వీకారాన్ని జిల్లా ఉపాధ్యక్షులు బాలకృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముందుగా గూడూరు పట్టణంలో విలేకరిగా పనిచేస్తూ మృతి చెందిన ఎస్.కె కాలేశా కుటుంబానికి గూడూరు డివిజన్ ఏపీఎంఎఫ్ నూతన కమిటీ ఆధ్వర్యంలో 5000 రూపాయలు ఆర్థిక సాయం అందించారు. నూతన కమిటీ గౌరవాధ్యక్షులుగా జయకర్ బాబు, మంగళ పూరి శ్రీనివాసులు, కృపానిధి, గౌరవ సలహాదారులుగా శ్రీపతి రమేష్ పర్చూరు బాలకృష్ణ గౌడ్ మల్లవరపు మనోహర్ రెడ్డి,అధ్యక్షులుగా ఆత్మకూరు సురేష్ ప్రధాన కార్యదర్శిగా చింతపట్ల అనిల్ కుమార్, కోశాధికారిగా బట్ట అనిల్ కుమార్, వాటంబేడు విజయ్ కుమార్, ఉపాధ్యక్షులుగా ఎస్కే ఇమ్రాన్, వినయ్ మట్టికుంట సురేంద్రబాబు, పాకం చెన్నకేశవులు, కార్యదర్శులుగా పైడాల శంకర్, కట్టా జనార్ధన్, సంయుక్త కార్యదర్శులుగా మల్లవరపు కోటేశ్వరరావు దానం నరసింహులు చెన్నూరు మస్తానయ్య పీ మునిరాజా కార్యవర్గ సభ్యులుగా బట్టి జనార్ధన్ దాసరి వెంకటేష్ ఎంబేటి కార్తీక్,కస్తూరయ్య, వై రమణయ్య పి సాయికుమార్ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన వారిచేత జిల్లా ఉపాధ్యక్షులు బాలకృష్ణ గౌడ్ ప్రమాణ స్వీకారం చేయించారు అనంతరం జిల్లా ఉపాధ్యక్షులు మాట్లాడుతూ గూడూరు డివిజన్‌కు నూతన కమిటీని ఏర్పాటు చేసుకుని, వారి ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు. పాత్రికేయ వృత్తి కేవలం ఒక ఉద్యోగం కాదు. ప్రజలకు, సమా జానికి బాధ్యతతో కూడిన సేవ చేయడం,. ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడం అదేవిధంగా ప్రభుత్వ పథకాలను ప్రజలకు తెలియజేయడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అదే సమయంలో పాత్రికేయుల సమస్యలు, వృత్తిపరమైన ఇబ్బందులు, సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం కూడా మనం ఐక్యంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. గూడూరు డివిజన్ నూతన కమిటీ పాత్రికేయులందరినీ కలుపుకొని, ఎవరి పక్షానో కాకుండా నిజం, న్యాయం, ప్రజా ప్రయోజనం అనే సూత్రాలతో ముందుకు సాగాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ గూడూరు డివిజన్‌ను మరింత బలోపేతం చేయడానికి ఏపీఎంఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఢిల్లీ బాబు రెడ్డి,జిల్లా యూనియన్ తమ వంతుగా కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. ఈ రోజు బాధ్యతలు స్వీకరించిన నూతన కమిటీ సభ్యులు పదవులను కేవలం హోదాలుగా కాకుండా బాధ్యతలుగా వ్యవహరించాలన్నారు.





## బాలసుబ్రమణ్యంకి అక్షర జూనియర్ కళాశాల లో సన్మానం



ప్రజా భూమి ప్రతినిధి తొట్టంబేడు: మండలంలో దిగువ సాంబయ్య పాళెం ఫౌండేషన్ స్కూల్ ఉపాధ్యాయులు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కయ్యూరు బాలసుబ్రమణ్యం ను నాగాలాపురం అక్షర జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే సందర్భంగా ముఖ్య అతిథిగా ఆహ్వా నించారు.తన మిమిక్రీ తో వివిధ రకాల శబ్దాలు, సినీతారల గొంతులను అనుకరిస్తూ విద్యార్థులను ఆహ్లాదపరిచారు. అనంతరం బాలునకు ఘనంగా సత్కరించారు .ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ మరియు ప్రిన్స్ పాల్ ప్రేమ్ కుమార్, ఆర్. ఐ. ఓ. గోపాల్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ లెక్చర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక కార్యక్రమానికి తరలిన జనసేన పార్టీ నాయకులు



ప్రజా భూమి ప్రతినిధి గూడూరు,
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో తిరుపతి ఉదయ్ ఇంటర్నేషనల్ హోటల్ నందు జనసేన పార్టీ ఉంగుటూరు నియోజకవర్గ మీూా మరియు స్థానిక సంస్థల ఎన్నికల తిరుపతి పార్లమెంట్ సమన్వయకర్త శ్రీ పత్సమట్ల ధర్మరాజు గారి ఆధ్వర్యంలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల సనహక కార్యక్రమంలో పాల్గొనడానికి గూడూరు నియోగవర్గ జనసేన నాయకులు శుక్రవారం నాడు భారీగా బయలు దేరి వెళ్లడం జరిగింది..ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కొణిదల ముని గిరీష్ గారు, పేటెటీ చంద్రనీల్ గారు,పెదిశెట్టి ఇంద్రవర్ధన్ కుమార్ గారు మరియు స్థానిక సంస్థల ఎన్నికల గూడూరు నియోజకవర్గ కమిటీ సభ్యుడు సయ్యద్ నయీం గారు మాట్లడుతూ త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలో కూటమి అభ్యర్థుల విజయనికి కృషి చేస్తూ అలాగే జనసేనకు కేటాయించిన స్థానంలో 100% స్ట్రైక్ రేట్ సాధించడమే లక్ష్యంగా అందరూ కలసి కట్టుగా పనిచేస్తామని తెలియ చేశారు...

# జర్నలిస్టుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి

### -గూడూరు ఎమ్మెల్యే డా. పాశిం సునీల్ కుమార్







ప్రజా భూమి ప్రతినిధి గూడూరు,
జర్నలిస్టుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుందని గూడూరు ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.పాశిం సునీల్ కుమార్ అన్నారు. శుక్రవారం గూడూరు పట్టణంలోని విశ్రాంతి ప్రభుత్వ ఉద్యోగుల భవనంలో ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్ (ఏపీఎంఎఫ్) గూడూరు డివిజన్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం జిల్లా ఉపాధ్యక్షులు పర్చూరు బాలకృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ, మీడియా ప్రతినిధులు పూర్తి సమాచారం తెలుసుకుని, ఆధారాలతో వార్తలు రాయాలని సూచించారు. రాజకీయ నాయకులు, మీడియా ప్రతినిధుల మధ్య పరస్పర సహృద్భావం ఉండాలని అన్నారు. నూతన కమిటీ సభ్యులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. జర్నలిస్టులకు, వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య పరంగా లేదా ఇతర ఏ విధమైన సహాయం అవసరమైనా తనను నేరుగా సంప్రదిస్తే తన వంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రభుత్వం ద్వారా జర్నలిస్టులకు అందాల్సిన సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానన్నారు. గతంలో గూడూరు పట్టణ విలేకరులకు కేటాయించిన ఇంటి స్థలాలకు మున్సిపల్ కమిషనర్ ద్వారా ఇంటి పన్నులు విధించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జర్నలిస్ట్ కాలనీకి అవసరమైన మౌలిక సదుపాయాల ఏర్పాటుకు కూడా సహకరిస్తానన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు ఆత్మకూరు సురేష్ బాబు, ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్‌తో పాటు కమిటీ సభ్యులను ఎమ్మెల్యే శాలువాలతో సత్కరించారు. ఎమ్మెల్యే సునీల్ కుమార్‌తో పాటు టీడీపీ నాయకులను ఏపీఎంఎఫ్ నూతన కమిటీ ఘనంగా సన్మానించింది. ఏపీఎంఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు పర్చూరు బాలకృష్ణ గౌడ్ మాట్లాడుతూ, నూతన కమిటీ సభ్యులు వ్యక్తిగత ప్రయోజనాలకు కాకుండా జర్నలిస్టులందరి సమస్యల పరిష్కారానికి ముందుండి పనిచేయాలని సూచించారు. అధికారులు, ప్రజలకు మధ్య సంధానకర్తలుగా వ్యవహరిస్తూ వాస్తవాలను ప్రతిబింబించేలా వార్తలు రాయాలని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా మీడియా ద్వారా అవగాహన కల్పించాలని, చిన్నా--పెద్ద పత్రికలనే తేడా లేకుండా ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు జర్నలిస్టులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఎఫ్ గూడూరు డివిజన్ నూతన కమిటీ గౌరవాధ్యక్షులు జయకర్ బాబు, మంగళ పూరి శ్రీనివాసులు, టీడీపీ రాష్ట్ర నాయకులు శీలం కిరణ్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి బిల్లు చెంచురామయ్య, తిరుపతి పార్లమెంట్ జిల్లా అధికార ప్రతినిధి అబ్దుల్ రహీం, గూడూరు పట్టణ అధ్యక్షులు పులిమి శ్రీనివాసులు, ఏఎంసీ డైరెక్టర్ వేమల సునీల్, సీనియర్ నాయకులు వైయస్సార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజా దర్బార్ లక్ష్యం ఎమ్మెల్యే సునీల్ కుమార్



ప్రజా భూమి ప్రతినిధి గూడూరు,
ప్రజా దర్బార్ ద్వారా ప్రజల సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని అర్హులై ఉండి పెన్షన్లు లేని వారు సచివాలయాల్లో పెన్షన్ల కొరకు పేర్లు నమోదు చేసుకోవాలని సర్వర్ సక్రమంగా పనిచేయడం లేదని ప్రజల నుండి ఫిర్యాదులు వచ్చాయని దీని గురించి ప్రభుత్వానికి తెలియజేస్తామని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ వెల్లడించారు . గూడూరు పట్టణంలోని కార్యాలయంలో ఎమ్మెల్యే సునీల్ కుమార్ ప్రత్యేకంగా మహిళా ప్రజాదర్బార్ నిర్వహించారు టిడిపి నాయకులు ఎమ్మెల్యే సునీల్ కుమార్ ను ఘనంగా సన్మానించారు అనంతరం పలు గ్రామాల మహిళలు తమ సమస్యలను ఎమ్మెల్యేకి తెలియజేస్తూ అర్జీలు సమర్పించారు కొన్ని సమస్యలను అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరించారు ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ ప్రత్యేకంగా మహిళా గ్రీవెన్స్ నిర్వహించామని స్పందన బాగుందని రోడ్లు కాలువలు పలు సమస్యలు మహిళలు తెలియజేశారని వాటిఅన్నిటిని పరిష్కరిస్తామని తెలిపారు కోట ఎస్సీ హాస్టల్ మూసివేయడంతో విద్యార్థులను చిల్లకూరు నాయుడుపేట గురుకుల పాఠశాల పంపించారని వసతులు సక్రమంగా లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తల్లిదండ్రులు తెలియజేశారని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కి సమస్యను తెలియజేస్తామని అన్నారు ఒంటరి మహిళ పెన్షన్ కొరకు 50 సంవత్సరాల దాటిన వారికి అని ప్రభుత్వం నిబంధన విధించిందని అయితే చాలామంది 50 సంవత్సరాలు లోపే ఒంటరి మహిళలు ఉన్నారని ఈ సమస్య గురించి ముఖ్యమంత్రితో చర్చిస్తామని పేర్కొన్నారు ఈ సమావేశంలో ఆర్డీవో అరుణకుమారి ,పలు శాఖల అధికారులు టిడిపి నాయకులు మట్టం శ్రావణి, లీలావతి ,భారతి, శ్రీదేవి ,కల్పన, సుబ్బమ్మ పాల్గొన్నారు.

# ప్రకృతిని పరిరక్షించుకోవడం మనందరి బాధ్యత-కమిషనర్ ఎం.జయకృష్ణ పిలుపు

### నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 'మట్టి గణపతి' పోటీలు.





ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి
భవిష్యత్ తరాల మనుగడ కోసం ప్రకృతిని పరిరక్షించుకోవడం మనందరి బాధ్యత అని, చిన్నతనం నుండే పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన కలిగి ఉండాలని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జయకృష్ణ పిలుపునిచ్చారు. పర్యావరణాన్ని కాపాడుకుంటూ, ప్రకృతి సిద్ధమైన రీతిలో వినాయక చవితి పండుగను జరుపుకోవాలనే గొప్ప ఆశయంతో తిరుపతి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఎస్.పి.జె.ఎన్.ఎం. హైస్కూల్, ఎం.జి.ఎం. హైస్కూల్ నందు సుమారు 500 మంది విద్యార్థులతో 'మట్టి వినాయకుల తయారీ, వ్యాసరచన పోటీలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ పోటీలను పరిశీలించిన కమిషనర్ విద్యార్థుల సృజనాత్మకత చూసి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రకృతి మనకు దేవుడు ఇచ్చిన వరం అని తెలిపారు. భవిష్యత్ తరాల మనుగడకోసం ప్రకృతిని కాపాడుకోవడం మనందరి బాధ్యత అన్నారు. పార్వతీ దేవి సహజసిద్ధమైన నలుగుపిండితో వినాయకుడ్ని చేసిందని తెలిపారు. రసాయన రంగులు, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను విడిచిపెట్టి, పర్యావరణానికి మేలు చేసే మట్టి గణపతిలని పూజించాలని తెలిపారు. సహజ సిద్ధమైన మట్టి వినాయకులను పూజించడం వల్ల జల వనరులు కలుషితం కాకుండా, పర్యావరణాన్ని కాపాడుకోవచ్చునని తెలిపారు. చిన్నతనం నుంచే పిల్లలలో పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహనా పెంపొందిస్తే, సమాజంలో గొప్ప మార్పు వస్తుందని తెలిపారు. వినాయక చవితి ఉత్సవాల్లో తిరుపతి నగరవాసులంతా మట్టి వినాయకులనే ప్రతిష్టించి, పూజించి, తిరుపతిని పర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దడంలో భాగస్వాములు కావాలని కోరారు. విద్యార్థులు మట్టిలో విత్తనాలను కలిపి తయారు చేసిన సీడ్ గణపతి ని నిమజ్జనం చేస్తే ఇంటి పెరట్లోనే పూల, పండ్ల మొక్కలు వస్తాయని ఇవి పర్యావరణ సమతుల్యతకు దోహద పడుతాయని తెలిపారు. మీరు చేసిన విగ్రహాలు నిజమైన భక్తికి చిహ్నమని, ఈ విగ్రహాలు మీలో అజ్ఞానం తొలగించి చదువుల్లో మీరు పైకి వచ్చేలా మీకు దేవుడి ఆశీస్సులు ఉంటాయని తెలిపారు. అలాగే నగరంలో ఎక్కడ పడితే అక్కడ వేయకుండా చిన్నతనం నుండే పరిసరాల పరిశుభ్రతను అలవాటు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. పోటీల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూముల ఆక్రమణలు, అక్రమ ఇళ్ల పట్టాలపై సమగ్ర విచారణ జరపాలి

**టిట్కో సమస్యలను తక్షణమే పరిష్కరించాలి -- పోలీస్ ఔట్‌పోస్ట్ ఏర్పాటు చేయాలి**
**ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్‌కు జనసేన పార్టీ వినతి**



ప్రజా భూమి ప్రతినిధి గూడూరు,
గూడూరు నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలపై గూడూరు జనసేన పార్టీ తరఫున జనసేన లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి తీగల చంద్రశేఖర రావు, శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో జరిగిన ప్రజాదర్బార్‌లో గూడూరు నియోజకవర్గ శాసనసభ్యులు పాశం సునీల్ కుమార్ కి వినతి పత్రం సమర్పించారు. ప్రధానంగా గూడూరు పరిధిలోని ఇందిరమ్మ కాలనీ ప్రాంతంలో సర్వే నంబర్లు 2035, 2038, 2039కు సంబంధించిన ప్రభుత్వ భూములు, పేదలు మరియు కళాకారులకు కేటాయించిన ఇళ్ల స్థలాల విషయంలో స్థానికంగా వచ్చిన ఫిర్యాదులను సమగ్రంగా పరిశీలించాలని కోరారు. కళాకారులకు కేటాయించిన ఇళ్ల స్థలాలు ప్రస్తుతం ఎవరి ఆధీనంలో ఉన్నాయి, కేటాయింపు నిబంధనలకు విరుద్ధంగా ఏవైనా బదలాయింపులు లేదా విక్రయాలు జరిగాయా, ప్రభుత్వ మరియు పేదలకు కేటాయించిన భూముల్లో ఆక్రమణలు జరిగాయా అనే అంశాలను రెవెన్యూ రికార్డులు మరియు క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా నిర్ధారించి అర్హులైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరారు.అలాగే గూడూరు టిట్కో ఇళ్లలో నివసిస్తున్న ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం మరియు పాముల బెడద సమస్యలను కూడా ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు.

**టిట్కో ప్రాంతంలో పోలీస్ ఔట్‌పోస్ట్ ఏర్పాటు చేయాలి**

తిట్కో ప్రాంతంలో ఖాళీగా ఉన్న ఇళ్లను కొంతమంది అపరచిత వ్యక్తులు ఉపయోగిస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో, ప్రజల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. మహిళలు, చిన్నపిల్లలు, వృద్ధులు మరియు కుటుంబాల భద్రతను దృష్టిలో ఉంచుకుని టిట్కో ప్రాంతంలో పోలీస్ ఔట్‌పోస్ట్ ఏర్పాటు చేయాలని, పగలు రాత్రి పోలీస్ గస్తీని పెంచాలని జనసేన పార్టీ విజ్ఞప్తి చేసింది.

**వెంటనే స్పందించిన ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్**

జనసేన పార్టీ సమర్పించిన వినతి పత్రంలోని సమస్యలపై ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ తక్షణమే స్పంధిచి టిట్కో ప్రాంతంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని అక్కడికక్కడే మున్సిపల్ కమిషనర్ తో మాట్లాడి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా మున్సిపల్ కమిషనర్‌తో పాటు రూరల్ ా× గారితో కూడా వెంటనే మాట్లాడి సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుకు నవీన్ కుమార్, సుభాన్, సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వాకాడులో పుచ్చలపల్లి రామయ్య ఆకస్మిక మృతి

### గుండెపోటుతో కన్నుమూత.. కుటుంబానికి టీడీపీ, వైసీపీ నాయకుల ఆర్థిక చేయూత



ప్రజాభూమి ప్రతినిధి, వాకాడు
వాకాడు గ్రామ హరిజనవాడకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త, నేదురుమల్లి వర్గానికి ప్రధాన అనుచరుడిగా గుర్తింపు పొందిన వాకాడు మాజీ వార్డు మెంబర్ పుచ్చలపల్లి రామయ్య గురువారం రాత్రి గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. రాత్రి సుమారు 10 గంటల సమయంలో తన స్వగృహంలోనే గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.ఆయన మృతితో వాకాడు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.రామయ్య గతంలో వాకాడు వార్డు మెంబర్‌గా పనిచేయడంతో పాటు వైఎస్సార్‌సీపీ కార్యకర్తగా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు.రాజకీయాలకు అతీతంగా గ్రామంలోని ప్రతి ఒక్కరితో సన్నిహితంగా మెలిగే వ్యక్తిగా ఆయనకు మంచి గుర్తింపు ఉంది. గ్రామంలో జరిగే వివాహాలు, పెళ్లిచూపులు తదితర శుభ కార్యాల్లో ముందుండి తనవంతు సహకారం అందించేవారని గ్రామస్తులు గుర్తుచేసుకున్నారు.చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా అందరికీ అందుబాటులో ఉండే వ్యక్తిగా రామయ్య పేరు సంపాదించుకున్నారు.

**వైఎస్సార్‌సీపీ నాయకులు పాపారెడ్డి రాజశేఖర్ రెడ్డి నివాళులు**

రామయ్య ఆకస్మిక మృతి విషయం తెలిసిన వెంటనే రామయ్య ఇంటికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం తనవంతు సహాయంగా రూ.5,000 ఆర్థిక సాయం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామయ్య కుటుం బానికి అన్ని విధాల వైఎస్ఆర్సిపి నాయకులు అండగా ఉంటారని తెలియజేశారు.ఆయన వెంట గూడూరు సుధాకర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు,గ్రామస్తులు, కార్యకర్తలు ఉన్నారు.

**టీడీపీ నాయకుడు సన్నారెడ్డి విజయశేఖర్ రెడ్డి పరామర్శ**



రామయ్య ఆకస్మిక మృతి విషయం తెలుసుకున్న టీడీపీ సీనియర్ నాయకులు సన్నారెడ్డి విజయశేఖర్ రెడ్డి ఆయన నివాసానికి చేరుకుని భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. రామయ్య మృతి ఆ కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు. అంత్యక్రియల నిమిత్తం తనవంతు సహాయంగా రూ.5,000 ఆర్థిక సాయం అందజేశారు.ఈ కష్టకాలంలో రామయ్య కుటుంబానికి అండగా ఉంటామని, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని సన్నారెడ్డి విజయశేఖర్ రెడ్డి కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.

## వాకాడులో ఎంటీపీసీ ఓటర్ల జాబితా ప్రచురణ

### మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల్లో అందుబాటులోకి.. అధికారులు పరిశీలన



ప్రజాభూమి ప్రతినిధి, వాకాడు
వాకాడు మండలంలో ఎంటీపీసీ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితాను మండల పరిషత్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాల్లో అధికారికంగా ప్రచురించారు. ఓటర్ల జాబితా ప్రజలకు అందుబాటులో ఉంచడంతో సంబంధిత గ్రామాల ఓటర్లు తమ పేర్లు, వివరాలను పరిశీలించుకునే అవకాశం కల్పించారు.ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు ఓటర్ల జాబితాను పరిశీలించి, ఎన్నికల ప్రక్రియలో భాగంగా చేపట్టాల్సిన చర్యలపై దృష్టి సారించారు.ఓటర్ల జాబితాలో తమ పేరు,వివరాలు సక్రమంగా ఉన్నాయోలేదో ఓటర్లు పరిశీలించుకోవాలని అధికారులు సూచించారు.కార్యక్రమంలో ఎంపీడీవో సాయిప్రసాద్, పరిపాలన అధికారి శ్రీనివాసులు, తహసీల్దార్ సయ్యద్ ఇక్బాల్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అఖిల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఎన్నికల ప్రక్రియలో ఓటర్ల జాబితా అత్యంత కీలకమని, అర్హత కలిగిన ప్రతి ఓటరు తమ వివరాలను పరిశీలించుకుని ఏవైనా అభ్యంతరాలు లేదా తప్పులు ఉంటే నిర్ణీత ప్రక్రియ ప్రకారం అధికారుల దృష్టికి తీసుకురావాలని అధికారులు సూచించారు. దీంతో వాకాడు మండలంలో ఎంటీపీసీ ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన కార్యక్రమాలు మరింత వేగం పుంజుకున్నాయి.

# రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం - నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఎస్ఐ హరిప్రసాద్

### జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు ఆదేశాలతో ట్రాక్టర్ల పై ప్రత్యేక తనిఖీలు -- డ్రైవర్లకు అవగాహన





ప్రజా భూమి ప్రతినిధి బుచ్చినాయుడు కండ్రిగ తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు ఆదేశాల మేరకు బి.ఎన్. కండ్రిగ మండలంలో రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి సారించిన పోలీసులు ట్రాక్టర్ల తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భం గా బి.ఎన్. కండ్రిగ ఎస్ఐ హరిప్రసాద్ ఆధ్వర్యం లో మండల పరిధిలో ప్రయాణిస్తున్న ట్రాక్టర్లను తనిఖీ చేసి డ్రైవర్లకు రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన కల్పించారు.తనిఖీల్లో భాగంగా ట్రాక్టర్ల రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికేట్, డ్రైవింగ్ లైసెన్సులను పరిశీలించారు. రాత్రి సమ యంలో ట్రాక్టర్లు స్పష్టంగా కనిపించేలా రేడియం స్టిక్కర్లు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సూచిం చారు. రహదారులపై ప్రయాణించే సమయంలో అధిక శబ్దంతో సౌండ్ సిస్టమ్‌లు వినియోగించడం ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చట్టపరమైన చర్యలతో పాటు జరిమానాలు, జైలు శిక్షలు కూడా విధించబడతాయని ఎస్ఐ హరిప్రసాద్ స్పష్టం చేశారు. అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్, ఓవర్‌లోడ్, నిద్రలేమితో డ్రైవింగ్ చేయ డం, మలుపుల వద్ద అజాగ్రత్తగా వ్యవహరించడం వంటి కారణాల వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. వాహనదారులు తమ వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలను ఎప్పటికప్పుడు నవీకరించుకోవాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన వారిపై, నిబంధనలకు విరుద్ధంగా నెంబర్ ప్లేట్లు కలిగిన వాహనాలపై ఎంవీ చలానా నిబంధనల ప్రకారం జరిమానాలు విధించినట్లు తెలిపారు. గత రెండు నెలల్లో బి.ఎన్. కండ్రిగ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏడు రోడ్డు ప్రమాదాలు నమోద య్యాయని, వాటిలో ముగ్గురు మృతి చెందగా నలుగురు తీవ్రంగా గాయపడినట్లు వెల్లడించారు. ఈ ప్రమాదాల నివారణకు ప్రజలు, యువత, వాహనదారులు బాధ్యతాయుతంగా వ్యవహరిం చాలని కోరారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాక్టర్ డ్రైవర్లు సహా ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజల్లో అవగాహన పెంపొందిం చడంలో మీడియా మిత్రులు కీలక పాత్ర పోషించాలని ఎస్ఐ హరిప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

# ఘనంగా ఎంపీ మిథున్ రెడ్డి జన్మదిన వేడుకలు రక్తదాన శిబిరం, అన్నదాన కార్యక్రమాలు



ప్రజా భూమి ప్రతినిధి బుచ్చినాయుడు కండ్రిగ తిరుపతి జిల్లా బి.ఎన్ కండ్రిగ మండల కేంద్ర లో రాజంపేట పార్లమెంట్ సభ్యులు పి.వి. మిథున్ రెడ్డి జన్మదిన వేడుకలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానుల మధ్య అత్యంత వైభవంగా జరిగాయి, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సత్యవేడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌ఛార్జ్ నూకతోటి రాజేష్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి, ఎంపీ మిథున్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారుఎంపీ మిథున్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన అభిమానులు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో భారీ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారుఈ శిబిరంలో అనేకమంది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, యువకులు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం మండల కేంద్రంలో సుమారు 500 మంది పేదలకు, ప్రజలకు భారీగా బిర్యానీ పంపిణీ అన్నదానం కార్యక్రమాన్ని చేపట్టారు. తమ ప్రియతమ నేత పుట్టినరోజున ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి పార్టీ మండల అధ్యక్షుడు మణి నాయుడు, గోపాల్ రెడ్డి, అజయ్ రెడ్డి, ఆలత్తూరు ఎంపీటీసీ, వైఎస్సార్‌సీపీ యూత్ కిరణ్ యాదవ్, రాజశేఖర్, ఆనంద్, సురేష్, వెంకటేష్ మరియు పెద్ద సంఖ్యలో పార్టీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు



# లెప్రసీ, ఎయిడ్స్, టిబి, వ్యాధులపై ఇంటింటి పరిశీలన.



ప్రజాభూమి ప్రతినిధి రేణిగుంట. తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్ మరియు జిల్లా లెప్రసీ,ఎయిడ్స్, టిబి అధికారిణి డాక్టర్ శైలజ ఆదేశాలమేరకు రేణిగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ చక్రపాణి ఆధ్వర్యంలో హెల్త్ సూపర్వైజర్ కామరాజు తమ సిబ్బందితో కలిసి ఇంటింటికి తిరుగుతూ దాగివున్న క్రొత్త కుష్ఠువ్యాధి గ్రస్తులను గుర్తించే (ఎల్ సి డి సి) – కార్యక్రమాన్ని రేణిగుంటలోని ఒడ్డి మిట్ట మరియు బుగ్గ వీధుల్లో ప్రారంభించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ కామరాజు ప్రజలతో మాట్లాడుతూ శరీరంపైన స్పర్శ లేని రాగి రంగు మచ్చలు,పొడలు,నొప్పి లేని పుండ్లు, కళ్ళు పూర్తిగా మూయలేక పోవడం,కను బొమలు మరియు కనురెప్పల మీది వెంట్రుకలు రాలడం, చెవి,ముక్కు తమ్మెలు మందంగా మారి ఉండడం, నూనె పూసినట్లు నిగనిగ లాడే చర్మం ఉండటం కుష్ఠు వ్యాధి లక్షణాలుగా అనుమానించాలని పేర్కొన్నారు.కుష్ఠు వ్యాధి మైకో బాక్టీరియం లెప్రే అనే సూక్ష్మక్రిమి వలన వ్యాపిస్తుందని, ఒకరి నుంచి ఒకరికి డ్రాప్లెట్స్ ఇన్ఫెక్షన్, లేదా రోగితో దీర్ఘ కాల సంబంధం కల్గి వారి గౌరవాన్ని కాపాడడం" అనే విషయం గురించి ప్రజలకు అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ చక్రపాణి,డాక్టర్ ఉదయశ్రీ,( డి ఎం పి ఓ) మునిసుబ్బరామి రెడ్డి,ఆసుపత్రి సిబ్బంది,క్షేత్ర స్థాయిలో ఎఎన్ఎంలు రేవతి,విజయలక్ష్మి, లోహిత మరియు ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

# వినాయక చవితికి కట్టుదిట్టమైన భద్రత: డీజేలకు అనుమతి లేదు

### చిల్లకూరు పోలీస్ స్టేషన్ లో నిర్వాహకులకు స్పష్టంచేసిన సీఐ కిషోర్ బాబు, ఎస్ఐ సురేష్ బాబు



ప్రజా భూమి ప్రతినిధి గూడూరు, నెల్లూరు జిల్లా చిల్లకూరు మండలంలో ఈ ఏడాది జరగనున్న వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు శాఖ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తుందని గూడూరు రూరల్ సీఐ కిషోర్ బాబు స్పష్టం చేశారు. శుక్ర వారం చిల్లకూరు పోలీస్ స్టేషన్ ఆవరణలో వినాయక చవితి ఉత్సవాల కమిటీ నిర్వాహకులు, గ్రామ పెద్దలతో నిర్వహించిన అవగాహన సమావే శంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు పలు ముఖ్యమైన సూచనలు, షరతులను తెలియజేశారు. గ్రామాల్లో ఏర్పాటు చేసే వినాయక విగ్రహాల ఎత్తు, మండ పాల ఏర్పాటుకు సంబంధించి పోలీస్, రెవెన్యూ శాఖల నుంచి ముందుస్తుగా అనుమతులు తీసుకోవాలని సీఐ సూచిం చారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల కంటే మట్టి విగ్రహాలను వాడి పర్యావర ణాన్ని రక్షించాలని ప్రోత్సహించారు. ముఖ్యంగా, యువతలో ఉత్సాహం పేరుతో జరుగుతున్న శబ్ద కాలుష్యాన్ని దృష్టిలో ఉంచుకుని, డీజేల వినియోగా నికి ఎటువంటి అనుమతి లేదని నిర్వాహకులకు ఖరాఖండిగా చెప్పారు. డీజే బాక్సులు ఏర్పాటు చేసి భారీ శబ్దాలతో శబ్ద కాలుష్య నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భక్తి పాటలను మితమైన ధ్వనితో పరిమిత సమయం వరకు మాత్రమే అనుమతిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చిల్లకూరు పోలీస్ స్టేషన్ ఎస్ఐ సురేష్ బాబు మాట్లాడుతూ, మండపాల వద్ద ఎల్లప్పుడూ వాలంటీర్లు అందుబాటులో ఉండా లని, గుర్తుతెలియని వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. నిమజ్జన ఊరేగింపులో ఎలాంటి అవాం ఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని, పోలీసుల సూచనలను పాటించి ఉత్సవాలను విజ యవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన వినాయక ఉత్సవ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

# కరకంబాడి అమర రాజా విద్యాలయంలో ఘనంగా 'కథోత్సవ్-2026'




ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల ఇతివృత్తంతో అంతర పాఠశాలల ఇంగ్లీష్ కథల పోటీలు నిర్వహించారు. తిరుపతి, సెప్టెంబర్ 11, 2026: కరకంబాడిలోని అమర రాజా ఆడిటోరియంలో అమర రాజా విద్యాలయం ఆధ్వర్యంలో అంతర పాఠశాలల ఇంగ్లీష్ కథల పోటీ 'కథోత్సవ్--2026' గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. 'సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు' ప్రధాన ఇతివృత్తంగా నిర్వహించిన ఈ పోటీలలో వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 17 ప్రముఖ పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ కథా చెప్పే నైపుణ్యంతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇంగ్లీష్ లాంగ్వేజ్ ఒ లిటరేచర్ ప్రొఫెసర్ డాక్టర్ పి. హరి పద్మ రాణి, అమర రాజా గ్రూప్ చీఫ్ సస్టైనబిలిటీ ఆఫీసర్ ప్రశాంత్ తివారి, అమర రాజా ఎనర్జీ ఒ మొబిలిటీ లిమిటెడ్ సీనియర్ మేనేజర్ బాలసుబ్రహ్మణ్యం ముఖ్య అతిథులుగా, న్యాయ నిర్ణేతలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ, కథలు చెప్పడం ఒక అద్భుతమైన కళ అని, ఇది విద్యార్థుల్లో సృజనాత్మకత, ఊహాశక్తి, ఆత్మవిశ్వాసం, భావవ్యక్తీకరణ సామర్థ్యాలను పెంపొందించేందుకు ఎంతో దోహదపడుతుందని అన్నారు. ప్రస్తుత ప్రపంచానికి ఎంతో కీలకమైన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను విద్యార్థులు కథల రూపంలో ఎంచుకుని, వాటిని సృజనాత్మకంగా ప్రదర్శించిన తీరు అభినందనీయమని ప్రశంసించారు. తీవ్ర పోటీ నడుమ సాగిన ఈ ఇంగ్లీష్ కథల పోటీలలో దిగువమాఘం అమర రాజా విద్యాలయం విద్యార్థిని బి. వైష్ణవి ప్రథమ బహుమతి సాధించగా, కరకంబాడి అమర రాజా విద్యాలయం విద్యార్థిని సి. దేవసు వర్షిణి ద్వితీయ బహుమతి, శ్రీసాయి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థిని సి. ఝాన్సీ తృతీయ బహుమతిని గెలుచుకున్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ముఖ్య అతిథులు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో అమర రాజా విద్యాలయం ప్రిన్సిపాల్ గ్లోరి దేవ ప్రియ, వైస్ ప్రిన్సిపాల్,పూజ, ఉపాధ్యాయ బృందం, వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని 'కథోత్సవ్--2026' కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కారిపాకం ఉన్నత పాఠశాలలో ఘనంగా హిందీ భాషా దినోత్సవ వేడుకలు



ప్రజా భూమి ప్రతినిధి వరదయ్యపాలెం తిరువతి జిల్లా వరదయ్యపాలెం మండలం కారిపాకం జడ్పీ ఉన్నత పాఠశాలలో హిందీ భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారుభారత రాజ్యాంగ పరిషత్ 1949 సెప్టెంబర్ 14న హిందీ భాషను అధికార భాషగా ఆమోదించిన సందర్భంగా ప్రతి సంవత్సరం నిర్వహించే హిందీ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీంద్ర రెడ్డి అధ్యక్షతన, హిందీ భాషా ఉపాధ్యాయులు దండు కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందు విద్యార్థులకు హిందీ భాష ప్రాముఖ్యత, ఆవశ్యకత మరియు ఔన్నత్యంపై అవగాహన కల్పిస్తూ వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, క్విజ్ తదితర పోటీలను నిర్వహించారు.ఈ సందర్భంగా హిందీ ఉపాధ్యాయులు దండు కుమార్ మాట్లాడుతూ దేశ ఐక్యత, సాంస్కృతిక సమైక్యతకు హిందీ భాష ఒక వారధిగా నిలుస్తోందని తెలిపారు. విద్యార్థులు బహుభాషా పరిజ్ఞానాన్ని పెంపొందించుకొని తమ భవిష్యత్తు అవకాశాలను విస్తరించుకోవాలని సూచించారు. విద్యార్థులు మీరాబాయి, కబీర్ దాస్, ఝాన్సీ లక్ష్మీబాయి, సుభద్ర కుమారి చౌహాన్ తదితర ప్రముఖుల వేషధారణలతో ఆకట్టుకున్నారు. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు, దేశభక్తి గీతాలు సభికులను అలరించాయి. వివిధ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటరమణ, మోతీలాల్, ఏడుకొండలు, పూడి శ్రీనివాస్ యాదవ్, వెంకటేశులు, మనోహర్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆగని ఇసుక అక్రమ రవాణా

### చిలేపల్లిలో ప్రత్యక్షమైన ఇసుక డంపు..

### అధికారుల చర్యల తర్వాతా కొనసాగుతున్న తరలింపు



ప్రజా భూమి శింగనమల మండల పరిధిలో ఇసుక అక్రమ రవాణాపై ఫిర్యాదులు, అధికారుల తనిఖీలు కొనసాగు తున్నప్పటికీ పరిస్థితిలో పెద్దగా మార్పు కనిపించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈరోజు చిలేపల్లి గ్రామంలో ఇసుక డంపు ప్రత్యక్షం కావడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.ఇటీవల నిదనవాడ గ్రామ పరిధిలో మైనింగ్, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు తనిఖీలు నిర్వహించి ఇసుక డంపును సీజ్ చేసినప్పటికీ తాజాగా ఈరోజు చిలేపల్లిలో మరో ఇసుక డంపు కనిపించడంతో అక్రమ రవాణాపై అధికారుల నిఘా ఎంతవరకు కొనసాగుతోందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇదిలా ఉండగా, నీటి కొరతతో పంటలు ఎండిపోతున్న పరిస్థితుల్లో ఇసుక తవ్వకాలు, తరలింపుపై రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇసుక తవ్వకాల వల్ల భూగర్భ జలాలపై ప్రభావం పడుతోందా? నిబంధనలకు విరుద్ధంగా ఇసుక నిల్వలు, రవాణా,జరుగుతున్నాయాఅనే అంశాలపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.చిలేపల్లిలో కనిపించిన ఇసుక డంపుపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, అనుమతులు ఉన్నాయా లేదా అన్నది నిర్ధారించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడంతో పాటు, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని రైతులు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# కరెంటు ఉన్నా.. నీరేది...

- వర్షాభావంతో ఎండుతున్న పంటలు.. విద్యుత్ సరఫరాలో నాణ్యత లేక రైతుల విలవిల
- ఉదయం, సాయంత్రం రెండు పూటలా నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలి
- నిర్లక్ష్యం వీడి పంటలను కాపాడాలని రైతుల విజ్ఞప్తి




ప్రజాభూమి, హిందూపురం టౌన్ ఆకాశం వైపు ఆశగా చూస్తున్న రైతుకు నిరాశే మిగులుతోంది. వర్షాలు ముఖం చాటేయడంతో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. మరోవైపు ఉన్న కొద్దిపాటి నీటితో పంటలను కాపాడుకుందామంటే విద్యుత్ సమస్య వెంటాడుతోంది. కరెంటు సరఫరా ఉన్నప్పటికీ తక్కువ వోల్టేజీతో మోటార్లు మాత్రమే తిరుగుతున్నాయని, నీరు మాత్రం సక్రమంగా రావడం లేదని తూమకుంట గ్రామ చెరువు కింద పంటలు సాగు చేస్తున్న రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు కళ్ల ముందే ఎండిపోతున్నా విద్యుత్ సరఫరాలో నాణ్యత లేకపోవడం తమను మరింత ఆందోళనకు గురిచేస్తోందన్నారు.

ఈ నేపథ్యంలో శుక్రవారం తూమకుంట చెరువు కింద పంటలు సాగు చేస్తున్న రైతులు విద్యుత్ శాఖ డీఈ చంద్రనాయక్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. వర్షాలు లేక భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో పంటలకు సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నామని, ప్రస్తుతం విద్యుత్ సరఫరాలోనూ తక్కువ వోల్టేజీ సమస్య నెలకొనడంతో మోటార్లు పనిచేస్తున్నా నీరు సక్రమంగా రావడం లేదని డీఈకి వివరించారు. పంటలు ఎండిపోకుండా ఉదయం, సాయంత్రం రెండు షిఫ్టులుగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. రైతులు వివరించిన సమస్యలను డీఈ చంద్రనాయక్ ఓపికగా విని సానుకూలంగా స్పందించినట్లు రైతులు తెలిపారు. ప్రస్తుతం వర్షాలు లేకపోవడంతో పొలాల్లో తేమ తగ్గిపోయి పంటలు ఎండిపోయే దశకు చేరుకున్నాయని రైతులు తెలిపారు. ఇప్పటికే భూగర్భ జలమట్టాలు గణనీయంగా పడిపోవడంతో బోర్లపై ఆధారపడి సాగు చేస్తున్న రైతులకు పరిస్థితి మరింత దుర్భరంగా మారిందన్నారు. ఇలాంటి కీలక సమయంలో విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోతే పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలను కాపాడుకోవడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. వరుసగా తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నామని అధికారులు చెబుతున్నప్పటికీ వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని రైతులు పేర్కొన్నారు. సుమారు నాలుగు గంటలు మాత్రమే విద్యుత్ కొంతమేర ఉపయోగపడుతోందని, మిగిలిన సమయంలో తక్కువ వోల్టేజీ కారణంగా మోటార్లు తిరుగుతున్నా నీరు సరిగా రావడం లేదన్నారు. దీంతో గంటల తరబడి కరెంటు కోసం ఎదురుచూసినా ప్రయోజనం లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

**పంటలు ఎండిపోతుంటే.. షిఫ్టులు ఎందుకు కాదు...**

రైతుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ సరఫరా విధానంలో తక్షణ మార్పు చేయాలని వారు కోరారు. వరుసగా తొమ్మిది గంటలు విద్యుత్ ఇచ్చే విధానానికి బదులుగా ఉదయం ఒక షిఫ్టు, సాయంత్రం మరో షిఫ్టుగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తే రైతులు అందుబాటులో ఉన్న కొద్ది పాటి నీటిని పంటలకు అందించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. తక్కువ వోల్టేజీ సమస్యను పరిష్కరించి మోటార్లు సామర్థ్యవంతంగా పనిచేసేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. రైతుల సమస్యను విద్యుత్ శాఖ అధికారులు కేవలం సాంకేతిక సమస్యగా కాకుండా పంటలు, రైతుల జీవనోపాధికి సంబంధించిన అత్యవసర సమస్యగా చూడాలని వారు కోరారు. అధికారులు క్షేత్రస్థాయి లో పరిస్థితిని పరిశీలించి, విద్యుత్ సరఫరాలో నాణ్యతను పెంచి పంటలు ఎండిపోకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కూడా రైతుల ఆవేదనపై వెంటనే స్పందించి సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు పెద్దతిమ్మయ్య, జి. దేవరాజు, సి.జి. రామాంజి, సింగనపల్లి శీనప్ప, టి.ఎల్. ఎల్లప్ప, దేవరపల్లి కిష్టప్ప, ఇర్ఫాన్, శివరాజు, హనుమంతప్ప, ఉప్ప ర నరసింహప్ప తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ స్టేషన్ల ముసాయిదాపై పార్టీలతో సమావేశం



ప్రజాభూమి, హిందూపురం టౌన్ హిందూపురం పురపాలక సంఘ పరిధిలో రూపొందించిన 156 పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితాపై శుక్రవారం అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. పురపాల క సంఘం కమిషనర్ మల్లికార్జున తన ఛాంబర్‌లో ఈ సమావేశాన్ని నిర్వహించి, పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితా వివరాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం, విజయవాడ వారు జారీ చేసిన సర్క్యులర్ నెం.525/ఎస్ఈసీ–ఎఫ్2/2026, తేదీ 07.09.2026లోని సూచనల మేరకు ఈ సమావేశాన్ని నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. పురపాలక సంఘ పరిధిలో ప్రతిపాదించిన 156 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి జాబితాను పరిశీలించి, ఏవైనా అభ్యంతరాలు, మార్పులు లేదా సూచనలు ఉంటే తెలియజేయాలని కమిషనర్ మల్లికార్జున రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాటులో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రక్రియను చేపడుతున్నట్లు తెలిపారు. అయితే సమావేశంలో 156 పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి ఎలాంటి అభ్యంతరాలు లేదా సూచనలు అందలేదని అధికారులు తెలిపారు. తదుపరి ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రక్రియను కొనసాగించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో పాటు పురపాలక సంఘం టౌన్ ప్లానింగ్ అధికారి అబ్దుల్ సత్తార్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలపై జనసేన అవగాహన

### - కడపలో సమన్వయ, సహాయక బృందాలతో సమావేశం

### - ఎమ్మెల్యే దేవ వరప్రసాద్




ప్రజాభూమి, కడప సిటీ: జనసేన పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల అవగాహన కార్యక్రమాన్ని కడప పార్లమెంట్ పరిధిలో శుక్రవారం నిర్వహించారు. కడపలోని దేవుని కడప కాలువ ఫంక్షన్ హాల్‌లో జనసేన పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల కడప పార్లమెంట్ సమన్వయకర్త, రాజోలు నియోజకవర్గ ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సమక్షంలో సమన్వయ, సహాయక బృందాలతో సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణులు చేపట్టాల్సిన కార్యక్రమాలు, అనుసరించాల్సిన కార్యాచరణపై ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌ను జనసేన పార్టీ సహాయక బృందం సభ్యుడు దాసరి రవిశంకర్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. పార్టీ బలోపేతానికి సమన్వయంతో పనిచేస్తూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సూచించారు. ఈ కార్యక్రమంలో దాసరి రవిశంకర్‌తో పాటు నాగ మల్లికార్జున పాల్గొన్నారు.

# గంజాయి అక్రమ రవాణాపై పోలీసుల ఉక్కుపాదం..!

## -ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో 100 గ్రాముల గంజాయి -అదుపులో ఒడిశాకు చెందిన వ్యక్తి

## -ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగిస్తాం -ఏఎస్పీ కేవీ మహేష్

ప్రజాభూమి, హిందూపురం టౌన్

రైళ్ల ద్వారా గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నామని హిందూపురం అడిషనల్ ఎస్పీ కేవీ మహేష్ తెలిపారు. మాదకద్రవ్యాల రవాణా, వినియోగాన్ని అరికట్టే చర్యల్లో భాగంగా రైల్వే స్టేషన్లు, రైళ్లలో ఈగల్ బృందం, డాగ్ స్క్వాడ్, ఆర్పీఎఫ్, ఏఆర్, సబ్‌డివిజన్ పోలీసులతో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అక్రమ రవాణాకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు ఈగల్ ఐజీ ఏకే రవికృష్ణ సూచనలతో, జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ పర్యవేక్షణలో శ్రీ సత్యసాయి జిల్లా పోలీస్ శాఖ మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా శుక్రవారం హిందూపురం, పెనుకొండ రైల్వే స్టేషన్లలో ఈగల్ ఆన్ ట్రైన్





కార్యక్రమాన్ని నిర్వహించారు. హిందూపురం ఏఎస్పీ కేవీ మహేష్ ఆధ్వర్యంలో ఈగల్ బృందం, ఆర్పీఎఫ్, ఏఆర్ పోలీసు సిబ్బంది, డాగ్ స్క్వాడ్, సబ్‌డివిజన్ పోలీసులు కలిసి రైళ్లలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ముఖ్యంగా హిందూపురం రైల్వే స్టేషన్‌లో భువనేశ్వర్--ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి అక్రమ రవాణా జరుగుతోందన్న సమాచారంతో పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. సుమారు 50 మంది పోలీసు సిబ్బంది, డాగ్ స్క్వాడ్‌తో రైలులోని వివిధ బోగీల్లో క్షుణ్ణంగా సోదాలు నిర్వహించారు. సుమారు అరగంట పాటు కొనసాగిన ఈ తనిఖీల్లో అనుమానాస్పద వ్యక్తుల కదలికలు, ప్రయాణికుల సామాగ్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఒడిశాకు చెందిన ఓ వ్యక్తి వద్ద గంజాయి ఉన్నట్లు గుర్తించిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి ఏడు చిన్న ప్యాకెట్లలో సుమారు 100 గ్రాముల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అలాగే గంజాయి తరలింపునకు ఉపయోగించిన సూట్‌కేసును కూడా స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్పీ కేవీ మహేష్ తెలిపారు. తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం నిందితుడిని జీఆర్పీ పోలీసులకు అప్పగించారు. రైళ్లలో మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని ఏఎస్పీ తెలిపారు. రైల్వే స్టేషన్లు, రైళ్లలో అనుమానాస్పద వ్యక్తుల కదలికలను నిశితంగా పరిశీలించడంతో పాటు డాగ్ స్క్వాడ్ సహాయంతో తరచూ ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామన్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగానికి పాల్పడే వారిపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష ఉండదని స్పష్టం చేశారు. మాదకద్రవ్యాల రహిత సమాజం కోసం ఇటువంటి ప్రత్యేక తనిఖీలు, ఆపరేషన్లు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. ఈ తనిఖీల్లో సీఐలు అబ్దుల్ కరీం, ఈగల్ ఎస్ఐ శ్రీధర్, ఎస్ఐ రాజేష్‌తో పాటు ఆర్పీఎఫ్, ఏఆర్, ఈగల్ బృందం, డాగ్ స్క్వాడ్, సబ్‌డివిజన్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# తపాలా బీమా తో ఆర్థిక భద్రత

## -హిందూపురం డివిజన్‌కు ప్రథమ స్థానం -పోస్టుమాస్టర్ జనరల్ వనం ఉపేంద్ర

ప్రజాభూమి, హిందూపురం టౌన్

గ్రామీణ తపాలా బీమా ద్వారా ఆర్థిక భరోసా చేకూరుతుందని పోస్ట్ మాస్టర్ జనరల్ వనం ఉపేంద్ర పేర్కొన్నారు. హిందూపురం ప్రధాన తపాలా కార్యాలయంలో హిందూపురం డివిజన్ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ ఏడాది జూలై మాసంలో 21వ తేదీ నుండి మూడు రోజులపాటు నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రూ.1.50 లక్షల వ్యాపారాన్ని సాధించిన ప్రతి తపాలా ఉద్యోగులు మరింత పట్టుదలతో పని చేయాలన్నారు. ఇందులో భాగంగా ఆయా ఉద్యోగులకు బహుమతులు అందజేశారు. పోస్టల్




లైఫ్ ఇన్సూరెన్స్, రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ వంటి తపాలా బీమా సేవలను సామాన్య ప్రజలకు మరింత విస్తృతంగా అందించడం ద్వారా వారికి ఆర్థిక భద్రత కల్పించవచ్చని తెలిపారు. అదే విధంగా తపాలా కార్యాలయాల ద్వారా పిఓఎస్బి ఖాతాలను ప్రారంభించడం వల్ల ప్రజలకు లభించే వివిధ ప్రయోజనాలను వివరించారు. హిందూపురం డివిజన్ వ్యాపార అభివృద్ధిలో విశేష ప్రతిభ కనబరిచి ఆంధ్రప్రదేశ్ సర్కిల్‌లో ప్రథమ స్థానాన్ని సాధించడం అభినందనీయమని ఆయన ప్రశంసించారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో పనిచేసి తపాలా సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని ఉద్యోగులకు సూచించారు. అసిస్టెంట్ డైరెక్టర్ నాగానాయక్ పాల్గొని తపాలా శాఖ అందిస్తున్న వివిధ సేవలను మరింత విస్తృతంగా ప్రజలకు అందించేందుకు ప్రతి ఉద్యోగి కృషి చేయాలని సూచించారు. హిందూపురం డివిజన్ సూపరింటెండెంట్ ఎన్. రెడ్డి బాషా మాట్లాడుతూ, హిందూపురం డివిజన్ ఆంధ్రప్రదేశ్ సర్కిల్‌లో ప్రథమ స్థానాన్ని సాధించడం వెనుక ప్రతి ఉద్యోగి అందించిన కృషి, సహాయ సహకారాలు ఉన్నాయని తెలిపారు. ఈ విజయాన్ని సమిష్టి కృషికి నిదర్శనంగా పేర్కొంటూ, భవిష్య త్తులో మరింత ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు ఉద్యోగులు ఇదే ఉత్సాహంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోస్ట్ మాస్టర్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ లు, పోస్టల్ ఇన్స్పెక్టర్లు, తపాలా కార్యాలయాల అధికారులు, సిబ్బంది, ఉద్యోగులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వర్షం కోసం ముస్లిం సోదరుల ప్రార్థనలు..

## -ఎండిపోతున్న పంటలను కాపాడాలని ప్రత్యేక ప్రార్థనలు-అల్లా దయతలిచి సమృద్ధిగా వర్షాలు కురిపించాలని వేడుకోలు

ప్రజాభూమి, హిందూపురం టౌన్

ఆకాశం వైపు ఆశగా చూస్తున్న రైతు.. ఎండిపోతున్న పంటలు.. తీరని దాహంతో విలవిల్లాడుతున్న మూగజీవాలు.., వర్షం జాడ లేక రోజురోజుకూ పెరుగుతున్న ఎండల తీవ్రతతో అన్నదాతలో ఆందోళన నెలకొంది. ఈ పరిస్థితుల్లో అల్లా దయ తలిచి వర్షాలు కురిపించి పంటలను కాపాడాలని కోరుతూ ముస్లిం సోదరులు ప్రార్థనలకు దిగారు. హిందూపురం మండలం చౌళూరు జామియా మసీదు ఆధ్వర్యంలో పవిత్ర శుక్రవారం సందర్భంగా చెరువులో సామూహికంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి చెరువులు, కుంటలు నిండాలని, పంటలు పచ్చగా కళకళలాడాలని, రైతుల కష్టాలు తీరాలని వేడుకున్నారు. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో ఇప్పటికే సాగు చేసిన పంటలు నీటి కోసం ఎదురుచూస్తున్నాయని ముస్లిం సోదరులు తెలిపారు. పంటలను కాపాడుకునేందుకు రైతులు పడుతున్న కష్టం వర్ణణాతీతమని పేర్కొన్నారు. వర్షం కోసం ఎదురుచూస్తున్న రైతులకు ప్రకృతి అనుకూలంగా మారాలని, ఒక్క వానతో పొలాల్లో పచ్చదనం పరుచుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ ఈ ఏడాది ఎండల తీవ్రత ఎన్నడూ లేనివిధంగా ఉందన్నారు. రుతుపవనాలు సకాలంలో ప్రభావం చూపకపోవడంతో వర్షాలు ఆశించిన స్థాయిలో కురవలేదని తెలిపారు. దీంతో వ్యవసాయంపై ఆధారపడిన రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని చెప్పారు. పంటలు



ఎండిపోతే పెట్టుబడులు నష్టపోయి రైతు కుటుంబాల జీవనంపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాభావం ప్రభావం మనుషులకే పరిమితం కాలేదని, పశువులు, పక్షులు, ఇతర మూగజీవాలు సైతం నీరు, మేత కోసం ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. చెరువులు, కుంటలు నిండకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో నీటి సమస్య మరింత తీవ్రమయ్యే పరిస్థితి ఉందన్నారు. ప్రజల కష్టాలను గుర్తించి అల్లా కరుణ చూపాలని ప్రార్థించారు. రైతు కళ్లలో మళ్లీ ఆశ చిగురించాలంటే వాన కురవాల్సిందేనని, పొలాల్లో పంట పండాలంటే చెరువుల్లోకి నీరు చేరాల్సిందేనని పేర్కొంటూ సమృద్ధిగా వర్షాలు కురవాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పంటలు చేతికంది రైతుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరియాలని, గ్రామంలో సుభిక్షం నెలకొనాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జామియా మసీదు ముతవల్లి ముర్తుజా, అల్లాబా, జాబీర్, అబ్దుల్లా, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

# ఐదు రోజుల బ్యాంకింగ్ విధానం అమలు చేయాలి

## -పిఎల్ఐలో వివక్ష తొలగించాలి -మిగిలిన సమస్యలు పరిష్కరించాలి-భారీ నిరసనలో బ్యాంకు ఉద్యోగుల

ప్రజాభూమి, హిందూపురం టౌన్

బ్యాంకు ఉద్యోగుల చిరకాల డిమాండ్లను పరిష్కరించకుండా యాజమాన్యాలు నిర్లక్ష్యం చేయడాన్ని నిరసిస్తూ ఉద్యోగులు సమరశంఖం పూరించారు. ఐదు రోజులభ బ్యాంకింగ్ విధానాన్ని తక్షణమే అమలు చేయాలని, పిఎల్ఐలో వివక్షను తొలగించి ఉద్యోగులందరికీ సమానంగా అమలు చేయాలని, 12వ ద్వైపాక్షిక ఒప్పందంలో మిగిలిపోయిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం దేశవ్యాప్త అఖిల భారత బ్యాంకు సమ్మె నిర్వహించారు. ఇందులో భాగంగా హిందూపురం యూనిట్ ఆధ్వర్యంలో స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రధాన శాఖ, ఎన్టీఆర్ సర్కిల్ వద్ద బ్యాంకు ఉద్యోగులు భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈభ సందర్భంగా ప్రసన్నకుమార్ మాట్లాడుతూ, ఐదు రోజుల బ్యాంకింగ్ విధానం అమలు చేయాలన్నది ఉద్యోగుల చిరకాల డిమాండ్ అని తెలిపారు. బ్యాంకు ఉద్యోగులు నిరంతరం ప్రజలకు సేవలందిస్తున్నప్పటికీ వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో యాజమాన్యాలు నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. ఉద్యోగుల పని పరిస్థితులు, కుటుంబ అవసరాలు, సామాజిక జీవనాన్ని దృష్టిలో ఉంచుకుని ఐదు రోజుల బ్యాంకింగ్ విధానాన్ని ఎలాంటి జాప్యం లేకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. పిఎల్ఐ విషయంలో ఉద్యోగులఖ మధ్య వివక్ష చూపడం తగదన్నారు. ఒకే సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు పనితీరు ఆధారంగా ప్రోత్సాహకాలు అందించే విషయంలో వివక్ష ఉండకూడదని, అందరికీ సమానమైన



పిఎల్ఐ అమలు చేయాలని కోరారు. అలాగే 12వ ద్వైపాక్షిక ఒప్పందంలో పరిష్కారం కాకుండా మిగిలిపోయిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యలపై మేనేజ్‌మెంట్ సానుకూలంగా స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. బ్యాంకు ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. దేశవ్యాప్తంగా చేపట్టిన సమ్మె ద్వారా బ్యాంకు ఉద్యోగుల ఐక్యతను యాజమాన్యాలకు స్పష్టం చేశామని తెలిపారు. బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు సంఘీభావంగా సీఐటీయూ నాయకులు రాము, ఏఐటీయూసీ నాయకులు వినోద్ హాజరై తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. బ్యాంకు ఉద్యోగులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి కార్మిక సంఘాలు అండగా ఉంటాయని తెలిపారు. ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారం కోసం అవసరమైతే అన్ని కార్మిక సంఘాలు ఐక్యంగా పోరాటం చేస్తాయని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో మారుతీష్, నవీన్, ఫణిభూషణ్, మల్లికార్జున, బాలకృష్ణ, చంద్రశేఖర్, హర్షవర్ధిని తదితరులతో పాటు వివిధ బ్యాంకులకు చెందిన ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మోదీకి 560 మంది విద్యార్థినుల పోస్టల్ కార్డులతో జన్మదిన శుభాకాంక్షలు

## బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర మీడియా ఇన్‌చార్జ్ పి. రామాంజనేయ ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా కార్యక్రమం

ప్రజా భూమి శింగనమల

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 76 వ జన్మదినాన్ని పురస్కరించుకుని "25 ఏళ్ల ప్రజా సేవా సంకల్పం అభియాన్"లో భాగంగా అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలం కొర్రపాడులోని డా. బి.ఆర్. అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర మీడియా ఇన్‌చార్జ్ పి. రామాంజనేయ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాలకు చెందిన 560 మంది విద్యార్థినులు పోస్టల్ కార్డుల ద్వారా ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

దేశ ప్రధానమంత్రికి విద్యార్థినుల చేత పోస్టల్ కార్డుల ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసేలా కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు కలగాలని, దేశాన్ని మరింత ప్రగతి పథంలో నడిపించాలని ఆకాంక్షించారు.



**విద్యార్థినులతో మోదీ సేవా కార్యక్రమాలపై అవగాహన**

కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. దేశ నిర్మాణంలో యువత, ముఖ్యంగా విద్యార్థుల పాత్ర, మహిళా సాధికారత, విద్య, స్వచ్ఛత, స్వయం ఉపాధి, సాంకేతిక అభివృద్ధి, దేశ ఆర్థిక ప్రగతి తదితర అంశాలపై వివరించారు. విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా దేశంలో జరుగుతున్న పరిణామాలు, ప్రజాస్వామ్య వ్యవస్థ, రాజ్యాంగ విలువలు, దేశ అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన పెంచుకోవాలని కార్యక్రమ నిర్వాహకులు సూచించారు.

# చౌడేశ్వరి దేవి అమ్మవారికి కూష్మాండ దీప హారతులు

ప్రజాభూమి, లింగాల



పులివెందుల పట్టణంలోని బ్రాహ్మణపల్లి రోడ్డు, చౌడమ్మ వీధిలో కొలువైన శ్రీ రామలింగ చౌడేశ్వరి దేవస్థానంలో శ్రావణ మాస చివరి శుక్రవారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ప్రవీణ్ స్వామి ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి తదితర పూజలు నిర్వహించారు. ఉదయం 10.30 గంటలకు సామూహిక కుంకుమార్చన పూజలు చేశారు. అనంతరం అమ్మవారు విశేష అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేకంగా కూష్మాండ దీపాలు వెలిగించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. శుక్రవారం, మంగళవారం, పౌర్ణమి, అమావాస్య రోజుల్లో 108 ప్రదక్షిణలు చేసి అమ్మవారిని వేడుకుంటే కోరిన కోరికలు నెరవేరుతాయని భక్తుల నమ్మకమని ఆలయ నిర్వాహకులు రాజేంద్రప్రసాద్, అర్చకులు ప్రవీణ్ స్వామి తెలిపారు. ఆలయ ప్రాంగణం "జై చౌడమ్మ తల్లి" నామస్మరణతో మార్మోగింది.

# యర్రగుడిపల్లిలో ప్రజా సమస్యలపై మున్సిపల్ ఇంచార్జ్ వైయస్ మనోహర్ రెడ్డి దృష్టి

ప్రజాభూమి, పులివెందుల



పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని యర్రగుడిపల్లెలో నెలకొన్న సమస్యలను మున్సిపల్ ఇన్‌చార్జ్ వైఎస్ మనోహర్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. స్థానిక ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా తాగునీరు, యూజీడీ సమస్యలు ఉన్నాయని ప్రజలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. మాజీ చైర్మన్ వరప్రసాద్, పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షు డు పార్నపల్లె కిషోర్ లతో కలిసి సమస్యలు ఉన్న ప్రాంతాలను పరిశీలించారు. సమస్యలను సావధానంగా విన్న మనోహర్ రెడ్డి, సంబంధిత అధికారులతో మాట్లాడి తాగునీరు, యూజీడీ సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మాజీ కౌన్సిలర్ పురుషోత్తం, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు దాసరి చంద్రమౌళి, ఎస్సీ నాయకులు కోళ్ల భాస్కర్, కాంట్రాక్టర్ శేఖర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# పదేళ్లుగా సేవలు.. రెగ్యులరైజేషన్ ఎక్కడ..

## -నల్ల బ్యాడ్జీలు, నల్ల బెలూన్ లతో నిరసన

ప్రజాభూమి, హిందూపురం టౌన్



పదేళ్లుగా ప్రభుత్వ ఆసుపత్రిలో కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తూ రోగులకు సేవలందిస్తున్నా తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని కాంట్రాక్ట్ నర్సులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి సేవలందిస్తున్న తమకు పదోన్నతులు లేకపోవడంతో పాటు ఉద్యోగ భద్రత కూడా కరువైందని వాపోయారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో కాంట్రాక్ట్ నర్సులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నర్సులు నల్ల బ్యాడ్జీలు ధరించి, నల్ల బెలూన్ లు ఎగురవేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సిబ్బంది కొరత ఉన్న సమయంలోనూ ఎన్నో ఏళ్లుగా కాంట్రాక్ట్ నర్సులు బాధ్యతగా విధులు నిర్వహిస్తూ రోగులకు సేవలందిస్తున్నారని తెలిపారు. అయితే తమ సేవలను ప్రభుత్వం గుర్తించకుండా కాంట్రాక్ట్ విధానానికే పరిమితం చేయడం బాధాకరమన్నారు. పదేళ్లుగా పనిచేస్తున్నప్పటికీ పదోన్నతులకు అవకాశం లేకపోవడంతో వృత్తిపరంగా ఎదగలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రెగ్యులరైజేషన్ విషయంలో పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు స్పష్టమైన హామీ లభించలేదన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల సేవలను గుర్తించి, దీర్ఘకాలంగా పనిచేస్తున్న నర్సుల ఉద్యోగాలను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. పదోన్నతులకు అవకాశం కల్పించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి కాంట్రాక్ట్ నర్సుల సమస్యలను పరిష్కరించాలని, న్యాయమైన డిమాండ్లను నెరవేర్చి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# చికాగో ప్రసంగం.. భారత ఖ్యాతిని చాటిన ఘట్టం..

## -స్వామి వివేకానందుని బోధనలు నేటి యువతకు స్ఫూర్తిదాయకం

## -ఎన్ఎస్‌పీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అంజలీదేవి

ప్రజాభూమి, హిందూపురం టౌన్




స్వామి వివేకానందుడు 1893 సెప్టెంబర్ 11న అమెరికాలోని చికాగోలో జరిగిన ప్రపంచ సర్వమతాల పార్లమెంట్‌లో చేసిన చారిత్రాత్మక ప్రసంగాన్ని స్మరించుకుంటూ ప్రతి ఏటా సెప్టెంబర్ 11న దిగ్విజయ్ దివస్‌ను నిర్వహిస్తున్నామని ఎన్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అంజలీదేవి పేర్కొన్నారు. శుక్రవారం కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన దిగ్విజయ్ దివస్ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. ప్రపంచ మానవాళిని ఆలోచింపజేసిన స్వామి వివేకానందుని ఆనాటి ప్రసంగం నేటికీ ఎంతో అనుసరణీయమన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, సనాతన ధర్మం, మానవులంతా ఒక్కటేననే సమభావాన్ని ఆయన తన ప్రసంగం ద్వారా ప్రపంచానికి చాటిచెప్పారని తెలిపారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.వెంకటేశులు మాట్లాడుతూ, నేటి యువత స్వామి వివేకానందుని బోధనలు, ఆలోచనా విధానాలను ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, దేశభక్తి, మానవతా విలువలను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమం ముగింపులో చికాగో సర్వమతాల పార్లమెంట్‌లో స్వామి వివేకానందుడు చేసిన చారిత్రాత్మక ప్రసంగాన్ని విద్యార్థులకు వినిపించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి రంగనాయకులు, సీనియర్ అసిస్టెంట్ బి.నరసింహులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీ వైష్ణవి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ముందస్తు వినాయక చవితి వేడుకలు

ప్రజాభూమి పోరుమామిళ్ల :



కడప జిల్లా పోరుమామిళ్ళ పట్టణంలోని శ్రీ వైష్ణవి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ముందస్తు వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. అందులో భాగంగా కస్పాండెంట్ ఆర్.వి. రామకృష్ణ వినాయక చవితిని ఎందుకు జరుపుకుంటామో తెలియజేసి అందులోని విశిష్టతను పిల్లలకు వివరిస్తూ విఘ్నేశ్వరుని పూజించడం వలన విఘ్నాలు( ఆటంకాలు ) తొలగుతాయని చెప్పారు. అలాగే వినాయకుని నిమజ్జనం రోజు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రిన్సిపల్ మరియు అధ్యాపకులందరూ పాల్గొని ఘనంగా నిర్వహించారు.

ప్రజాభూమి

జనరల్

శనివారం, సెప్టెంబర్ 12, 2026



# ధాన్యం సేకరణకు 7 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యం

## రైతులకు కనీస మద్దతు ధరపై విస్తృత అవగాహన కల్పించాలి 312 రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోళ్లకు ఏర్పాట్లు

మచిలీపట్నం ప్రజాభూమి ప్రతినిధి

కృష్ణాజిల్లాలో 2026–27 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌లో 7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరిం చేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం. నవీన్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన అధ్యక్షతన జిల్లా ధాన్యం సేకరణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి జిల్లాలో చేపట్టాల్సిన ఏర్పాట్లు, రైతులకు అందించాల్సిన సౌకర్యాలపై సమీక్షించారు.2026–27 ఖరీఫ్ సీజన్‌లో కృష్ణాజిల్లాలో రైతులు 3,28,072 ఎకరాల్లో వరి సాగు చేసినట్లు జాయింట్ కలెక్టర్ తెలిపారు. దీనివల్ల సుమారు 9,84,216 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేసినట్లు చెప్పారు. ఇందులో 7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.కనీస మద్దతు ధరగా ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,461, సాధారణ రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2, 441 చెల్లించనున్నట్లు తెలిపారు. రైతులకు కనీస మద్దతు ధర, ధాన్యం నాణ్యత ప్రమాణాలు, గోనె సంచులు, రవాణా సౌకర్యం, హమాలీ చార్జీల చెల్లింపులపై ముందస్తుగా అవగాహన కల్పించా లని సూచించారు.రైతుల నుంచి ధాన్యం సేకరణ కోసం జిల్లాలో 312 రైతు సేవా కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. వ్యవసాయశాఖ సిబ్బంది, ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బంది రైతు సేవా కేంద్రాలు, గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి కొనుగోలు ప్రక్రియపై వివరించాలన్నారు. రైతులు 73373 59375 వాట్సాప్ నంబర్‌కు 'హాయ్' అనే సందే శం పంపడం ద్వారా ధాన్యం కొనుగోలు ప్రక్రియకు సంబంధించిన షెడ్యూల్ బుకింగ్ తదితర వివరాలను తెలుసుకునేలా విస్తృత ప్రచారం చేయాలని సూచించారు.రైతులు బహిరంగ మార్కెట్‌లో విక్రయించిన ధాన్యం వివరాలను గ్రామ వ్యవసాయ సహాయకులు సంబంధిత ధాన్యం సేకరణ పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించేందుకు అవసరమైన గోనె సంచులు, జీపీఎస్ అనుసంధానిత వాహనాలను రైస్ మిల్లర్లు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన బ్యాంకు గ్యారంటీలను రైస్ మిల్లర్లు అక్టోబర్ 15వ తేదీలోగా సమర్పించాలని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు. ధాన్యం సేకరణకు సంబంధించిన శిక్షణా తరగతులను మండలాల వారీగా నిర్వహించి సిబ్బందికి పూర్తి అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.రైతులకు ధాన్యం విక్రయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లాలో 8247693551 నంబర్‌తో ప్రత్యేక నియంత్రణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలను నియంత్రణ కేంద్రం ద్వారా త్వరిత గతిన పరిష్కరించాలని ఆదేశించారు.సమావేశంలో పౌరసరఫరాల అధికారి టి. శివరామ ప్రసాద్, జిల్లా పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్, వ్యవసాయశాఖ అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, రవాణాశాఖ సిబ్బంది, న్యాయ కొలతల శాఖ అధికారులు, రైస్ మిల్లర్లు, భారత ఆహార సంస్థ సిబ్బంది, బఫర్ గోదాం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# భారత్ స్కౌట్స్ గైడ్స్ ఆధ్వర్యంలో డాక్టర్ ఓలేటి కి ఘనసత్కారం

మచిలీపట్నం ప్రజాభూమి ప్రతినిధి



భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు స్వీకరించిన డాక్టర్ ఓలేటి ఉమా సరస్వతిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగామచిలీపట్నం చిలకలపూడిలోని స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణా కేంద్రంలో పీఎం శ్రీ పాఠశాలల విద్యార్థులకు ద్వితీయ సోపాన్ శిక్షణ తరగతులలో భాగంగా ఐదో రోజు శిక్షణ కార్యక్రమానికి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపా ధ్యాయ అవార్డు గ్రహీత డాక్టర్ ఓలేటి ఉమాసరస్వతి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించేందుకు ఆహ్వా నించారు.ఈ సందర్భంగా ఉమా సరస్వతి మాట్లాడుతూ స్కౌట్ శిక్షణతో విద్యార్థులు సేవాభా వాన్ని అలవర్చుకోవాలన్నారు.పీఎం శ్రీ పాఠశాలల విద్యార్థులు అదృష్టవంతులన్నారు.క్రమశిక్షణతో మెలిగి దేశానికి ఆదర్శంగానిలపాలన్నారు.మచిలీపట్నం చిలకలపూడిలోని స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణా కేంద్రంలో పీఎం శ్రీ పాఠశాలల విద్యార్థులకు ద్వితీయ సోపాన్ శిక్షణ తరగతులు నాలుగు రోజులుగా కొనసాగుతున్నాయి. ఐదో రోజు శిక్షణా కార్యక్రమానికి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డాక్టర్ ఓలేటి ఉమాసరస్వతిని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించేందుకు ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీఎం శ్రీ పాఠశాలల విద్యార్థులు స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ పొందే అవకాశం లభించడం ఎంతో అదృష్టకరమన్నారు. విద్యార్థులకు స్కౌట్ శిక్షణ అందించే బాధ్యతను ప్రభుత్వం తీసుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. శిక్షణ ద్వారా క్రమశిక్షణ, సమయపాలన, నాయకత్వ లక్షణాలతో పాటు సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని సూచించారు.స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణలో పొందిన అనుభవాన్ని విద్యార్థులు తమ వ్యక్తిగత జీవితంలోనూ ఆచరించాలని ఆమె కోరారు. శిక్షణా ధ్రువపత్రాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యలో మంచి అవకాశాలను పొందడంతో పాటు, బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదిగి భారతీయతను చాటిచెప్పాలని ఆకాంక్షించారు.సేవా భావం, క్రమశిక్షణ, దేశభక్తి వంటి విలువలు విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాదులుగా నిలుస్తాయని ఆమె పేర్కొన్నారు. సమాజానికి ఉపయోగపడే విధంగా తమ నైపుణ్యాలను పెంపొందించుకుని, ఇతరులకు ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా కృష్ణా జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యదర్శి, అంగలూరు డైట్ లెక్చరర్ పి. లలిత్ మోహన్, ఊటుకూరి సుబ్బారావు, ప్రముఖ స్కౌట్ మాస్టర్లు డాక్టర్ ఉమాసరస్వతిని ఘనంగా సత్కరించారు. విద్యార్థులకు అందిస్తున్న శిక్షణ ద్వారా వారిలో నాయకత్వ లక్షణాలు, సేవా భావం మరింత వికసిస్తాయని నిర్వాహకులు తెలిపారు.

# వైభవంగా కాసుల పురుషోత్తమ కవి జయంతి మహోత్సవాలు

## 200 మంది జానపద కళాకారులతో ఘనంగా కళా ప్రదర్శనలు.. హాజరైన విక్కుర్తి శ్రీనివాసరావు



ప్రజాభూమి ప్రతినిధి అవనిగడ్డ

తెలుగు సాహితీ రంగంలో విశిష్ట సేవలందించిన కాసుల పురుషోత్తమ కవి జయంతి మహోత్సవాలు శ్రీకాకుళం ఆంధ్ర మహావిష్ణు దేవాలయ ప్రాంగణంలో శనివారం వైభవంగా నిర్వహించారు. కాసుల పురుషోత్తమ కవి ఫౌండేషన్ ఇండియా ట్రస్ట్ చైర్మన్, కవి వంశీయుడు డాక్టర్ కాసుల కృష్ణంరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ విక్కుర్తి శ్రీనివాసరావు హాజరయ్యారు.ఈ సందర్భంగా శ్రీకాకుళేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని కాసుల పురుషోత్తమ కవి విగ్రహానికి విక్కుర్తి శ్రీనివాసరావుతో పాటు పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన జానప ద కళా ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. సుమారు 200 మంది జానపద కళాకారులు ప్రత్యేక వేషధారణలతో పాల్గొని వివిధ కళారూపాలు, మురళి, కోలాట ప్రదర్శనలు నిర్వహించారు. కళాకా రుల ప్రదర్శ నలతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది.ఈ సందర్భంగా విక్కుర్తి



శ్రీనివాసరావు మాట్లాడుతూ కాసుల పురుషోత్తమ కవి తెలుగు సాహిత్యానికి అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. మహనీయుల సాహితీ వారసత్వాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రాచుర్యంలో ఉన్న జానపద కళలను ప్రోత్స హించడం అభినందనీయమని, 200 మంది కళాకారులతో ఇంత ఘనంగా కార్యక్రమాన్ని నిర్వ హించడం ద్వారా మన సంప్రదాయ కళలకు మరింత గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. కాసుల పురుషోత్తమ కవి జయంతి వేడుకలను ఇంత వైభవంగా నిర్వహించిన నిర్వాహకులను ఆయన అభినందించారు.ఆంధ్రప్రదేశ్ సృజనాత్మక భాషా సాంస్కృతిక శాఖ, కాసుల పురుషోత్తమ కవి ఫౌండేషన్ ఇండియా ఆధ్వర్యంలో ఇటీవల గుంటూరులో నిర్వహించిన కార్యక్రమాల స్ఫూర్తితో ఈ జయంతి మహోత్సవాలను నిర్వహించినట్లు డాక్టర్ కాసుల కృష్ణంరాజు తెలిపారు. 21 మంది ప్రాచీన కవుల వంశీయుల కుటుంబాలు పాల్గొన్న కార్యక్రమాల నేపథ్యంలో కాసుల పురుషోత్తమ కవి సాహితీ సేవలను ప్రజలకు మరింతగా పరిచయం చేయాలనే ఉద్దేశంతో ఈ వేడుకలను నిర్వహించినట్లు తెలిపారు.



# మచిలీపట్నం మేయర్ కూటమి అభ్యర్థి రేసులో బుల్లెట్ ధర్మారావు

మచిలీపట్నం ప్రజాభూమి ప్రతినిధి

కృష్ణాజిల్లా మచిలీపట్నంలో రాధా రంగా మిత్రమండలి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం జరిగినది. ముందుగా కీర్తిశేషులు వంగవీటి మోహన రంగా శ్రీకృష్ణదేవరాయలు చిత్రపటాలకు పూలమాల అలంకరించి నివాళులు అర్పించి అనంతరం సమావేశంలో కమిటీ సభ్యులు మరియు మహిళా కమిటీ సభ్యులు. అందరూ పాల్గొని రేపు జరగబోవు కార్పొరేషన్ ఎన్నికలలో మచిలీపట్నంలో 10 కార్పొరేటర్ వార్డులను, మేయర్ అభ్యర్థిగా బుల్లెట్ ధర్మారావు కి కూటమి తరపున కేటాయించవలసిందిగా విజ్ఞప్తి చేయుచున్నాము. గత 40 సంవత్సరాలుగా బుల్లెట్ ధర్మారావు రాధా రంగా మిత్రమండలి నడిపిస్తూ అన్ని కులాల వారిని మతాల వారిని కలుపుకుని మహిళలకు కూడా సమాన భాగస్వామిలుగా వారికి గౌరవమైన పదవులు ఏర్పాటు చేసి ఎవరు కష్టాల్లో ఉన్న ఆపదలో ఉన్న వారిని ఆదుకునే వ్యక్తి బుల్లెట్ ధర్మారావు అని తెలుపుతూ రాష్ట్రంలో జరిగిన గత ఎన్నికలలో కూటమి గెలుపునకు ధర్మారావు ఎంతో కృషి చేసినారు. కావున సీఎం చంద్రబాబు నాయుడు , డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కళ్యాణ్ రాష్ట్ర బిజెపి అధ్యక్షులు పివిఎన్ మాధవ్ కు విజ్ఞప్తి చేస్తూ రాధా రంగా మిత్రమండలి కూటమి గెలుపునకు ఎంతో కృషి చేసినామని అలాగే మచిలీపట్నం మంత్రి కొల్లు రవీంద్ర రాధా రంగా మిత్రమండలి అధ్యక్షులు బుల్లెట్ ధర్మారావు కూటమి గెలుపు నకు ఎంతో కృషి చేసినారు. కావున భవిష్యత్తులో వారికి ఎటువంటి సహాయ సహకారాలు అయినా మేము అందిస్తామని హామీ ఇవ్వడం జరిగినది. మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి గెలుపునకు బుల్లెట్ ధర్మారావు విశేష కృషి జరిపినారని ఎంపీ బుల్లెట్ ధర్మారావు కి ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రంథాలయ చైర్మన్ పదవిని కేటాయించవలసిందిగా లెటర్ ఇవ్వడం జరిగినది కానీ పొత్తులో భాగంగా తెలుగుదేశం పార్టీకి ఆ పదవిని కేటాయించినారు. కావున తమరు ఈ కార్పొరేషన్ ఎన్నికలలో కూటమి అభ్యర్థి గా బుల్లెట్ ధర్మారావు కి కేటాయిస్తే మేమందరం కూడా ఆయనను గెలిపించి కూటమికి కానుకగా అందిస్తామని అలాగే మచిలీపట్నం కార్పొరేషన్ నీ రాష్ట్రంలోనే నెంబర్ వన్ గా అభివృద్ధి పథంలో తీసుకువస్తామని తెలియజేస్తూ. ఈ సందర్భంగా మేము ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు ని, బూరగడ్డ వేదవ్యాసు ని, గొర్రెపాటి గోపీచంద్ ని కొంతమంది పెద్దలను కలిసి కోరుతామని తెలియజేస్తున్నాము. ఈ సమావేశంలో. LIC రాంబాబు, షేక్ సిరాజుద్దీన్, మత్తి వెంకటేశ్వరరావు, వన్నెంరెడ్డి ప్రసాదు, వెన్న నాగఫణి రాజ్, మోకా మల్లిక, తోట విజయ కుమారి, రాయపరెడ్డి నాగమణి, ముంగండ బాలా కుమారి, ఎడ్ల అప్పాయమ్మ, గోపిశెట్టి దుర్గ, ఉమ్మారెడ్డి నాగమణి, యాదల పుణ్యవతి, బొమ్మసాని లక్ష్మి ప్రసన్న, వన్నెంరెడ్డి కుమారి, విన్నకోట సుబ్బారావు,అనభం సాయి, తలారి నాగమల్లేశ్వర రావు,జరుగు వెంకట సుబ్బారావు, నరహరిశెట్టి రామకృష్ణ, తోట బుజ్జి నాయుడు, ఇంటి రామారావు, పుప్పాల బాను, ఘంటసాల సుబ్బారావు, నూకల బెనర్జీ,నూకల రమేష్ బాబు, పర్ణం సుబ్బయ్య, బాకీ విజయ్ కుమార్. మరియు రంగా అభిమానులు,పవన్ కళ్యాణ్ అభిమానులు కూటమి నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం గావించినారు..






# మడ్డిపల్లి గ్రామ సబ్ స్టేషన్ వద్ద రైతుల ధర్నా

ప్రజాభూమి, పుట్లూరు

రైతులకు సరైన సమయంలో కరెంటు ఇవ్వకపోవడం, అకాల కరెంటు కోతలతో పంటలు ఎండిపోతున్నాయని నిరసిస్తూ రైతులు ఆందోళన చేపట్టారు.ఈ ధర్నా కార్యక్రమంలో పుట్లూరు మండల వైఎస్ఆర్సీపీ అధ్యక్షులు శ్రీ పొన్నపాటి మహేశ్వర్ రెడ్డి రైతులకు అండగా నిలబడి పాల్గొన్నారు.ఈ సందర్భంగా రైతులు తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరారు.రైతులకు కరెంటు కోతలు లేకుండా నిరంతరాయంగా 7 గంటల ఉచిత విద్యుత్ అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అసలే వర్షాలు లేక బోర్లు అడుగంటి పోతుంటే దీనికి తోడు కరెంటు కోతలతో ఇంకాస్త రైతులను ఇబ్బంది పెట్టే విధంగా కరెంటు కోతలు ఉన్నాయని,రైతు బాగుంటే రాష్ట్రం బాగుంటుందని ఎప్పటికైనా ఉన్నతాధికారులు కరెంటు కోతలు లేకుండా చూడాలని రైతుల సమస్యను పరిష్కరించకపోతే సింగనమల సమన్వయకర్త మాజీ మంత్రివర్యులు డాక్టర్ సాకే శైలజనాథ్ గారి ఆదేశాల మేరకు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

# 'విజయమో.. వీరమరణమో!'

## కృష్ణాజిల్లా వైఎస్సార్‌సీపీ స్థానిక పోరు సమరశంఖం

## వైఎస్ జగన్ ఆదేశాలతో జిల్లా స్థాయి సన్నాహక సమావేశం

## ప్రభుత్వ నాటకాలను ఎండగట్టండి: మాజీ మంత్రి పేర్ని నాని పిలుపు

ప్రజాభూమి బ్యూరో కృష్ణ జిల్లా



రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు 'విజయమో.. వీరమరణమో' అన్న రీతిలో వీరోచితంగా పోరాడాలని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని పిలుపునిచ్చారు. పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కృష్ణాజిల్లా వైఎస్సార్‌సీపీ స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా బాధ్యులు, కార్యకర్తలకు ఎన్నికల కార్యాచరణపై పేర్ని నాని దిశానిర్దేశం చేశారు.కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై ధ్వజమెత్తుతూ ఆయన మాట్లాడిన ముఖ్య విశేషాలు:పెన్షన్ల పేరుతో నాటకాలు: అధికారంలోకి వచ్చి రెండేళ్లవుతున్నా ఒక్క కొత్త పెన్షన్ కూడా మంజూరు చేయలేదని చంద్ర బాబు ప్రభుత్వంపై మండిపడ్డారు. కేవలం ఓట్ల కోసమే పెన్షన్ల పంపిణీ పేరుతో కూటమి ప్రభుత్వం డ్రామాలు ఆడుతోందని ఆరోపించారు.మున్సిపల్ పోరుకు తేదీలు సిద్ధం: రాబోయే 2 లేదా 3వ తేదీన మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్, 3 లేదా 4వ తేదీల్లో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం ఉందన్నారు. ఈ నెల 16, 17 తేదీల్లో పోలింగ్ జరగొచ్చని తెలిపారు.ఈ నెలాఖరులోనే రిజర్వేషన్లు: ఈ నెలాఖరు నాటికి మున్సిపాలిటీలు, వార్డుల రిజర్వేషన్లు ఖరారయ్యే అవకాశం ఉందన్నారు.జెడ్పీటీసీ, ఎంపీటీసీ, పంచాయతీ పోరు: నవంబర్, డిసెంబర్ నెలల్లో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్ని కలు, మార్చి నెల తర్వాత పంచాయతీ ఎన్నికలు నిర్వహించే దిశగా యంత్రాంగం అడుగులు వేస్తోందని వెల్లడించారు.జగనన్నకు విజయ కానుక ఇద్దాం:ప్రజా సమస్యలపై పోరాడుతూ, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలని నాయకులకు, కార్యకర్తలకు స్పష్టం చేశారు. కృష్ణాజిల్లాలోని మెజార్టీ మున్సిపాలిటీలను గెలుచుకుని వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ఘనమైన విజయ కానుకగా అందించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ శ్రమించాలని పేర్ని నాని పిలుపునిచ్చారు.





# అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఎన్టీఆర్ భరోసా..

## ఇదే కూటమి ప్రభుత్వ లక్ష్యం: టిడిపి నేతలు

ప్రజాభూమి ప్రతినిధి అవనిగడ్డ

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఎన్టీఆర్ భరోసా ఇవ్వాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టిడిపి నేతలు పేర్కొన్నారు. శుక్రవారం మోపిదేవి మండలంలోని కే. కొత్తపాలెం కొక్కలిగడ్డ గ్రామ సచివాలయాలు వద్ద ఎన్టీఆర్ భరోసా కొత్త పెన్షన్ దరఖాస్తుల ప్రక్రియను టిడిపి నేతలు పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరు ప్రభుత్వ నిబంధన మేరకు అవసరమైన ధ్రువపత్రాలతో సచివాలయాలలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని విజ్ఞప్తి చేశారు. సచివాలయ ఉద్యోగులు దరఖాస్తు సమర్పించేందుకు వచ్చిన లబ్ధిదారులను మర్యాదగా పలకరించి వీలైనంత త్వరగా ఆన్లైన్ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఆన్లైన్



ప్రక్రియ పూర త్తయిన ట్లు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కే కొత్తపాలెంలో ఇప్పటివరకు 120 మంది దరఖాస్తులు సమర్పించగా 95 మందికి ఆన్లైన్ చేసినట్లు చెప్పారు. కొక్కలిగడ్డలో 75 దరఖాస్తులు లాగా 68 ఆన్లైన్ పక్రియ పూర్తయినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు చందన రంగారావు టిడిపి జిల్లా అధికార ప్రతినిధి రావిరత్నగిరి, మాజీ సర్పంచ్ దిడ్ల జానకి రాంబాబు, గ్రామ పార్టీ అధ్యక్షులు కేసాని శివుడు, పడమట వెంకటేశ్వరరావు, పిఏసిఎస్ అధ్యక్షుడు బళ్లా సీతారాం ప్రసాద్, పార్టీ నాయకులు చందన అనిల్, దుట్టా శేషు, సనకా వెంకటేశ్వరరావు దుట్టా విజయ్ కందుల బసవయ్య తదితరులు పాల్గొన్నారు



Printed and Published and owned by A.RAMAMOHANREDDY,Printed at Sri Lakshmi Offset Printers, R.S. No.268/2;D.No. 8/180,Surampalli Village, Gannavaram Mandalam, Krishna district, Andhra Pradesh and Published from D.NO. 32-26-85/6, MSR Street Marutinagar, Eluru Road, Vijayawada-520004,Krishna district, Andhra Pradesh, Editor :A.RAMAMOHANREDDY, RNI NO. APTEL/2011/41440, Phone No. Cell : 9502116677

# వాడపల్లి శ్రీనివాసం-2కు రూ.12 కోట్ల టీటీడీ నిధుల విడుదలకు తీర్మానం

- టీటీడీ పాలకమండలి నిర్ణయంపై హర్షం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే బండారు.
- కృషికి గుర్తింపుగా ఎమ్మెల్యేకు వాడపల్లి దేవస్థానం చైర్మన్, సభ్యుల సత్కారం.
- తిరునామం, పాదరక్షల భద్రత రుసుము పూర్తిగా రద్దు.





**ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట**

కోనసీమ తిరుమలగా పేరొందిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధికి మరో కీలక అడుగు పడింది. ఆలయంలో శ్రీనివాసం-2 నిర్మాణం కోసం రూ.12 కోట్ల టీటీడీ నిధుల విడుదలకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పాలకమండలి తీర్మానం చేయడంపై కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం వాడపల్లి దేవస్థాన పాలకమండలి సమావేశం అనంతరం దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు (గబ్బర్ సింగ్), పాలకమండలి సభ్యులు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు ఎమ్మెల్యేను కలిసి తీర్మానం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ, ఇందుకు కృషి చేసినందుకు ఆయనను ఘనంగా సత్కరించారు.

**పాలకమండలిలో కీలక నిర్ణయాలు**

పాలకమండలి సమావేశంలో భక్తుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని పలు ముఖ్య నిర్ణయాలు తీసుకున్నట్లు సభ్యులు ఎమ్మెల్యేకు వివరించారు. ఆలయంలో భక్తులకు తిరునామం పెట్టేందుకు వసూలు చేస్తున్న రుసుము, అలాగే పాదరక్షల భద్రత కోసం వసూలు చేస్తున్న రుసుమును పూర్తిగా రద్దు చేయాలని ఎమ్మెల్యే సూచించగా, దానిని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇకపై ఈ రెండు సేవలను ఉచి తంగా అందించాలని పాలకమండలి నిర్ణయించింది.

**భక్తులకు మరింత సౌకర్యం**

ఈ నిర్ణయంపై ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సంతోషం వ్యక్తం చేశారు. శ్రీనివాసం-2 నిర్మాణానికి టీటీడీ పాలకమండలి నిధుల మంజూరుకు తీర్మానం ఆమోదించడం ఆలయ అభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో నిర్ణయించిన టికెట్ ధరలు, ఇతర చార్జీలు యథాతథంగా కొనసాగుతున్నప్పటికీ, తిరునామం, పాదరక్షల భద్రత రుసుములను పూర్తిగా తొలగించడం వల్ల భక్తులకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడానికి కట్టుబడి ఉందని, భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

## వైసీపీలోకి కురసాల సతీష్ గ్రాండ్ ఎంట్రీ

వేగేశ్వరపురంలో 70 మంది యువకుల చేరిక



**ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి**

వేగేశ్వరపురంలోని కురసాల కన్వెన్షన్‌లో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న చేరికల కార్యక్రమంలో సుమారు 70 మంది యువకులు పార్టీలో చేరనున్నట్లు వైసీపీ సీనియర్ నాయకులు కొమ్మిరెడ్డి పరశురామారావు తెలిపారు. యువ నాయకుడు కురసాల సతీష్‌కు మద్దతుగా యువత పెద్దఎత్తున వైసీపీలోకి రావడం పార్టీకి కొత్త ఉత్సాహాన్ని ఇస్తుందన్నారు.కొవ్వూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ తలారి వెంకట్రావు నాయకత్వంలో కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. మాజీ మంత్రి కురసాల కన్నబాబు, జిల్లా అధ్యక్షులు చెల్లుబోయిన శ్రీనివాస్ వేణుగోపాలకృష్ణ తదితర ముఖ్య నాయకులు పాల్గొంటారని చెప్పారు.

## హామీ నెరవేర్చిన కూటమి నాయకులకు రజకుల కృతజ్ఞతలు

-చాకిరేవు చెరువుకు రహదారి నిర్మాణంపై అన్నదేవరపేట రజకుల హర్షం



**ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి**

ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు చాకిరేవు చెరువుకు రహదారి నిర్మించిన కూటమి నాయకులకు అన్నదేవరపేట రజక సోదరులు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో సుమారు 60 రజక కుటుంబాలు బట్టలు ఉతికి జీవనం సాగిస్తున్నాయని, చాకిరేవు చెరువుకు వెళ్లే రహదారి గతంలో తుప్పలతో అధ్వానంగా ఉండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని తెలిపారు.దాదాపు రెండు దశాబ్దాలుగా వివిధ పార్టీల నాయకులను రహదారి నిర్మించాలని కోరినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదన్నారు. 2024 ఎన్నికల ముందు కూటమి నాయకులను రహదారి కోసం కోరగా, హామీ ఇచ్చిన విధంగా రహదారి నిర్మించారని పేర్కొన్నారు.అయితే ఈ రహదారిని మద్యం దుకాణానికి వేశారంటూ కొందరు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని రజక సంఘం ప్రతినిధులు స్పష్టం చేశారు. దీనిపై టీడీపీ నాయకుడు కూచిపూడి గణపతి మాట్లాడుతూ ఎన్నికల ముందే రహదారి కోసం రజకులు కోరారని, ఎన్నికల అనంతరం మద్యం దుకాణాలు వచ్చాయని, ఈ రెండింటికీ ఎలాంటి సంబంధం లేదని తెలిపారు.గ్రామ అభివృద్ధిని చూసి కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వాటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు భారీ విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. తమ సమస్యల పరిష్కారానికి ముందుండే అల్లూరి విక్రమాదిత్యకు రజక సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు.

## నేటికీ 25 వేల మందికి యూజీ,పిజీ పట్టాలు.

మోడరన్ అధినేత డాక్టర్ లయిన్ జి.వి.రావు



**ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం**

రామచంద్రపురం మోడరన్ విద్యాసంస్థల డిస్టెన్స్ ఎడ్యుకేషన్ సెంటర్ ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటి ద్వారా గత 20 సంవత్సరాలుగా నేటికీ సుమారు 25 వేల మందికి డిగ్రీ, పీజీ పట్టాలు ప్రధానం చేశారు. ఈ అరుదైన నేపథ్యాన్ని పురస్కరించుకుని శుక్రవారం మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లయిన్ జి. వి. రావు గుంటూరులో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.గంగాధరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వీసీ గంగాధరరావుకి వెంకటేశ్వర స్వామి ప్రతిమను జి.వి. రావు అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నత చదువులు చదవాలనే అభ్యర్థులకు మోడరన్ విద్యాసంస్థల ద్వారా నిరంతరం సేవలు అందజేస్తున్న జి. వి.రావు అభినందనీయులని వీసీ గంగాధర రావు కొనియాడారు.

# వాడపల్లి ధర్మకర్తల మండలి సమావేశంలో కీలక తీర్మానాలు

- వాడపల్లి శ్రీనివాసం-2కు రూ.12 కోట్ల టీటీడీ నిధుల తీర్మానం పై పాలకమండలి సభ్యులు హర్షం.
- దాతలకు కొత్త దర్శన విధానం, బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు.



**ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట**

కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థాన ధర్మకర్తల మండలి సమావేశంలో దేవస్థానం అభివృద్ధికి సంబంధించిన పలు కీలక తీర్మానాలకు ఆమోదం లభించింది. దేవస్థాన కార్యనిర్వాహణాధికారి కార్యాలయంలో చైర్మన్ ముదునూరి వెంకటరాజు (గబ్బర్ సింగ్) అధ్యక్షతన, ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర రావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో అత్యంత ప్రాధాన్యంగా శ్రీనివాసం-2 భవనం నిర్మాణానికి టీటీడీ ద్వారా రూ.12 కోట్ల నిధులు మంజూరు కావడంపై హర్షం వ్యక్తం చేస్తూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, టీటీడీ బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూ, టీటీడీ ధర్మకర్తల మండలికి కృతజ్ఞతలు తెలుపుతూ ఏకగ్రీవ తీర్మానం చేశారు.

**సమావేశంలో కీలక నిర్ణయాలు**

దేవస్థానానికి చెందిన వివిధ లీజుల టెండర్లకు ఆమోదం, కోనేరు పడమర గేటు వద్ద రెండు ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్, జూన్ 1 నుంచి ఆగస్టు 31, 2025 వరకు జమా-ఖర్చుల లెక్కలను పరిశీలించి ఆమోదం, భక్తులకు ఇబ్బందిగా మారిన శ్రీనివాసం ప్రాంగణంలోని జలప్రసాదం వద్ద ఉన్న నాలుగు జ్యూస్ షాపులు, రెండు నర్సరీల లీజుల రద్దు, దేవస్థాన ఇనాం భూముల ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయం.

**దాతలకు కొత్త దర్శన విధానం**

డోనర్ కార్డు కలిగిన దాతలకు ఇకపై శనివారానికే పరిమితం కాకుండా మిగిలిన అన్ని రోజులలో కూడా దర్శన సౌకర్యం కల్పించాలని మండలి నిర్ణయించింది. అయితే దాతతో పాటు కుటుంబ సభ్యులు కలిపి గరిష్ఠంగా పది మందికి మాత్రమే దర్శనానికి అనుమతి ఉంటుంది. ఇందుకోసం ముందుగా పి.ఆర్.ఓ కార్యాలయంలో డోనర్ కార్డు చూపించి జీరో టికెట్ పొందాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు.

**అక్టోబర్ 29 నుంచి బ్రహ్మోత్సవాలు**

అక్టోబర్ 29 నుంచి నవంబర్ 6, 2026 వరకు తొమ్మిది రోజులపాటు నిర్వహించే వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టాలని ధర్మకర్తల మండలి నిర్ణయించింది. ఈ సమావేశంలో ధర్మకర్తల మండలి సభ్యులు, ఎక్స్-అఫీషియో సభ్యుడు వాడపల్లి సుందర శేషావతారంతో పాటు ఇతర సభ్యులు పాల్గొన్నారు. దేవస్థానంలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన తీర్మానాలకు సమావేశం ఆమోదం తెలిపింది.

# సత్తా చూపిద్దాం- కూటమి ధర్మం పాటిద్దాం : ప్రభుత్వ విప్ బొలిశెట్టి

**ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం.**

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ధర్మాన్ని పాటిస్తూ జనసేన పార్టీ సత్తా చూపిద్దామని ప్రభుత్వ విప్ అమలాపురం పార్లమెంటరీ స్థానిక సంస్థల సమన్వయ కమిటీ ఇన్చార్జి బొలిశెట్టి శ్రీనివాసరావు జనసేన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం రామచంద్రపురం నియోజకవర్గ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కమిటి సమావేశం రామచంద్రపురంలో చందమామ గ్రాండ్ నందు జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మన జనసేన బలం ఎక్కడైతే ఉందో అక్కడ మనం పోటీ చేస్తున్నామని, అలాగే టిడిపికి బలమున్నచోట వాళ్లకి ఇద్దామని ఇందుకోసం పార్టీ శ్రేణులు అంతా కూటమి ధర్మం పాటిస్తూ ఐకమత్యంతో పనిచేయాలని బొలిశెట్టి పిలుపునిచ్చారు . అలా కాదని ధర్మం తప్పితే మన నాయకుడు పవన్ కళ్యాణ్ చెప్పింది చేద్దామని అన్నారు. అందరూ కలిసి పనిచేస్తేనే విజయం సాధిస్తామని ఆయన పేర్కొన్నారు. యువతకు అండగా పవన్ కళ్యాణ్ ఉన్నారని ఆయన తోపాటు మేము ఉన్నామని పార్టీ శ్రేణులు ఏ విధమైన



నిరాశకు గురికాకుండా పనిచేయాలని పిలుపునిచ్చారు. జన సైనికులు పదవికోస పని చేయరని పార్టీ పట్ల నిబద్ధతో పని చేస్తున్నారని కనీసం గౌరవ మర్యాదలు ఇవ్వాలని అన్నారు. పవన్ కళ్యాణ్ తీసుకున్న నిర్ణయం పట్ల రాష్ట్ర ప్రజలకు మంచి జరిగిందా లేదా అని ఆలోచించాలే తప్ప పదవులు ముఖ్యం కాదని బొలిశెట్టి అన్నారు. రాష్ట్రంలో ఏడు వేల కిలో మీటర్ల రహదారుల నిర్మాణం జరిగిందని, ఇందుకోసం పవన్ కళ్యాణ్ రాజీలేని పోరాటం చేస్తున్నారని, 24వ స్థానంలో ఉన్న పంచాయతీరాజ్ వ్యవస్థను ప్రథమ స్థానంలో తీసుకొచ్చిన ఘనత పవన్ కళ్యాణ్ కి దక్కిందన్నారు. పోలవరాన్ని వచ్చే సంవత్సరం జాతికి అంకితం చేస్తారని, లెఫ్ట్ కెనాల్ కు నీరు ఇచ్చామని, అమరావతి నగర నిర్మాణాన్ని కొనసాగిస్తున్నామని, వెలుగొండ వెలుగొండ ప్రాజెక్టు ఓపెన్ చేసామని, జగన్ హయాంలో విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మకానికి పెడితే ఆఫ్ చేసి కూటమి ప్రభుత్వం వచ్చాక లాభాల బాటలో తీసుకొచ్చామని, వీటన్నీటిలో మన భాగస్వామ్యం ఉందని ఆయన పేర్కొన్నారు. అయితే ఇదంతా మాదే మీరెంత అన్న డైలాగులు చాలా చోట్ల టిడిపి నాయకులు ద్వారా వినిపిస్తున్నాయని అలాంటివి మానుకొని ఐకమత్యంతో కూటమి శ్రేణులంతా కలిసికట్టుగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. కొంతమంది టిడిపి నాయకులు చేస్తున్న దుష్ప్రచారాన్ని చంద్రబాబు దృష్టికి మీడియా ద్వారా తీసుకువెళ్లాలని బొలిశెట్టి కోరారు. ఇప్పటికే జనసేన చాలా నష్టపోయిందని ఇకమీదట నష్టపోయేది ఏమీ లేదని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. పార్లమెంటు సమన్వయకర్త బండారు శ్రీనివాస్ మాట్లాడుతూ జనసేన బలమున్నచోట్ల ఖచ్చితమైన పెర్ఫార్మెన్స్ ఇవ్వాలని అలా ఇచ్చినట్లయితే నూటికి నూరు శాతం గెలుపొందుతామని అన్నారు. స్థానిక సంస్థల్లో బలపరుచుకోవడంతో భవిష్యత్తులో ముందుకు వెళ్ళగలమని ఈ ఎన్నికలు మనకు మంచి అవకాశం అన్నారు. దీంతో జన సైనికుల చిరకాల కోరికైనా పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రిగా చూసే అవకాశం త్వరలో రాబోతుందని ఆయన అన్నారు. ఇందుకోసం ఆయనని ముఖ్యమంత్రిగా చేసేదాకా విశ్రమించకూడదని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ రాజకీయ అవకాశాలు కోరుకునే వాడు కాదని ఒక ఆలోచనతో రాష్ట్ర భవిష్యత్తు కోసం పనిచేస్తూ ప్రజల కోసం సేవ చేసేందుకు వచ్చిన నాయకుడని అని అన్నారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం నియోజకవర్గ ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ సమన్వయ కమిటీ సభ్యులు లకాని కృష్ణ చైతన్య, అమలాపురం పార్లమెంటు కమిటీ సభ్యురాలు ముత్యాలు జయలక్ష్మి, జనసేన నాయకులు దేగల నాగేంద్ర, చిక్కాల దొరబాబు, బంగా్రరాజు, తదితరులు తమ తమ అభిప్రాయాలను సమావేశంలో తెలియజేశారు. జనసేన యువ నాయకులు దేగల నాగేంద్ర ఆధ్వర్యంలో గొల్లపాలెం తిరుమల ఫంక్షన్ హాల్ నుండి భారీ మోటార్ సైకిల్ ర్యాలీతో రామచంద్రపురం బయలుదేరి వెళ్ళింది దీంతో ఆర్యాలీ ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. ఈ సమావేశానికి కొండ్రెడ్డి శ్రీనివాస్, బొండా వెంకన్న, శ్రీహరి పంతులు, నియోజకవర్గ నలుమూలల నుండి భారీ స్థాయిలో జనసేన శ్రేణులు హాజరయ్యారు.

## మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు -2026 మండల టాపర్స్ గా విక్టోరియా మాంటిసోరి హై స్కూల్ విద్యార్థులు



**ప్రజా భూమి ప్రతినిధి-కూనవరం**

మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు -2026 లో భాగంగా 11/09/2026 శుక్రవారం జరిగిన మండల స్థాయి చెకుముకి సైన్స్ పరీక్షలకు 8 పాఠశాల నుండి విద్యార్థులు హాజరు కాగా అత్యధికముగా మార్కులు సాధించిన విక్టోరియా మాంటిసోరి హై స్కూల్ విద్యార్థులు వల్లాల సాయి ప్రతిభ (10వ తరగతి) షేక్ అబ్దుల్ అహద్ (9వ తరగతి) పల్లంటి మార్క్ సత్య (8వ తరగతి )ఈ ముగ్గురు విద్యార్థులు చెకుముకి సైన్స్ మండల స్థాయి పోటీలో ప్రతిభ చాటి జిల్లా స్థాయి పోటీలో అర్హత సాధించారు. ఈ ముగ్గురు విద్యార్థిని, విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ విక్కిసింగ్, వైస్ ప్రిన్సిపాల్ రూబీ సింగ్, విక్టోరియా సింగ్,సూపర్ వైజర్ రాజ్ , ఆఫీస్ స్టాఫ్ సంధ్య , మహేష్ ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

## వినాయకుడి ఆకృతిలో అలరించిన సన్ లైట్ విద్యార్థులు

**ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి**



మండలంలో అన్నదేవరపేట సన్‌లైట్ హైస్కూల్‌లో విద్యార్థుల ఆధ్వర్యంలో ఎకో ఫ్రెండ్లీ వినాయ క చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా వేడుకల్లో పాలొని, వినాయకుని ప్రతిమకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు వినాయకుని ఆకారంలో చేసిన ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని పాఠశాల కరస్పాండెంట్ సిద్దు సూచించారు. పర్యావరణానికి హాని కలగకుండా పండుగలను నిర్వహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన పేర్కొన్నారు.

## కుందులూరులో సామూహిక వరలక్ష్మి వ్రతాలు



**ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం.**

గూడూరు చారిటబుల్ ట్రస్ట్, హైద్రాబాద్ వారి సౌజన్యంలో మండలంలోని కుందులూరు గ్రామం వద్ద శుక్రవారం శ్రావణ శుక్రవారం సందర్భంగా, సామూహిక వరలక్ష్మి వ్రతాలను నిర్వహించారు. ఈ సామూహిక వ్రతంలో దీక్షతో గ్రామంలోనీ 40మంది మాతృమూర్తులు, పాల్గొని భక్తి శ్రద్దలతో కార్యక్రమం నిర్వహించినారు. వ్రతంలో పాల్గొన్న మహిళకు, ట్రస్ట్ తరుపున, పూజ సామాగ్రి, బటువు, చీర, జాకెట్, ప్రసాదాలు, పంపిణి చేయటం, తదనంతరం, వ్రత విశిష్టత, సనాతన ధర్మ ఔనత్యం, గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నోముల రామారావు, బిజెపి జిల్లా వైస్ ప్రెసిడెంట్, నామాల శ్రీనివాసరావు, గెద శ్రీనివాస్ (సామాజిక కార్యకర్త ) గ్రామ పెద్ద, రాజబాబు, పటేల్, తదితరులు పాల్గొన్నారు.

## మండలస్థాయి చెకుముకి సంబరాలు విజయవంతం జనవిజ్ఞాన వేదిక.



**ప్రజా భూమి ప్రతినిధి-కూనవరం**

మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిచ్చడి. అప్పారావు పరివేక్షణలో మండలస్థాయి చెకుముకి సంబరాలు నిర్వాహకులు పి. భవాని చిచ్చడి. చంద్రావు సమక్షంలో విజయవంతంగా నిర్వహించడం జరిగింది.తదనంతరం పాఠశాల స్థాయి మండల స్థాయి చెకుముకి సంబరాలల్లో పాల్గొన్న విద్యార్థులకు జనవిజ్ఞాన వేదిక పోలవరం జిల్లా తరుపున చెకుముకి సైన్స్ సంబరాలు -2026 కు సంబంధించిన సర్టిఫికెట్స్ మండల అభివృద్ధి అధికారి ఎంపీడీవో ఎస్. ఆశీర్వాదం చేతులు మీదుగా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు చేతుల్లో జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి పి. కన్నారావు చేతులు మీదుగా విద్యార్థులకు పంపిణి చేయడం జరిగింది. ప్రభుత్వ యాజమాన్యం నుండి ఉన్నత పాఠశాల మండల స్థాయి మొదటి రాగ ప్రైవేట్ యాజమాన్యం నుండి విక్టోరియా మాంటీస్సోరి మొదటి స్థానంలో వచ్చాయి. మండలస్థాయి మొదటి స్థానం పొందిన విద్యార్థులు సెప్టెంబర్ 27న జిల్లా స్థాయిలో రంపచోడవరం జరిగే చెకుముకి సంబరాల్లో పాల్గొన్నడం జరిగుతుందని జనవిజ్ఞాన వేదిక పోలవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.కన్నారావు ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమంలో లచ్చిరెడ్డి రేపాక ఆశ్రమ పాఠశాల టీచర్ లచ్చిరెడ్డి,ఎపి.ఆర్.ఎస్.టీచర్ వరుధినీ,నర్సింగపేట టీచర్ దేశయ్య, కాస్తూరి బా గాంధీ విద్యాలయం టీచర్, జడ్పీహెచ్ఎస్.మర్రిగూడెం సిబ్బంది,విజయసాధన టిచర్,విక్టోరియా మాంటీస్సోరి టీచర్ మహేష్ తదితరులు పాల్గోన్నారు.

## చెకుముకి ప్రతిభ పరీక్షల్లో స్వర్ణభారతి విద్యార్థుల ప్రతిభ

-మండలస్థాయిలో ద్వితీయ స్థానం కైవసం

**ప్రజాభూమి ప్రతినిధి-జతాళ్లపూడి**



కొవ్వూరులోని జడ్పీహెచ్ హైస్కూల్‌లో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముకి ప్రతిభ పరీక్షల్లో ధర్మవరం స్వర్ణ భారతి స్కూల్ విద్యార్థుల బృందం మండలస్థాయిలో ద్వితీయ స్థానం సాధించింది. విద్యార్థులు ఇల్లూరి రేష్మ, తాడి భార్గవ్, సత్యం యుగంధర్ ప్రతిభ కనబరిచి పాఠశాలకు ద్వితీయ స్థానం సాధించి పెట్టారు.విజయం సాధించిన విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయిని సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. విద్యార్థుల ప్రతిభను స్వర్ణభారతి స్కూల్ కరస్పాండెంట్ పేరిచర్ల రామకృష్ణరాజు, ఉపాధ్యాయులు అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ప్రజాభూమి
జనరల్
14
శనివారం 12 సెప్టెంబరు 2026

## స్థానిక సమరంలో కూటమి గెలుపే లక్ష్యం



ఏలూరు

స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ,జనసేన,బీజేపీ కూటమి అభ్యర్థులను సమన్వయంతో బరిలోకి దించి ఘన విజయం సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఏలూరు జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల అబ్జర్వర్,ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ తెలిపారు.ఏలూరు పవర్‌పేటలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం కూటమి సమన్వయ కమిటీల సమావేశం నిర్వహించారు.సమావేశానికి పంచుమర్తి అనురాధ ముఖ్య అతిథిగా హాజరై, స్థానిక ఎన్నికల్లో మూడు పార్టీల మధ్య సమన్వయం, అభ్యర్థుల ఎంపిక,ఎన్నికల వ్యూహాలపై నాయకులతో చర్చించారు.ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలకు ప్రజల మద్దతు ఉందని,స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కూటమి విజయకేతనం ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ అభ్యర్థుల ప్రకటన నుంచి విజయం సాధించే వరకు మూడు పార్టీలు ఐక్యంగా పనిచేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు.ఎన్నికల్లో అవసరాన్ని బట్టి సమన్వయంతో ముందుకు సాగి కూటమి ఐక్యతను చాటుతామని చెప్పారు.సమావేశంలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్,గన్ని వీరాంజనేయులు,రెడ్డి అప్పలనాయుడు, బొరగం శ్రీనివాస్,ఘంటసాల వెంకటలక్ష్మి,జగ్గవరపు ముత్తారెడ్డి తదితర టీడీపీ, జనసేన,బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా ప్రెస్ క్లబ్



ప్రజా భూమి ప్రతినిధి–ఆగిరిపల్లి

శ్రీ లక్ష్మీనరసింహ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం సభ్యుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పెనుముచ్చు శేఖర్, ఉపాధ్యక్షులుగా సంగా శ్రీనివాసరావు, కె.వి.ఎస్.ఎస్. రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ముసునూరు సతీష్ ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా ఆర్.వి.ఎన్. రాజశేఖర్, గౌరవ సలహా అధ్యక్షులుగా ఎస్.ఎస్. బాబు, మంగళపూడి నాగేశ్వరరావు, కోశాధికారిగా టీవీఎస్. కిరణ్, కార్యదర్శిగా వంగా రవికుమార్, సహాయ కార్యదర్శులుగా బండారు రామకృష్ణ, సయ్యద్ రషీద్ బాబు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా బెజవాడ శ్రీనివాసరావు, సముద్రాల సత్యనారాయణ, స్వామి, ఏ.శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ పాత్రికేయుల ఐక్యత, సంక్షేమం, హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ ప్రెస్ క్లబ్‌ను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు పాత్రికేయుల వృత్తిపరమైన సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషి చేస్తామని పేర్కొన్నారు.

## కొంతేరు గ్రామంలో కలుషిత నీరు సరఫరా

ప్రజాభూమి ప్రతినిధి–పాలకొల్లు



పాలకొల్లు నియోజకవర్గం యలమంచిలి మండలం కొంతేరు గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా మారింది. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి గ్రామంలో ఆకుపచ్చగా, దుర్వాసనతో కూడిన నీటిని సరఫరా చేస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.తాగునీటి చెరువులోకి పంచాయతీ అధికారులు కలుషిత నీటిని తోడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. దీంతో చెరువులోని నీరు రంగు మారి, తాగడానికి పనికిరాకుండా మారిందని చెబుతున్నారు. ఈ నీటిని వినియోగించడం వల్ల ప్రజలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.గ్రామంలోని చిన్నారులు, వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారు. నీటిని మరిగించి ఉపయోగించినా దుర్వాసన తగ్గడం లేదని స్థానికులు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు వెంటనే నీటి నమూనాలను సేకరించి ప్రయోగశాలలో పరీక్షలు నిర్వహించాలని, కలుషిత నీటి సరఫరాను నిలిపివేసి ప్రత్యామ్నాయంగా శుద్ధి చేసిన తాగునీటిని అందించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.తాగునీటి చెరువులోకి కలుషిత నీరు చేర కుండా చర్యలు తీసుకోవడంతో పాటు, చెరువును శుభ్రపరచి క్రిమి సంహారక చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. దానికి తోడు తాగునీటి చెరువుగట్టుపైనే గడ్డి మెట్లు వేసిన చూసి చూడనట్లు పోతున్నారని ఆరోపిస్తున్నారు సమస్యను పరిష్కరించకపోతే పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

## రోడ్డు మీదే ప్రవహిస్తున్న మురుగునీరు

ప్రజాభూమి ప్రతినిధి–పెదపాడు.



గ్రామం పరిశుభ్రంగా ఉండాలి అనే ప్రభుత్వ నినాదం, అధికారుల అలసత్వం వల్ల నీరు కారుతోంది. దీంతో గ్రామాల్లో ఒక్కొక్క ప్రాంతంలో రోడ్ల మీదే ములుగు నీరు ప్రవహించి ప్రయాణికులు అవస్థలకు గురవాల్సిన పరిస్థితి గ్రామాల్లో నెలకొంటున్నాయి. ఏలూరు జిల్లా పెదపాడు మండలం కొత్తూరు గ్రామంలో రోడ్లపై మురుగునీరు ప్రవహించుతున్నతో ప్రయాణించే వారు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇళ్లల్లో నుంచి వస్తున్న మురుగునీరు పోవడానికి సరైన డ్రైనేజీ లేకపోవడంతో రోడ్ల మీదే నీరు ప్రవహిస్తూ దుర్వాసనలు వస్తున్నాయి. గ్రామపంచాయతీ అధికా రులకు అనేక సార్లు చెప్పిన ఎటువంటి ప్రయోజనం లేదని స్థానికులు తెలిపారు.అధికారులు ఉన్న పరిస్థితులను గమనించి మురుగునీరు ప్రవహిస్తున్న ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రయాణికులకు సరైన రహదారి మార్గాన్ని అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రామస్తులు కోరుకుంటున్నారు.

# గణేష్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించాలి

- మండపాల ఏర్పాటుకు ముందస్తు అనుమతులు తప్పనిసరి.
- విగ్రహాలను ప్రశాంతంగా తీసుకురావాలి.
- శాంతిభద్రతలకు, ట్రాఫిక్‌కు విఘాతం కలిగించే చర్యలను ఉపేక్షించం.
- ఏలూరు జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్.

ప్రజాభూమి ప్రతినిధి–ఏలూరు జిల్లా.

రానున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు, నిర్వాహకులు ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని జిల్లా కె.ప్రతాప శివ కిషోర్ సూచించారు. ప్రజల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ, మతసామరస్యాన్ని దృష్టిలో ఉంచుకుని పోలీసు శాఖ సూచించే నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని కోరారు.

**విగ్రహాలను ప్రశాంతంగా మండపాల వద్దకు తీసుకురావాలి**

గణేష్ విగ్రహాలను మండపాల వద్దకు తీసుకువచ్చే సమయంలో ఎలాంటి ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించకుండా ప్రశాంతంగా తీసుకురావాలని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు. విగ్రహాలను తీసుకువచ్చే పేరుతో అధిక సంఖ్యలో ప్రజలను సమీకరించడం, రహదారులపై ట్రాఫిక్‌కు లేదా ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగించే విధంగా వ్యవహరించడం చేయరాదన్నారు.విగ్రహాల తరలింపు సమయంలో ఇతరులను రెచ్చగొట్టే విధంగా నినాదాలు, పాటలు లేదా కార్యక్రమాలు నిర్వహించరాదని, కుల, మత, వర్గ విభేదాలకు దారితీసే చర్యలకు పాల్పడరాదని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఏ చర్యనైనా ఉపేక్షించబోమని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**మండపాల ఏర్పాటుకు ముందస్తు అనుమతులు తప్పనిసరి**

వినాయక చవితి సందర్భంగా విగ్రహాలను ప్రతిష్ఠించే ఉత్సవ కమిటీలు వెబ్‌సైట్‌లో తమ వివరాలు, విగ్రహం ప్రతిష్ఠించే ప్రదేశం, సంబంధిత పత్రాలను సమర్పించి ముందస్తు అనుమతి పొందాలి. అనుమతి పొందిన వారు మాత్రమే విగ్రహాలను ఏర్పాటు చేయాలని సూచించారు.పబ్లిక్ స్థలంలో మండపం ఏర్పాటు చేయాలంటే సంబంధిత గ్రామ పంచాయతీ లేదా మున్సిపాలిటీ నుంచి అనుమతి పొందాలి. ప్రైవేట్ స్థలంలో మండపం ఏర్పాటు చేస్తే స్థల యజమాని అనుమతి తప్పనిసరిగా కలిగి ఉండాలి. విద్యుత్ శాఖతో పాటు అవసరమైన ఇతర సంబంధిత శాఖల నుంచి అవసరమైన అనుమతులు ముందుగానే తీసుకోవాలని తెలిపారు.ప్రజల రాకపోకలకు, వాహనాల ప్రయాణానికి ఆటంకం కలిగించే విధంగా రహదారులను ఆక్రమించి



మండపాలు ఏర్పాటు చేయరాదని, వివాదాస్పద స్థలాల్లో మండపాలు ఏర్పాటు చేయకుండా నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

**భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి**

ఉత్సవాల సందర్భంగా మండపాల వద్ద భద్రతా ఏర్పాట్లను పటిష్ఠంగా చేపట్టాలని జిల్లా ఎస్పీ సూచించారు. మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు, ఉత్సవాలు పూర్తయ్యే వరకు ఉత్సవ కమిటీ సభ్యులు అందుబాటులో ఉండేలా బాధ్యతలను కేటాయించుకోవాలని తెలిపారు.ప్రజారోగ్యం, శాంతిభద్రతలు, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా డీజేలు, అధిక శబ్దంతో కూడిన సౌండ్ సిస్టమ్స్ వినియోగించరాదని, బాణాసంచా కాల్చరాదని స్పష్టం చేశారు. మండపాల వద్ద భక్తి సంబంధిత పాటలు మాత్రమే ప్రసారం చేయాలని సూచించారు.మండపాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు విద్యుత్ ప్రమాదాలకు అవకాశం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, సంబంధిత శాఖల సూచనలు, భద్రతా ప్రమాణాలను పాటించాలని తెలిపారు.ఉత్సవ కమిటీలు తమ సభ్యుల వివరాలను ముందుగానే నమోదు చేసుకుని, వారికి బాధ్యతలను కేటాయించుకోవాలని, ఎటువంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా పోలీసు శాఖతో సమన్వయంతో వ్యవహరించాలని ఎస్పీ సూచించారు.

**శాంతి, మతసామరస్యానికి ప్రాధాన్యత**

గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తి, సోదరభావం, మతసామరస్యానికి ప్రతీకగా నిలిచేలా నిర్వహించాలని జిల్లా ఎస్పీ అన్నారు. ఇతర మతాలు, వర్గాల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించరాదని, వివాదాస్పద ప్రసంగాలు, రెచ్చగొట్టే నినాదాలు లేదా ఇతర చర్యలకు పాల్పడరాదని సూచించారు.నిబంధనలను ఉల్లంఘించి అవాంఛనీయ సంఘటనలకు కారణమయ్యే ఉత్సవ కమిటీలు, నిర్వాహకులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టం చేశారు.ఏలూరు జిల్లాలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా పోలీసు శాఖ తరఫున అవసరమైన భద్రతా చర్యలు చేపడుతున్నామని, ప్రజలందరూ పోలీసు శాఖకు సహకరించి భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో ఉత్సవాలను నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ కె.ప్రతాప శివ కిషోర్ కోరారు.

# ఏలూరు జిల్లాలో దారుణం...మైనర్ బాలికకు వివాహం

- 6 నెలలకి మృత శిశువు జననం.
- మృత్యుతో పోరాడుతున్న బాలిక.

ప్రజా భూమి ప్రతినిధి–ఏలూరు జిల్లా

తల్లిదండ్రుల అమాయకత్వం ప్రభుత్వం ఉద్యోగుల బాధ్యతరాహిత్యానికి ఒక అభాగ్యురాలు మృత్యువుతో పోరాడుతోంది. తెలిసి తెలియని ప్రసితనంలో వివాహం జరిపించి చేతులు దులుపుకున్న తల్లిదండ్రులు, వాళ్లకు సహకరించిన ఉద్యోగులు ఏ నిమిషానికి ఏ ప్రమాదం జరుగుతుందోనని తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఏలూరు జిల్లా పెదవేగి మండలం కొప్పాక గ్రామంలో జరిగిన సంఘటన. ఏలూరు జిల్లా పరిధిలో గల ఓ ప్రయివేట్ కార్పొరేట్ ఆసుపత్రిలో ఓ మైనర్ బాలింత మృత్యువుతో పోరాడుతున్నట్టు వార్తలు గుప్పుమంటున్నాయి.పెదవేగి మండలం కొప్పాక గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలిక ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుండగా ఆ బాలిక తండ్రిని కాదని తల్లి ,అమ్మమ్మ ,తాతయ్య లుఆ బాలికకు బాల్య వివాహం చేశారని సమాచారం,వివాహాన్ని అడ్డుకోమని సంబంధిత అధికార యంత్రాలంగానికి బాలిక తండ్రి గ్రామ పెద్దలు ద్వారా చెప్పించినా పట్టించుకోకపోగా ఆ అధికారులు బాలిక తల్లికి కొప్పాకలో కాకుండా దూరంగా వేరే ప్రాంతం లో పెళ్లి చేసుకోండి మాకు సంబంధం లేకుండా ఉంటుందని సలహా ఇచ్చినట్టు బాలిక తండ్రి, గ్రామ పెద్దలు గత వారం రోజులుగా చర్చించుకుంటున్నట్టు సమాచారం,ఏదైతేనేం మైనర్ బసలికకు తల్లి ,తాత ,అమ్మమ్మ దగ్గరుండి పెళ్లి చేసారు అనేది వాస్తవమని అనుకుంటున్నారు. వివాహమైన కొద్ది నెలలకే బాలిక గర్భవతి అయ్యి నెలలు నిండకుండానే మృత శిశువుకు జన్మనిచ్చింది.

ఆ బాలిక ఆరేడు నెలలు శిశువును గర్భం లో మోసిన బిడ్డ దక్కలేదు.సరికదా ఆ మైనర్ బాలింత కు ఆరోగ్యం సహకరించక ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడుతున్నట్టు గ్రామస్తులు చెబుతున్నారు,బాల్య వివాహం అనంతరం బాలిక తల్లి కొప్పాక గ్రామం నుండి ద్వారాకా తిరుమల మండలం జాజులకుంట గ్రామం లో తన బంధువుల ఇంట్లో ఉంటుందని సమాచారం,అప్పట్లో ద్వారకా తిరుమల లో కూడా బాల్య వివాహం పై అధికారుల పిర్యాదు కూడా చేసినా ఫలితం లేకుండా పోయిందని బాలిక తండ్రి కొప్పాకలో గ్రామ పెద్దలను ఆశ్రయించి నట్టు సమాచారం, బాల్య వివాహాశీ తెలిసికూడా అడ్డుకోకుండా నిర్లక్ష్యం వహించిన అధికారు లెవరు,నెలలు నిండకుండా మృత బిడ్డకు జన్మనిచ్చి మృత్యువుతో ఆసుపత్రిలో పోరాడుతున్న మైనర్ బాలింత ప్రాణాలు కాపాడేవారు ఎవరు,ఈ ఘటనలో బాధ్యులు ఎవరు ఏ ఏ శాఖలు భాధ్యతలు వహించాలి, ఎందుకు భాధ్యత రహితంగా వ్యవహరించారు అనే ప్రశ్నలు కొప్పాక గ్రామం లో వినిపిస్తున్నాయి,ఈ ఘట న పై ఏ శాఖ స్పందిస్తుందో ఏ శాఖల పై చర్యలు చేపడతారో వేచి చూడాలి అని కొప్పాక గ్రామ ప్రజలు చర్చించుకుంటు న్నారు.

ఇక్కడ ఇంకో సంఘటన ఏంటంటే మైనర్ బాలిక సొంత బంధువుకూడా పెదవేగి మండలంలో ఓ గ్రామం లో ఆశా వర్కర్ అని సమాచారం, ఈ బాల్య వివాహం లో ఆమె కూడా ఓ పాత్రదారి అని కొప్పాక గ్రామం లో ప్రజలు చెప్పుకుంటున్నారు. వివాహమైన ఆ మైనర్ బాలిక మృత్యువును జయించి హాస్పటల్ నుంచి డిశ్చార్జ్ అయిన తర్వాత ఏ అధికారులు ఈ సంఘటనలో ప్రధాన పాత్ర పోషించారో అప్పుడే కానవస్తుంది.

## పదివేల విఘ్నేశ్వరుని మట్టివిఘ్నాలు, విగ్నేశ్వరుని పూజా పుస్తకాలు పంపిణీ చేసిన పిప్పళ్ళ సుప్రజ

ప్రజాభూమి ప్రతినిధి–పాలకొల్లు

రాబోయే వినాయక చవితి సందర్భంగా నరసాపురం నియోజకవర్గంలో పదివేల మట్టి వినాయకుని విఘ్నాలుతో పాటు వినాయకుని పూజ పుస్తకాలు నరసాపురం పట్టణానికి చెందిన సోషల్ వర్కర్ పిప్పళ్ళ సుప్రజ ఆమె భర్త సురేష్ బాబు సహకారంతో గత మూడు రోజుల నుండి భక్తులకు వివిధ గ్రామాల్లో పంపిణీ కార్యక్రమం చేపట్టారు శుక్రవారం పసలదివి గ్రామంలో భక్తులకు మట్టి వినాయకుడి ప్రతిమలు పూజా పుస్తకాలు అందజేశారు ఈ సందర్భముగా ఆమే విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో వినా



యక చవితి పండుగ జరుపుకోవాలని అలాగే కలుషితం లేని మట్టి వినాయకుని పూజిస్తే పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందని అన్నారు అలాగే ప్రతి సంవత్సరం నర్సాపూర్ నియోజకవర్గంలో వివిధ గ్రామాల్లో వినాయకుని మట్టి విగ్రహాలు భక్తులకు ఇవ్వడం జరుగుతుంద అన్నారు గత మూడు రోజుల నుండి వినాయకుడి విగ్రహాలు పంచిపెట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు గ్రామాల్లో ధనిక పేద తేడా లేకుండా మట్టి వినాయకుడు ప్రతిమలు మరియు పూజా పుస్తకములు ప్రతి ఒక్కరు తీసుకోవడం చాలా సంతోషకరమని ఆమె అన్నారు ఆమె ఇలా సేవా కార్యక్రమం చేసినందుకు వివిధ గ్రామ ప్రజలు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో పిప్పళ్ళ రేషిక, పిప్పళ్ళ సాంబావి, అంబిక, సోషల్ వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు

## స్పోర్ట్స్అండ్ గేమ్స్ క్విజ్ పోటీలు

ప్రజాభూమి ప్రతినిధి–నూజివీడు

నూజివీడుమండలం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల అన్నవరంలో విద్యార్థినీ విద్యార్థులకు ఆటలు, మరియు క్రీడలు లో క్విజ్ పోటీలు నిర్వహించామని పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు రవీంద్ర తెలిపారు.

ప్రధమబహుమతి ఎనోష్, జయకృష్ణ, తనూజ్, అశ్వంత్, ఆనంద్, అఖిల్.ద్వితీయ బహుమతి భరత్ కుమార్, అభినయ్, కిరణ్, హిమవంత్, ఆకాష్, రాజు. క్విజ్ నిర్వహణ జీవశాస్త్ర ఉపాధ్యాయులు దుర్గామల్లేశ్వరరావు నిర్వహించారు. బహుమతులను భోగిప్రసాద్ మాష్టారు స్పాన్సర్ చేశారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయనీ ఉపాధ్యాయులు మరియు వ్యాయామ ఉపాధ్యాయులు రవీంద్ర పాల్గొన్నారు.

## అటవీ శాఖ కార్యాలయంలో ఘనంగా 'జాతీయ అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం

ప్రజా భూమి ప్రతినిధి–ఏలూరు జిల్లా.

ప్రకృతి సంపదను, వన్యప్రాణులను కాపాడే క్రమంలో అటవీ శాఖ సిబ్బంది చేసిన త్యాగాలు వెలకట్టలేనివని జిల్లా అటవీ శాఖాధికారి పి .వి. సందీప్ రెడ్డి చెప్పారు. ఏలూరు జిల్లా అటవీ శాఖ అధికారి కార్యాలయంలో 'జాతీయ అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని' శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీ అమరవీరుల త్యాగాలను మననం చేసుకుంటూ ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డిఎఫ్ ఓఓ సందీప్ రెడ్డి మాట్లాడుతూ అటవీ అమరవీరుల ఆదర్శాలను, కర్తవ్య నిష్ఠను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని అటవీ శాఖ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.అనంతరం అమర వీరుల స్మారకార్థం అటవీ శాఖ సిబ్బందితో



కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అదేవిధంగా, ఏలూరు డివిజన్ పరిధిలోని ఏడు అటవీ రేంజ్ లలో కూడా సంబంధిత రేంజ్ అధికారులు, సిబ్బంది అటవీ అమర వీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి, ర్యాలీలు నిర్వహించారు.

# నిర్దేశించిన లక్ష్యాలు పూర్తి చేయాలి

### మున్సిపల్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించిన మంత్రి ఓ ఎస్ డి ప్రకాష్ రావు

ప్రజాభూమి ప్రతినిధి–నూజివీడు

నూజివీడు మున్సిపల్ కార్యాలయంలో నాలుగు మండలాల ఎంపీడీఓ లు, విజన్ యాక్షన్ ప్లాన్ సిబ్బంది, మున్సిపల్ కమిషనర్ మరియు మున్సిపల్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించిన రాష్ట్ర మంత్రివర్యులు కొలుసు పార్థసారథి ఓ ఎస్ డి ప్రకాష్ రావు ఈ సందర్భంగా ఓ ఎస్ డి ప్రకాష్ రావు మాట్లాడుతూ రానున్న రెండు నెలల్లో నిర్దేశించిన లక్ష్యాలు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. మున్సిపల్ పరిధిలో జరిగే డ్రైనేజీలు, సెంట్రల్ లైటింగ్, సీసీ రోడ్లు, మరియు తాగునీటి వంటి సదుపాయాలు వెంటనే పూర్తి చేయాలని సూచించారు.మండలాల వారీగా జరిగే వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల నివేదికను సమర్పించాలని, పలు గ్రామాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు – తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ వంటివి అవసరం మేరకు త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. గ్రామాల్లో కావలసిన మౌలిక సదుపాయాల ప్రాముఖ్యతను గుర్తించి ఒక వారంలో పూర్తి నివేదిక సమర్పించాలని తెలియజేశారు. ఆ నివేదికను సంబంధిత శాఖల అధికారులకు సమర్పించి మౌలిక సదుపాయాలు వెంటనే ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.సిబ్బంది ప్రతిరోజూ మీకు కేటాయించిన గ్రామాల్లో పర్యటించి గడపగడపకు తిరిగి ప్రజలతో మమేకమై వారి అవసరాలు, సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల గురించి తెలుసుకుని, వాటి ప్రాముఖ్యతను గుర్తించి వెంటనే నిధులు మంజూరు చేసే ఏర్పాటు చేయాలి.రానున్న స్థానిక ఎన్నికల సమయానికి ముఖ్యమైన మౌలిక సదుపాయాలు ప్రజలకు ఏమాత్రం కొరత లేకుండా చూడవలసిన బాధ్యత మీదేనని అన్నారు. మండల అభివృద్ధి అధికారులు, ఇతర ప్రభుత్వ అధికారులు, గ్రామ రెవెన్యూ, విజన్ యాక్షన్ సిబ్బంది అందరూ సమన్వయంతో, అంకితభావంతో, సమయస్ఫూర్తితో పనిచేసి నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పడాలని



పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నూజివీడు మున్సిపల్ కమిషనర్ ఫీరయ్య మరియు సిబ్బంది, నాలుగు మండలాల ఎంపీడీఓలు, విజన్ యాక్షన్ ప్లాన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.